

చలిగాలుల తీవ్రతకు నయగారా జలపాతం గడ్డ కట్టుకుపోతున్న దృశ్యం


Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!





సంపుటి: 60 • సంచిక: 360 • గురువారం 4 జనవరి 2018 • విజయవాడ ✻ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad


**ముహూర్తం** శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ తదియ రా. 2.15 వరకు, అనంతరం చవితి ; నక్షత్రం: పుష్యమి ఉ. 10.22 వరకు, అనంతరం ఆశ్లేష; అమృతకాలం: లేదు; వర్జ్యం: రా. 10.26 నుండి 11.56 వరకు, దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

# సీమ ఇక సస్యశ్యామలం







- పార్టీ కల్చర్ హబ్‌గా మారుస్తున్నాం
- కరవులేని కడపగా చేస్తా
- 42 టీఎంసీల సాగునీరిస్తున్నాం
- రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు
- అరకోటి పింఛన్లు ఇస్తోంది మనమే
- పులివెందుల్లోనే 27వేల పింఛన్లు
- డ్వాక్రా మహిళలు నా మానస పుత్రికలు
- పులివెందుల జన్మభూమిలో చంద్రబాబు

**కడప, ప్రభన్యూస్ బ్యూరో:** కడప జిల్లాలో ఇకపై కరువు అనేదే ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల ధ్యాన్‌చంద్ క్రీడామైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన జన్మభూమి - మా ఊరు గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గండికోట నుంచి జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సుమారు 42 టీఎంసీల నీటిని అందిస్తున్నామని చెప్పారు. అందులోభాగంగా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 5 ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. కడప జిల్లాలో ఒక చరిత్ర

➪ 2వ పేజీలో...

## చిత్రావతి ఎత్తిపోతల ప్రారంభించిన సీఎం

- సాగునీటితోపాటు సురక్షిత మంచినీరు

2 లో

## వైకాపా ఎంపీ అవినాష్ కలకలం

- సీఎం చంద్రబాబుతో వాగ్వివాదం

# తాంత్రిక తతంగంపై ఈవోకు ఉచ్చు

- వేటుకు రంగం సిద్ధం
- ఘటనపై చంద్రబాబు సీరియస్
- సీఎంతో మంత్రి మాణిక్యాలరావు భేటీ
- ప్రాథమిక నివేదిక ఇచ్చిన సీపీ సవాంగ్
- రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక
- ఆ తర్వాతే చర్యలు తీసుకుంటాం: మంత్రి
- ఆంధ్రప్రభ వెలుగులోకి తెచ్చాకే నాకు తెలిసింది: ఈవో సూర్యకుమారి





అమ్మవారికి అర్ధరాత్రి పూజలా?

- మహిషాసుర మర్దిని అవతారమా?
- ఎవరి ఆదేశాల మేరకు పూజలు

తాంత్రిక పూజలపై ఆంధ్రప్రభ డిసెంబర్ 28న ప్రచురించిన వార్త ఇదే

**అమరావతి, ఆంధ్రప్రభ:** తప్పులు మీద తప్పులు చేసుకుంటూ వెళుతున్న దుర్గ గుడి ఈవో సూర్యకుమారిపై వేటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందంటున్నారు. తాజాగా గుడి అంతరాలయంలో క్షుద్రపూజల ఘటన వెనుక ఈవో హస్తం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడికావడంలో ఆమెపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. గతంలో ఓ వ్యవహారంలో హైకోర్టు కూడా ఆమెకు జరిమానా విధించింది. ఆ సందర్భంలోనూ ఆమె సారీ చెప్పారు. ధర్మకర్తల మండలి

➪ 7వ పేజీలో...

## కుప్పకూలిన దేవాలయాల వ్యవస్థ

- విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

7 లో



## రూ.9 వేల కోట్లతో వాటర్ గ్రిడ్

- సురక్షితమైన నీటి సరఫరాకు చర్యలు
- శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- మొత్తం 500 టీఎంసీల వినియోగానికి చర్యలు
- ఆంధ్రప్రభ ఇంటర్వ్యూలో మంత్రి నారా లోకేష్

వివరాలు 3లో...

# లౌకికంలో మతం రంగు



- ప్రపంచమంతా ఒకదారి... భారత్‌ది మరోదారి
- లౌకిక రాజ్యం పేరుకే... చేసేదంతా మత రాజకీయమే!
- ఒక్కో పార్టీ ఒక్కో మతానికి అండ
- ఓట్లను కొల్లగొట్టే వ్యూహాలు
- ప్రపంచంలో పెరుగుతున్న మతాతీత విధానం
- మనదేశంలో మాత్రం మతాధార అవకాశవాదం

**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

అల్లా, ఏసుక్రీస్తులు భారతదేశంలోకి, భారత రాజకీయాల్లోకి ప్రవేశించని 12వ శతాబ్దంలోనే ఒకే మతానికి చెందిన శైవులు, వైష్ణవులు శివుడు గొప్పంటే విష్ణువే గొప్పంటూ పరస్పర దాడులకు దిగి ఆధిపత్యం కోసం యుద్ధాలు చేసిన భారతదేశంలో ఇప్పటికీ మతాన్నే ఆలంబనగా చేసుకుని అధికార పద సోపానాలను అధిష్ఠించేందుకు భారత రాజకీయవేత్తలు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మతప్రాతిపదిక రాజకీయాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. ప్రపంచంలో మరే దేశంలో లేనన్ని మతాలు భారత్‌లో ఉన్నాయి. ఇక్కడ హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, జోరాష్ట్రీయన్లు, జుడాయిజం, బహాయి మతాలకు చెందిన వారంతా కలిసే జీవిస్తున్నారు. అనేక మతాలకు భారత్ పుట్టిల్లు. హిందూయిజం, బౌద్ధం, సిక్కు, జైనిజాలు ఇక్కడే ఆవిర్భవించాయి. జోరాష్ట్రియన్, బహాయి మత విశ్వాసకులు భారత్‌లోనే అత్య ధికంగా ఉన్నారు. ప్రపంచంలోనే అతిపురా తన మతాల్లో ఒకటిగా హిందూయిజం గుర్తిం పు పొందింది. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా ముస్లింలున్న మూడో దేశమిది. క్రైస్తవంలోని కేథలిక్‌లు, ప్రొటెస్టంట్లు, ఓరింటల్ ఆర్థోడాక్స్‌లు కూడా ఇక్కడున్నారు.

భారత్ పేరుకు లౌకికరాజ్యం. వాస్తవానికి ఇక్కడ అన్ని మతాలు సమానం. ప్రభుత్వం ఏ మతాన్ని ప్రోత్సహించకూడదు. అలాగే ఏ మతాన్ని కించపర్చకూడదు. పరస్పర ద్వేషాన్ని అనుమతించకూడదు. కానీ మత ఆధారిత రాజకీయ ప్రయోజ నాల కోసం ఇప్పటికే మతపరమైన యాత్రా స్థలాల సంద ర్శన కోసం ప్రభుత్వం

➪ 3వ పేజీలో...

- ఆధార్‌తో సరిపోలని చిరునామాలు
- రద్దవుతున్న పింఛన్లు
- మళ్లీ వస్తున్న దరఖాస్తులు
- వయోవృద్ధుల అగచాట్లు
- నిబంధనలను మార్చాలి
- ప్రభుత్వమే ఆదుకోవాలి



# పడని వేలిముద్ర!

**(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐదో విడత జన్మభూమి గ్రామసభల్లో పెద్దెత్తున దరఖాస్తుల్లో అత్యధికంగా పింఛన్ల కోసమే ఉంటున్నాయి. ఇందులో సగానికిపైగా రద్దయిన పింఛన్ల పునరుద్ధరణ కోసమే అందుతున్నాయి. ఇది ప్రజాప్రతినిధుల్ని, ప్రభుత్వాన్ని కూడా తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రాష్ట్రప్రభుత్వం ఎన్‌టీఆర్ భరోసా పథకం క్రింది పింఛన్లను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. 60ఏళ్ళుదాటిన వృద్ధులకు వెయ్యి రూపాయల చొప్పున నెలనెలా చెల్లిస్తోంది. అలాగే వికలాంగులకు 1500, వితంతువులకు వెయ్యి రూపాయల చొప్పున

➪ 3వ పేజీలో...

## జనపనార సంచుల్లోనే ఇక ప్యాకింగ్

- ఆహార ధాన్యాలు, చక్కెరకు తప్పనిసరి
- ఆంధ్రప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలకు లబ్ధి
- కేంద్రమంత్రి వర్గం నిర్ణయం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** చక్కెర, ఆహార ధాన్యాలను జనపనార సంచుల్లోనే తప్పనిసరిగా ప్యాక్ చేయాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించింది. 2017-18 సంవత్సరాన్ని జనపనార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. చక్కెర, ఆహార ధాన్యాలను జనపనార సంచుల్లోనేతప్పనిసరిగా ప్యాక్ చేయాలని నిర్ణయంతో ఆ రంగానికి ప్రోత్సహం లభిస్తుందని, ఉపాధి అవకాశాలకు పెరుగుతాయని కేంద్రం అంచనా వేసింది. జులై 2017 నుంచి జూన్ 2018 వరకు కేంద్రం జనపనార సంవత్సరంగా

➪ 7వ పేజీలో...

# తలాక్ పడేనా?!



- పెద్దల సభలో గందరగోళం
- బిల్లు ప్రవేశపెట్టిన బీజేపీ
- స్థాయీ సంఘానికి పంపాలన్న కాంగ్రెస్
- నోటీస్‌పై ఓటింగ్‌కు పట్టు
- నేటికి వాయిదా...
- రేపటితో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లుకు బ్రేక్ పడింది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ పార్టీ సహ విపక్షాలు పట్టుబట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. దాంతో రాజ్యసభ గురువారానికి వాయిదా పడింది. బుధవారం మధ్యాహ్నం రాజ్యసభలో కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రవేశపెట్టారు. అయితే దీనిని సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఆనంద్ శర్మ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్‌ను 6 నెలల పాటు రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఈలోగా రాజకీయ పార్టీలన్నీ పార్లమెంటులో దీనిపై చట్టం చేయాలని సూచించిందన్నారు. ఆరునెలల గడువు వచ్చే ఫిబ్రవరి 22తో పూర్తవుతున్న నేపథ్యంలో బిల్లును అత్యవసరంగా చేపట్టాలని కోరారు. ఈ బాధ్యత అందరిపై ఉందని కనుక బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సంప్రదాయలన్నింటిని ఉల్లంఘిస్తోందని, 24 గంటల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉండగా, ఆకస్మికంగా ఓటింగ్‌కు నోటీసు ఎలా ఇస్తారని ప్రతిపాదిస్తారని ప్రశ్నించారు. అయితే పార్లమెంటు రబ్బర్ స్టాంప్ కాదని, తమ పార్టీ వైఖరిని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ సమర్థించుకున్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపాదనకు 17 పార్టీల మద్దతు ఉందని ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ అన్నారు. అన్నాడీంకే, బీజేడీ, టీడీపీ సైతం ఈ డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని చెప్పారు. అయినా ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదని

➪ 7వ పేజీలో...

ఔరా..!



# సీమ ఇక సస్యశ్యామలం

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టించామని, భవిష్యత్‌లో సాగునీటితో అత్యధికంగా ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఉంటుందన్నారు. లింగాలలో నాణ్యమైన అరటి పంట సాగు ఉందని చెప్పారు. రాయలసీమ ప్రపంచంలోనే ఒక హార్టికల్చర్‌హబ్‌గా మారనుందని పేర్కొన్నారు. రాయలసీమ తిరుగులేని ఆర్థికశక్తిగా ఎదగనుందని తద్వారా ఒక మణిహారంగా నిలువనుందని చెప్పారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.50 వేల కోట్లను ఖర్చు చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో సోమశిలను నింపవచ్చన్నారు. దీంతో కడప జిల్లాలో పూర్తిగా కరువు ఛాయలను పారదోలవచ్చని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో, సమాజంలో ప్రజల

శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటేనే చేసే పనిలో ఫలితం ఉంటుందన్నారు. తాను చేసే పనిలో ఆనందం పొందడం వల్లే విసుగు, విరామం ఉండదని చెప్పారు. ప్రతి ఒక్కరూ మంచి పనులు చేయాలన్నారు. ఈ ప్రభుత్వం ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఇటీవల హ్యాపీ ఇండెక్స్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రజలకు భవిష్యత్ ఎలా ఉంటుందోననే ఆందోళన ఉండేదన్నారు. కష్టాల్లోనే అవకాశాలను వెతుక్కుని ముందుకు వెళుతున్నామన్నారు. 2022కు దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒక్కటిగా, 2029కి దేశంలోనే నెంబర్1 రాష్ట్రంగా, 2050కి ప్రపంచంలోనే ఒక అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతామన్నారు. 30,35 కుటుంబాలకు ఒక సాధికార

## ‘చిత్రావతి’ ఎత్తిపోతల ప్రారంభించిన సీఎం



పార్నపల్లె వద్ద ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

**కడప, ప్రభన్యూస్ బ్యూరో:** కడప జిల్లా పులివెందుల నియోజక వర్గం లింగాల మండలం పార్నపల్లె వద్ద నిర్మిత మైన గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా 5 ఎత్తిపోతల పథకాల నుంచి సీబీఆర్‌లోకి నీటిని సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం అధికారికంగా విడుదల చేశారు. ఈ నీటి విడుదల వల్ల పులివెందుల నియోజక వర్గంలోని 55 వేల ఎకరాల ఆయకట్టుకు, అలాగే నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందే వీలుంది. అలాగే లింగాల కుడిగట్టు కాలువ కింద సాగు ఆయకట్టుకు ఈ నీరు ప్రయోజనకారిగా ఉండే వీలుంది. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం పైలాన్ ను లాంఛనంగా ఆవిష్కరించిన సీఎం ఆ తర్వాత అక్కడ విడుదలైన నీటికి జలహారతి ఇచ్చారు. అనంతరం అక్కడే జరిగిన రైతు సంఘాల ప్రతినిధులు, ఆయకట్టు రైతులతో సీఎం మాట్లాడుతూ పులివెందుల నియోజక వర్గంలోని సాగుకు నీరు అందించడమేకాక, నియోజక వర్గ వ్యాప్తంగా రైతులు పండించే ఉద్యానపంటలు, సాధారణ పంటలకు సైతం పుష్కలంగా నీరు అందే అవకాశం ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం పులివెందుల ప్రాంతానికి కుప్పం కంటే ముందుగా నీరు ఇస్తామని తాను పదేపదే చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులు కూడా ఈ నీటిని ఉపయోగించుకుని తమ కుటుంబాలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు కష్టపడాలని ఆయన రైతులను కోరారు. ఆ తర్వాత ఆయన ఎత్తిపోతల పథకం ప్రారంభం ఆవరణలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను, మ్యాపింగ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి, సి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు బీటెక్‌రవి, రామసుబ్బారెడ్డి, పులివెందుల నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సతీష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షులు ఆర్ శ్రీనివాసుల రెడ్డి, నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కలెక్టర్ బాబూరావు నాయుడు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు శ్రీవాణి, ఇతర టీడీపీ నాయకులు, అధికారులు, అనధికారులు, రైతులు పాల్గొన్నారు.

సహకారం లేనిదే ఏదీ విజయవంతం కాదన్నారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అని పిలుపు నిచ్చారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా హామీ ఇచ్చిన మేరకు రూ.24వేలకోట్లతో రైతులను రుణవిముక్తి చేయడం జరిగిందన్నారు. మూడో విడత రుణ మాఫీకి సంబంధించి నాలుగు రోజుల్లో పూర్తిగా జమ చేయడం జరుగుతుందని చెప్పారు. డ్వాక్రా సంఘాలు తానే ఏర్పాటు చేశానని, ఈ సంఘాలు తన మానసపుత్రిక అని సీఎం పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.6 వేలు పెట్టుబడి నిధిని అందించామని త్వరలో మిగిలిన రూ.4 వేలు కూడా అందజేస్తామన్నారు. ప్రజలకు సమస్యలు పరిష్కారం కావాల్సి వస్తే 1100 కు ఫోన్ కాల్ చేసి తెలియజేవచ్చన్నారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించే బాధ్యత తమా తీసుకుంటామన్నారు. జన్మభూమి, మాఊరు కార్యక్రమంలో భాగంగా 10 అంశాలను ఒక్కొక్క రోజు ఒక అంశాన్ని చర్చించడం జరుగుతోందని చెప్పారు. రెండవ రోజు ఆరోగ్యం-ఆనందం అనే అంశాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు.

మిత్రను నియమించడం జరుగుతోందని , ఈ మిత్రలకు పేదలకు సేవ చేసే అవకాశం దక్కిందన్నారు.

జన్మభూమి - మా ఊరు గ్రామసభలో వచ్చే సమస్యలను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తున్నా మన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ వారికి ఇంటి పట్టాలులేవని, అలాంటి వారికి 50 వేల వరకు పట్టాలుఇవ్వడం జరిగిందన్నారు. అలాగే సీలింగ్ భూములు సాగు చేసుకుంటున్నప్పటికీ వారికి భూమి పట్టాలు లేవని అలాంటి వారికి 20 లక్షల ఎకరాల వరకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. జన్మభూమి కార్యక్రమం ముగిసేలోగా ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ జన్మభూమిలో 4 లక్షలకు పైగా ఫింఛన్లు, 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత 2.50 లక్షల గృహ ప్రవేశాలు చేయడం జరుగు



తుందని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 15 వేల కిలో మీటర్ల సీసీ రోడ్లను నిర్మించడం జరిగిందని, 9 లక్షల ఫారంఫాండ్లు పూర్తి చేశామని తెలిపారు. మార్చిలోపు ఈ-ఆఫీసు ప్రవేశపెడుతున్నామని ఎక్కడా ఏ ఫైల్ పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. 5 వేల వర్చువల్ క్లాస్ రూమ్‌లు ప్రవేశపెడుతున్నా మని చెప్పారు. దీని ద్వారా నాణ్యమైన విద్యను అందించడం

జరుగుతుందన్నారు. పులివెందుల నియోజక వర్గంలో మొత్తంఇప్పటి వరకు 27 వేల ఫింఛన్లు అంది స్తున్నామని ప్రకటించారు. ఈ జన్మభూమిలో మరో 2 వేల ఫింఛన్లు మంజూరు అయ్యాయనిచెప్పారు. శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మెన్ ఎస్‌వి సతీష్‌రెడ్డి మరో 1600 ఫింఛన్లు మంజూరు చేస్తే ఈ ప్రాంతంలో వందశాతం ఫింఛన్లు అందించిన వారం అవుతామని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన సీఎం అక్కడికక్కడే మంజూరు చేస్తున్న ప్రకటించారు. పులివెందుల అభివృద్ధి పనుల కోసం వివిధ కార్యక్రమాల కింద సుమారు రూ.47 కోట్లను అప్పటి కప్పుడు మంజూరు చేస్తున్నట్లు సీఎం సభాముఖంగా ప్రకటించారు. హిజ్రాలకు రుణాలను మంజూరు చేశారు. పలువురు హిజ్రాలు మాట్లాడుతూ తమను మనుషులుగా గుర్తించిన చంద్ర బాబు మాదేవుడుఅని కొనియాడారు. ఇకపై అందరికీ వర్తింప చేస్తున్న అన్ని పథకా లను వారికి అందిస్తామని సీఎం ప్రకటించారు. హిజ్రాలు కూడా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. చంద్రబాబుకు ఉద్యానవన రైతులు పండ్లతో తయారు చేసిన గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రు లు ఆదినారాయణ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వర రావు, ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్సీ, విప్ రామసుబ్బారెడ్డి, కలెక్టర్ బాబూరావు నాయుడు, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మెన్ ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాసులరెడ్డి, పౌరసరఫరాలసంస్థ ఛైర్మెన్ లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, వీరశివారెడ్డి, రమేష్ కుమార్‌రెడ్డి, బ్రహ్మయ్య, కస్తూరి విశ్వనాథ నాయుడు, మాజీఎమ్మెల్సీ పుత్తానరసింహారెడ్డి, టీడీపీ నేతలు రామగోపాల్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్‌ఛైర్మెన్ తూగుట్ల రాఘవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్‌ఛైర్మెన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా ఎంపీ అవినాష్ కలకలం

## సీఎం, ఎంపీల మధ్య వాగ్వివాదం

**కడప, ప్రభన్యూస్ బ్యూరో:** కడప జిల్లా పులివెందుల్లో బుధవారం సాయంత్రం జరిగిన ఐదో విడత జన్మభూమి - మా ఊరు గ్రామసభలో సీఎం చంద్రబాబు నాయుడు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల మధ్య కొద్ది సేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. అయితే ఇద్దరి మధ్య నెలకొన్న వాతావరణాన్ని త్వరలోనే సమసిపోవడంలో అటు సీఎం, ఇటు ఎంపీ అవినాష్‌లు ఎవ్వరిమటుకు వారు వ్యవహరించడంతో వివాదం సర్దుమణిగింది. వివరాల్లోకి వెళితే... జన్మభూమి గ్రామ సభ చివరిలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గండికోట - సీబీఆర్ ఎత్తిపోతల పథకం పనులు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సుమారు రూ.1350 కోట్ల అంచనా వ్యయంతో మొదలై రూ.1100 కోట్లతో సుమారు 85 శాతం పనులు పూర్తయ్యాయని, తర్వాత మిగతా పనులు పూర్తి అయి ఈ రోజు ముఖ్యమంత్రి ఆ ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. ఇంత లోనే సీఎం చంద్రబాబు లేచి అవినాష్‌రెడ్డితో మాట్లాడుతూ ‘ఇది రాజకీయ వేదిక కాదు! రాజకీయాలు మాట్లాడాలనుకుంటే మీకు, మాకు వేరే వేదికలు ఉన్నాయి. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి సమస్యలు ఏవైనా ఉంటే లిఖిత పూర్వకంగా ఇవ్వండి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తా! ఎవ్వరు ఎప్పుడు ఏం చేశారో చెప్పాలనుకుంటే చాలా ఉంది’ అంటూ సీఎం ఎంపీ అవినాష్ రెడ్డితో మాట్లాడుతుండగా వేదికపై ఉన్న టీడీపీ కార్యకర్త ఒకరు అవినాష్ చేతిలో మైకును లాక్కో బోయారు. అవినాష్ ఆ కార్యకర్తను ఉద్దేశించి సీరియస్‌గా వ్యాఖ్యానించారు. ఇంతలోనే సీఎం చంద్రబాబు కూడా ఆ కార్యకర్తను వారించడంతో పాటు అవినాష్ ప్రసంగానికి సమాధానం చెప్పేందుకు ముందుకు వచ్చిన టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులను వారించారు. ఇంతలో అవినాష్‌రెడ్డికూడా నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపు వేదికపైన, సభా ప్రాంగణంలో గందరగోళం నెలకొంది. ఒక దశలో అవినాష్‌రెడ్డి ప్రసంగం చేస్తున్న సమయంలో గోబ్యాక్ ఎంపీ, గోబ్యాక్ వైఎస్సార్‌పార్టీ అంటూ నినాదాలు చేస్తూ కుర్చీలను పైకి ఎత్తి విసిరేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు రంగప్రవేశంచేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఆ తర్వాత సీఎం తన ప్రసంగాన్ని యధావిధిగా కొనసా గిస్తూ ఎవ్వరో చెపితే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదన్నారు. ప్రజల కోసం ఎన్నో సాగు నీటి పథకాలను పూర్తి చేశామని, నాలో శక్తి ఉన్నంత వరకు నిరంతరం రాష్ట్రాభివృద్ధి కోసం శ్రమిస్తూనే ఉంటానని, ఇలాంటి విషయాలను వక్రీకరించి మాట్లాడటం పద్ధతి కాదని, ఘర్షణ లకు దారితీసే పరిస్థితులను తీసుకురావద్దన్నారు. ప్రజలకు న్యాయం చేసేందుకే ప్రతి ఒక్కరూ పాటు పడాలని సూచించారు.





చంద్రబాబు, అవినాష్‌లమధ్య వాగ్వివాదం

# కృషి వైఎస్‌ది... గొప్పలు బాబువి!



పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

## ● కలికిరి సభలో ధ్వజమెత్తిన జగన్

**తిరుపతి, ప్రభన్యూస్‌బ్యూరో:** పులివెందుల జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రసంగం ఆయన గత మూడున్నరేళ్లుగా కొనసాగిస్తున్న మోసపూరిత పరిపాలనకు సజీవసాక్ష్యం వంటిదని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం ఆయన పీలేరు నియోజకవర్గం కలికిరిలో బహిరంగసభ నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ బుధవారం ఉదయం పులివెందులలో నిర్వహించిన జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలు చెప్పి నిజమని నమ్మించే ప్రయత్నాలు చేశారని విమర్శించారు. పులివెందులకు సంబంధించిన రూ. 763 కోట్ల పైడిపాలెం ప్రాజెక్టుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రూ. 740 కోట్లు వెచ్చిస్తే చంద్రబాబు ప్రభుత్వం గత మూడున్నరేళ్లలో రూ. 23 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రూ. 312 కోట్ల చిత్రావతి కి వైఎస్సార్ ప్రభుత్వం రూ. 290 కోట్లు ఖర్చు చేస్తే చంద్రబాబు ప్రభుత్వం రూ.20 కోట్లు వెచ్చించిందన్నారు. రూ. 1340 కోట్ల చిత్రావతి లిఫ్ట్ పనులకు వైఎస్సార్ ప్రభుత్వం రూ. 1.100 కోట్లు ఖర్చు చేస్తే చంద్రబాబు ప్రభుత్వం రూ.72 కోట్లు మాత్రమే వెచ్చించిందన్నారు. దాదాపుగా 95 శాతం పూర్తయిన పనులను ప్రారంభించిన చంద్రబాబు తాను రాత్రింబవళ్ళు కష్టపడి పులివెందులకు నీళ్లిచ్చానని చెప్పుకోవడం మోసపూరిత వ్యవహారానికి పరాకాష్ట వంటిదన్నారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి హంద్రీ-నీవా ప్రాజెక్టు పనుల తొలిదశ పనులను వైఎస్సార్ చాలావరకు పూర్తిచేసినా గత మూడున్నరేళ్లలో చంద్రబాబు ఎందుకు పూర్తి చేయలేక పోయారని ప్రశ్నించారు. కేవలం ఆశించిన రీతిలో చంద్రబాబుకు కమీషన్లు రాకపోవడం వల్లనే హంద్రీ-నీవా ప్రాజెక్టు పనుల నత్తనడక నడుస్తున్నాయని జగన్ తీవ్రంగా ఆరోపించారు. అదేవిధంగా చంద్రబాబు తనకు చెందిన హెరిటేజ్ డైరీ కోసం కుప్పకూల్చిన చిత్తూరు సహకార డైరీని కూడా తాను అధికారంలోకి రాగానే తెరిపిస్తానన్నారు. తాను ప్రకటించిన నవరత్నాల హామీలలో రైతు సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ రూ. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రైతుల రుణాల వడ్డీ మాఫీ, రూ. 2 వేల కోట్లతో కరవు సహాయక నిధి వంటి అంశాలను గురించి తెలియజేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో తాను మారిపోయానని చెప్పి నమ్మపలుకుతూ, బంగారు కడియమిస్తానని ఆశపెడుతున్నారని ఎద్దేవా చేశారు.

ఈ సభలో పాల్గొన్న రాజంపేట లోక్‌సభ సభ్యుడు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే జాబొస్తుందన్న చంద్రబాబు హయాంలో పప్పులాంటి నారా లోకేష్‌కు తప్ప ఎవరికీ జాబు రాలేదన్నారు. పీలేరు శాసన సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపక్షాలకు చెందిన శాసనసభ్యులు గెలిచిన నియోజకవర్గాలకు ద్రోహం చేస్తోందని ఆరోపించారు. మాజీముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్వస్థలమైన పీలేరు నియోజకవర్గంలో ఉదయం నుంచి సాయంత్రంవరకు జగన్ కొనసాగించిన పాదయాత్రలో, కలికిరి సభలో విశేషసంఖ్యలో ప్రజలు పాల్గొనడం పట్ల పార్టీ వర్గాలు హర్షాతిరరేకాన్ని వ్యక్తం చేశాయి.



## జగన్‌కు ఈడీ షాక్

### అక్రమాస్తుల కేసులో రూ.117.74 కోట్ల ఆస్తులు సీజ్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఏపీ రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి ఝలక్ ఇచ్చింది. అక్రమాస్తుల కేసులో ఇప్పటి వరకు దాదాపు రూ. 1900కోట్ల ఆస్తులను సీజ్ చేసిన ఈడి తాజాగా మరో రూ.117.74 కోట్ల ఆస్తులను సీజ్ చేసింది. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ అక్రమాస్తులను కూడగట్టాడన్న అభియోగంపై దర్యాప్తు జరిపిన సిబిఐ ఆయనపై 10 చార్జ్‌షీట్‌లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. సిబిఐ కోర్టుకు సమర్పించిన చార్జ్‌షీట్‌లోని దర్యాప్తు అంశాలను ఆధారంగా చేసుకున్న ఈడి కేసులను నమోదు చేసింది. సిబిఐ అంశాల వారిగా చార్జ్‌షీట్‌లను దాఖలుచేయగా,వాటిలోని ఆధారాలమేరకు ఈడీ చర్యలు తీసుకుంటోంది. బెంగళూరులోని నివాసంతో పాటు పలు చోట్ల ఉన్న ఆస్తులను ఇప్పటికే ఈడి సీజ్ చేయగా, తాజాగా గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన చార్జ్‌షీట్‌లోని ఆస్తులు, ఇందు ప్రాజెక్టు అధినేత శ్యాంప్రసాద్‌రెడ్డికి సంబంధించిన స్థిర ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు,జితేంద్ర విర్వాణీకి చెందిన ఎంబసీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్ ఆస్తులు, వివి కృష్ణప్రసాద్‌కు చెందిన వసంత ప్రాజెక్టు ఆస్తులను ఈడి సీజ్ చేసింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో శ్యాంప్రసాద్‌రెడ్డికి చెందిన కంపెనీకి లెపాక్షి నాలెడ్జ్ హబ్ కోసం అనంతపురం జిల్లాలో 8844 ఎకరాలు, శంషాబాద్ సమీపంలో 250 ఎకరాలతో పాటు చోట్ల హౌసింగ్ ప్రాజెక్టుల కోసం విచ్చలవిడిగా భూములను కేటాయించారు. ఈ భూములను పొందినందుకు శ్యాంప్రసాద్ రెడ్డి జగన్‌కు సంబంధించిన కంపెనీలలో పెట్టుబడులు పెట్టారని ఈడి దర్యాప్తులో బహిర్గతమైంది. శ్యాంప్రసాద్‌రెడ్డి అనుచరుడైన జితేంద్ర విర్వాణీ కూడా చౌకగా భూములను దక్కించుకున్నందుకు జగన్ కంపెనీలో పెట్టుబడులు పెట్టారని బహిర్గతమైంది.

# నిధుల సమీకరణ ఎలా?

● ఖజానాపై పెనుభారం ● సంక్రాంతిలోగా కావల్సింది రూ.7,300 కోట్లు

● అందుబాటులోకి వచ్చేది రూ.2,150 కోట్లు ● కార్పొరేషన్ల నిధులపై కన్ను

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఈ ఆర్థిక సంవత్సర చివరి త్రైమాసికం ప్రారంభంలోనే రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. అత్యవసరాలకోసం పెద్ద మొత్తంలో ఓవర్ డ్రాఫ్ట్‌కు కూడా వెళ్లింది. ఖజానాలో కేవలం అతి తక్కువ మొత్తం అందుబాటులో ఉండటంతో, ఇక అప్పులపైనే ఆధారపడాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చే ఆదాయం, చేయాల్సిన ఖర్చులను బేరీజు వేస్తే కేవలం సంక్రాంతి పండుగ రోజు నాటికే రూ. 5 వేల కోట్లకుపైగా లోటు నెలకొంటోంది. ఈ కారణంగానే ఇతర సంస్థలనుండి నిధులను సేకరించేందుకు ఆర్థిక శాఖ కసరత్తుచేస్తోంది. తొలి మూడు త్రైమాసికాల్లో ఆర్థిక ఒడిదుడుకులు అనేకం ఎదురయ్యాయి. అనునిత్యం అప్పులతోనే ముందుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరకు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. చివరి త్రైమాసికంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారుల అంచనామేరకు 15వ తేదీ లోగా రూ. 7 వేల కోట్లకుపైగా నిధులు కావాల్సి ఉంటుంది. ఇందులో జీతాలు, పింఛన్లకు రూ. 4 వేల కోట్లు, రుణాలపై అసలు, వడ్డీ చెల్లింపులకు రూ. 800 కోట్లు, ఇప్పటికే ఉన్న ఓవర్ డ్రాఫ్ట్ చెల్లింపులకు దాదాపు రూ. 2 వేల కోట్లు, దైనందిన ఖర్చులకు రూ. 600 కోట్లు కావల్సి ఉందని అంచనా వేస్తున్నారు. కానీ వస్తుందని ఆశిస్తున్న ఆదాయం మాత్రం సుమారు రూ. రెండు వేల కోట్లుగానే కనిపిస్తోంది. రాష్ట్రపన్నుల ద్వారా రూ. 1500 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ. 200 కోట్లు, జీఎస్టీ ద్వారా రూ. 100 కోట్లు వరకు, ఆదాయం లోటుగా కేంద్రం నుండి రూ. 300 కోట్లు వరకు వస్తుందని ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. మొత్తం మీద రూ. 5 వేల కోట్లకుపైగా లోటు ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. దీంతో ఇతర మార్గాల్లో నిధులు సమీకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇతర ప్రభుత్వరంగ సంస్థలు తీసుకున్న అప్పులను పీడీ ఖాతాల ద్వారా రాష్ట్ర ఖజానాకు మళ్లించాలని, ఆ నిధుల ద్వారా తమ అవసరాలను తీర్చుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రధానంగా నీటిపారుదల అభివృద్ధి సంస్థ, రోడ్డు అభివృద్ధి సంస్థ, ఏపీఐఐసీ, ఎపీఎస్‌సీఎస్‌పీఎల్ వంటి సంస్థల్లో ఉన్న నిధులపై కసరత్తు ప్రారంభించారు. వీటి నుండి దాదాపు రూ. 4 వేల కోట్ల వరకు సమీకరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇవి వచ్చిన వెంటనే ఓవర్ డ్రాఫ్ట్ నుండి బయటపడడమే కాకుండా, అవసరాలు కూడా తీర్చుకోవచ్చని భావిస్తున్నారు. అయితే, ఇతర సంస్థల నిధుల ద్వారా జనవరి నుండి గట్టెక్కినప్పటికీ, ఫిబ్రవరి, మార్చి నెలల పరిస్థితి ఏమిటన్నది మళ్లీ ప్రశ్నార్థకమే అవుతోందని ఒక సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం

● ప్రభుత్వం చుట్టూ తిరగాల్సిన రోజులు పోయాయి ● రియల్ టైం గవర్నెన్స్‌తో సమస్యలు పరిష్కారం ● ఆటో క్లోరినేషన్‌తో సురక్షిత తాగునీరు ● పోరంకి జన్మభూమి కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



**అమరావతి, ఆంధ్రప్రభ:** జన్మభూమి ఐదోవిడత కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రభుత్వం చుట్టూ తిరగాల్సిన రోజులు పోయాయని, ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల ముందుకు వస్తుందని ఐటీ మంత్రి లోకేష్ అన్నారు. బుధవారం కృష్ణాజిల్లా, పెనమలూరు నియోజకవర్గం, పోరంకి జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దేశంలో ఏప్రభుత్వం చేయని విధంగా రియల్ టైం గవర్నెన్స్ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. మీఇంటి సమస్యలు మీఇంటికి వచ్చి ప్రభుత్వం పరిష్కరిస్తుందని, మీసమస్య గురించి మీరు ఫిర్యాదు చెయ్యకముందే తెలుసుకొని పరిష్కారం చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. 2014కు ముందు గ్రామాల్లో కరెంటు ఉండేది కాదని, ఇప్పుడు 24గంటలు కరెంటు సరఫరా జరుగుతోందన్నారు. ఇప్పుడు పింఛను రూ.1000 అందిస్తున్నామని, లోటు బడ్జెట్ ఉన్నా రైతు రుణమాఫీ చేశామని, డ్వాక్రా రుణాలు మాఫీ చేశామని, ఇప్పటికే రూ.6వేలు ఇచ్చామని మరో రూ.4వేలు త్వరలోనే అందిస్తామన్నారు. దేశంలో ఏరాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా సీఎం చంద్రబాబు నదుల అనుసంధానం చేశారన్నారు.

ఆరోగ్యంగా లేకపోతే ఇంట్లో ఆనందం ఉండదని, ఎన్టీఆర్‌వైద్య సేవలో 900 వ్యాధులకు వైద్య సేవలు అందిస్తుంటే ఇప్పుడు మరో 100 వ్యాధులు కలిపి 1044 వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. తాగు నీరు నాణ్యతను తెలుసుకోవడానికి ఓవర్ హెడ్ ట్యాంక్స్‌లో సెన్సార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆటో క్లోరినేషన్ ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని, త్వరలోనే గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఆదేశాలతో 10 స్టార్ రేటింగ్ ఇవ్వబోతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ కొనకళ్ల, పెనమలూరు ఎమ్మెల్యే ప్రసాద్, ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, బచ్చుల అర్జునుడు, జిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం,అధికారులు పాల్గొన్నారు.

### ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి లోకేష్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తనని కలవడానికి వచ్చిన ప్రజలను మంత్రి లోకేష్ కలిసి వారి నుండి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్‌గురువారం గుంటూరు జిల్లా తెనాలి నియోజక వర్గంలోని కొల్లిపర మండలం, అత్తోట గ్రామంలో జరగబోయే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# అత్యున్నత జీవన ప్రమాణాల రాష్ట్రంగా ఏపీ

● 80% ప్రజా సంతృప్తే లక్ష్యం ● పోటీతత్వం పెంచేందుకే గ్రేడింగ్‌లు ● టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, వార్డులు అత్యుత్తమంగా రూపొంది మంచి సమాజంగా ఏర్పడాలనే లక్ష్యంతో అతిపెద్ద సామూహిక ప్రజా కార్యక్రమం అయిన జన్మభూమిని చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన పోటీతత్వం పెంపొందిం చడం ద్వారా అత్యున్నత జీవన ప్రమా ణాలు కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించాలని ఆ దిశగా అధికారయంత్రాంగం బాధ్యత తీసుకొని పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. ప్రజా సంతృప్తి, అభివృద్ధి, సంక్షేమం, అధికారుల పనితీరుకు కొలమానమని 80 శాతం ప్రజలు సంతృప్తి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి రెండవ రోజు జన్మభూమి కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ విడత జన్మభూమి-మా ఊరు తొలిరోజు విజయవంతమైందని ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.

గ్రామ, వార్డుల్లో జరిగే గ్రామ సభల్లో ప్రజలందరిని భాగస్వాములు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. కృష్ణా పుష్కరాల్లో 90 శాతం ప్రజా సంతృప్తి సాధించామని జన్మభూమిలో కూడా అదే స్ఫూర్తి కొనసాగాలని ఆకాంక్షించారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సమర్థవంతంగా పనిచేసి ప్రజల్లో సానుకూలతను సాధించాలన్నారు.

ప్రజా సేవలో పోటీతత్వం పెంచేందుకే జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి గ్రేడింగ్ ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. జన్మభూమి నిర్వహణపై గ్రామాలు, వార్డులకు రోజువారి గ్రేడింగ్‌లు ఇస్తామని చెప్పారు. ప్రతి రోజు నివేదికలు రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పంపించాలని ఆదేశించారు. నివేదికలు సకాలంలో పంపినందుకు 40 శాతం, గ్రామ స్థాయి సర్వేకు 40 శాతం మిగిలిన 20 శాతం మార్కులు జిల్లా స్థాయిలో సెటిల్‌మెంట్ ఎనాలసిస్‌కు ఇస్తామన్నారు. తొలి రోజు విజయనగరం, కడప, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలో ఏ గ్రేడ్ సాధించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. నెల్లూరు, విశాఖ, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు బి గ్రేడ్ లభించినట్లు వెల్లడించారు.

అన్ని జిల్లాలో పోటీతత్వం పెరిగి ఏ గ్రేడ్ సాధించేలా పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. నగరికల్లు, తిక్కవోలు, కొత్తపల్లి, అమలాపురం, పెందుర్తి, తదితర మండలాలు ఏ గ్రేడ్ సాధించగా కొత్తపల్లి, అశ్వపురం, నక్కపల్లి, ఎగువతంబళ్లపల్లి గ్రామాలు ఏ గ్రేడ్‌లో ఉన్నాయని తెలిపారు. గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగా క్రమ శిక్షణతో జరిగేలా చూడాలని ఎవరైనా అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారయంత్రాంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆర్థికపరమైన వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. జమాబందీ తరహాలో ఫిర్యాదుల పరిష్కారం శరవేగంగా జరగాలన్నారు.

### జన్మభూమిపై ప్రజాభిప్రాయ సేకరణ



జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరిగిన తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. అర్హులకు ఫించన్లు, రేషన్ పంపిణీ, ఆర్జీల పరిష్కారం, చంద్రన్న బీమా తదితర అంశాల పరిష్కారం, అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు, పశ్చిమగోదావరి, నెల్లూరు, కృష్ణా చిత్తూరు, ప్రకాశం, జిల్లాలో తొలిరోజు ప్రజల నుంచి 70 శాతం నుంచి 80 శాతం వరకు సంతృప్తి వ్యక్తమైందని అనంతపురం, విశాఖపట్నం, కడప, కర్నూలు జిల్లాలో 60 నుంచి 70 శాతం సంతృప్తి శాతం వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. 80 శాతం సంతృప్తే లక్ష్యంగా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. సాధికార మిత్రలు, జన్మభూమి కమిటీలు స్థానిక సంస్థల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకో వాలని అధికార యంత్రాంగానికి సూచించారు. సాధికారమిత్రలను విలేజ్ రీసోర్స్ పర్సన్స్‌గా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాధికారమిత్రల పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నామని చెప్పారు. తీసుకునే ఆహారం, తాగేనీరు, పరిసరాల పరిశుభ్రత, జీవన విధానంపై ప్రతి ఒక్కరి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంతో ఆహారంలో పోషక విలువలు పెరిగేలా చర్యలు చేపట్టా మని అదే విధంగా అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. శారీరక వ్యాధులను చాలా వరకు నియంత్రిస్తున్నామని మానసిక వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించాలని అప్పుడే వాటిని అధిగమించగలమని స్పష్టం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, సంక్షేమం, ప్రణాళిక శాఖ రియల్ టైం గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్ అధికారులు ఎస్.ఎస్.రావత్, సంజయ్‌గుప్తా, బాబు.ఎ, రామాంజనేయులు, కృష్ణమోహన్‌తో పాటు వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ ఆఫీసర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.9 వేల కోట్లతో వాటర్ గ్రిడ్



- సురక్షితమైన నీటి సరఫరాకు చర్యలు
- 'ఆంధ్రప్రభ' ఇంటర్వ్యూలో మంత్రి నారా లోకేష్

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన, ఆరోగ్య కరమైన మంచినీటిని సరఫరా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. బుధవారం ఆయన 'ఆంధ్రప్రభ'తో ప్రత్యేకించి, మాట్లాడారు. ఇందుకు సం బంధించిన మంచినీటి గ్రిడ్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9000 కోట్లతో ప్రతి పాదనలు రూపొందించడం జరిగిందన్నారు. ఇందు నిమిత్తం రూ. 4,500 కోట్లను బయట సంస్థల నుంచి రుణంగా సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నిధులతో నీటి గ్రిడ్ నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అవసరమైన రుణాన్ని తీసుకునేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని తెలి పారు. ఫండ్ ,మైనింగ్ సెస్, పంచాయతీ సెస్ రూపంలో సేకరించిన రూ. 300 కోట్లను డౌన్ చెల్లింపులు చేయనున్నట్లు చెప్పారు.. నీటి గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా రాయలసీమ జిల్లాలు, ఉత్తర కోస్తాంధ్ర ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందులో భాగంగా సురక్షిత మైన తాగునీరు అందించడానికి వార్షికంగా ఎంత ఖర్చు చేయాలో నిర్ణయించడం జరిగిందన్నారు. సెస్ రూపంలో వచ్చిన సొమ్మును వినియోగించుకునేందుకు పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారని తెలిపారు. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది జూన్ చివరినాటికి కృష్ణా,పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రతి ఇంటికి సురక్షితమైన మంచి నీటిని సరఫరా చేసేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అయితే పైలట్ ప్రతిపాదికన శ్రీకాకుళం,ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పథకాన్ని అమలు చేయబోతున్నామన్నారు. మూత్ర పిండాల వ్యాధు లున్న ప్రాంతాల్లో ప్రధానంగా మంచి నీటి వనరులను ఏర్పాటు చేయడం ద్వారా తాగునీటి సమస్యను గ్రిడ్‌పరిష్కరిస్తుందన్నారు. కృష్ణా,గోదావరి నదీ జలాలను ట్యాంకులు,చెరువులకు మళ్లించడం ద్వారా నీటి సమస్యకు మరింత పరిష్కారం లభిస్తుందన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టామన్నారు. ఇందు కు సంబంధించి రాష్ట్ర రిమోట్ సెన్సింగ్‌ఏజెన్సీ ఇప్పటికే నాలుగు రాయలసీమ జిల్లాలుతో పాటు శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాలకుమ్యాపింగ్ చేపట్టిందన్నారు. సముద్రంలో కలుస్తున్న నీటి లో కనీసం 500 టీఎంసీల నీటిని మంచినీటి అవసరాలకు మళ్లించేం దుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని 35 నదీ పరివాహక ప్రాంతా లను వాటర్‌గ్రిడ్ పరిధిలోకి తీసుకొస్తున్నామ ని చెప్పారు. అదే విధం గా ప్రతి సంవత్సరం సరైన సమయంలో అన్ని ప్రాంతాల్లో మంచి నీటి పరీక్షలు జరిపి, ప్రజలకు ఆరోగ్యకరమైన సురక్షితమైన మంచినీ టిని అందించాలని ఆలోచన చేస్తో ందన్నారు. అందుకోసం ఆస్ట్రేలియాతో ఒక ఒప్పందం కూడా చేసుకోవడం జరుగుతుందన్నా రు. అందులో భాగంగా పంచా యతీరాజ్, గ్రా మీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆస్ట్రేలియా కంపెనీతో ఒక ఒప్పం దం చేసుకుంటుందన్నారు. ఇందుకు సంబంధించి మంచి నీటి పరీక్ష కోసం ఉద్దేశించిన ఆధునిక యంత్రాల కొను గోలుపై దృష్టి పెట్టామని చెప్పారు.ఇందుకు సంబంధించిన యంత్రాల ధరలపై ఆస్ట్రేలియాతో చర్చలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విదేశీ యంత్రాల ధరపై ఏకాభిప్రాయం వచ్చిన తర్వాత, కొత్త యంత్రాలను ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ ఆధునిక యంత్రం 60 పారా మీటర్లలో నీటి నాణ్యతను పరీక్షిస్తుందని వివరించారు. ఇందుకోసం కొనుగోలు చేసే ఆస్ట్రేలి యన్ కంపెనీ యంత్రాలకు ఒక్కోదానికి రెండున్నర కోట్ల రూపాయలు ఖర్చు చేయా లని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నీటి పరీక్ష యంత్రాలు లేదా ఉపకరణాలను రాష్ట్రంలో ఓవర్ హెడ్ స్టోరేజ్ (ఓహెచ్ఎస్ ) నిల్వ ట్యాంకులను శుభ్ర పర్చేందుకు వినియోగించనున్నట్లు చెప్పారు.

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 17,000 ఓహెచ్ఎస్ ట్యాంకులున్నాయని, మరో 10వేల ఓహెచ్ఎస్ ట్యాంకులు నిర్మాణదశలో ఉన్నాయని లోకేశ్ చెప్పారు. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టు రూ. 600 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఒకసారి ఈ యంత్రాన్ని స్థాపించిన తర్వాత 60 పారా మీటర్లలో నీటిని పరీక్షిస్తారని, అనంతరం నీటిలో బ్యాక్టీరియా లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ట్యాంకులను ఏడు దశల్లో శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. అతి త్వరలో రాష్ట్రం లో గుర్తించబడిన ప్రాంతాల్లో ఈ యంత్రాలను ప్రయోగాత్మకంగా అమలును పరీక్షించడం జరుగుతుందన్నారు. తద్వారా వచ్చే ఫలితాలపై ఆధారపడి ఈ ఉపకరణాల సేవలను వ్యవసాయం, ఉద్యానరంగాలు, నీటిపారుదల కాలువలకు విస్తరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అడెనోసిన్ ట్రై ఫాస్ఫేట్ ( ఏటీపీ ) ల్యాబ్ ద్వారా నీటిని పరీక్షించడం జరుగుతుందని, ఇక ముందు ఈ ల్యాబ్‌తో పనిలేకుండానే తాజాగా యంత్రాలతో ఫలితాల పొందవచ్చన్నారు. ఆస్ట్రేలియన్ కంపెనీ ఇప్పుడు ఈ ఉపకరణాన్ని తయారు చేస్తుందని, జీవన జీవులచే ఉత్పత్తి చేయబడిన శక్తి వనరు ఏటీపీ అని, దాని సాంద్రత తాగునీటి నెట్వర్క్ సూక్ష్మజీవుల సూచించే సూచనను ఈ ఉపకరణం తెలియజేస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు.

# లౌకికంలో మత రంగు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఆర్థికసాయం చేసి ప్రోత్సహిస్తోంది. మత పరసంస్థల్ని ప్రభుత్వం గుర్తిస్తోంది. మతసంబంధిత బహిరంగ సభలకు అనుమతులిస్తోంది. ఒక్కో పార్టీ ఒక్కో మతాన్ని ప్రోత్సహిస్తూ ఆ మతస్తుల ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తోంది.

కానీ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా మతాలకతీత విధానం పెరుగుతోంది. మతాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు పరస్పర అభిప్రాయబేధాలకు, దాడులకు కారణమౌతుండడంతో పలువురు వీటితో విసిగిపోతున్నారు. గతేడాది మార్చిలో నిర్వహించిన ఓ అధ్యయనంలో ప్రపంచవ్యాప్తంగా మతం పట్ల ప్రజల్లో మారుతున్న అభిప్రాయాల్ని గుర్తించారు. ఇప్పటికే నార్వేలో 37శాతం మంది ప్రజలు మతాన్ని విశ్వసిస్తున్నట్లు ప్రకటిస్తే 39శాతం మంది తమకే మతంతోనూ సంబంధంలేదని ప్రకటించారు. క్రైస్తవ సమాజంగా గుర్తింపు పొందిన అమెరికాలో 21శాతం మంది మతాన్ని విశ్వసించడంలేదని తేల్చిచెప్పారు. పిఇడబ్ల్యు రీసెర్చ్ సెంటర్ అధ్యయనం మేరకు ఇది 24శాతంగా ఉంది. ఇక చైనా, జపాన్, చెక్‌రిపబ్లిక్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, ఐస్‌ల్యాండ్‌లు ఇప్పటికే మతాతీత రాజ్యాలుగా ప్రకటించుకున్నాయి. గేలప్ అధ్యయన నివేదిక మేరకు చైనాలో 45 నుంచి 49.9శాతం మంది తమను పై నుంచి నడిపిస్తున్న అసాధారణ శక్తి అంటూ ఏం లేదన్న అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారు. 1976నుంచి చైనాలో మతాల గుర్తింపు నిలిపేశారు. అక్కడ ఎవరు ఏ మతాన్నైనా విశ్వసించుకోవచ్చు. ఏ మత ప్రార్థననైనా నిరభ్యంతరంగా నిర్వహించుకోవచ్చు. అంతేతప్ప బహిరంగంగా మత సంబంధిత సభలు, సమావేశాలకు అనుమతులివ్వరు. ఇతర మతాల్ని కించపర్చే చర్యల్ని ప్రభుత్వం సహించదు. ఇక మతప్రాతిపదికన ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోవు. మతాన్ని కేవలం ప్రజల విశ్వాస ప్రతిపదికగానే అక్కడి ప్రభుత్వం గుర్తిస్తోంది. అంతకుమించి ఇందులో ప్రభుత్వం తలదూర్చదు. కాగా జపాన్‌లో ఏ మతాన్ని అనుసరించనివారి సంఖ్య2010లో 30శాతం ఉంటే 2016నాటికిది 39శాతానికి పెరిగింది. వాస్తవానికి జపాన్‌లో బౌద్ధాన్ని అత్యధికులు ఆచరిస్తున్నారు. పురాతన షిండోయిజం మతానికి చెందిన వారు కూడా ఇక్కడ అధిక సంఖ్యలోనే ఉన్నారు. కానీ ఆధునిక యువత మతాతీతంగానే వ్యవహరిస్తోంది. ఏ మతాన్ని ఆచరించేందుకు వారు ఇష్టపడ్డంలేదు.

ఇక ప్రపంచంలోనే మతాన్ని విశ్వ సించేవారు అతితక్కువ సంఖ్యగా ఉన్న దేశంగా చెక్‌రిపబ్లికన్‌ను పేర్కోవచ్చు. ఇక్కడ 34శాతం మంది మాత్రమే ఏదో మతాన్ని విశ్వసిస్తున్నారు. శతాబ్ధాల క్రితం నాటి కేథలిక్ చర్చిలు ఇక్కడున్నా మత విశ్వా సాల్ని పెంచేందుకు ప్రభుత్వం మాత్రం అంగీకరించడంలేదు. 1948నుంచి 1989వరకు ఈ దేశం కమ్యూనిస్ట్‌ల ఏలుబడిలో ఉంది. ఇదికూడా ఇక్కడ మతాతీత భావన పెరిగేందుకు దోహదపడింది. ఇక ఫ్రాన్స్‌లో 20శాతం మందికి పైగా మతాన్ని విశ్వసించడం లేదు. చైనా తరహాలోనే ఫ్రాన్స్ కూడా తన సరిహద్దు దేశాల్లో మతాతీత భావన పెంచే ప్రయత్నం చేస్తోంది. 1789 ఫ్రెంచ్ విప్లవం తర్వాత ఫ్రాన్స్ రోమన్ కేథలిక్ దేశంగా మారింది. అయితే 1905లో చర్చ్, పాలనకు మధ్య స్పష్టమైన అంతరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్నుంచి ఇక్కడ మత ప్రాతిపదిక విధానాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే ఆస్ట్రేలియాలో 23నుంచి 24శాతం మంది తమకెలాంటి మత విశ్వాసాల్లేవని ప్రకటించారు. 1788నుంచి ఈ దేశంపై ఇంగ్లాండ్ చర్చి ప్రభావం అధికంగా ఉండేది. ఇక ఐస్‌లాండ్‌లో అయితే 1874లోనే మత స్వేచ్ఛ కలిగిన దేశంగా ఆవిర్భవించింది. అప్పట్నుంచి ఇక్కడ మతాతీత భావన పెరిగింది.

ఈ ఆరు దేశాల్లోనూ మతపరస్వేచ్ఛ ఉంది. కానీ మతానిక్కడ రాజకీయాలకు ప్రాతిపదికగా వాడుకోరు. మత విశ్వాసాల పేరిట పరస్పర దాడులకు పాల్పడితే ప్రభుత్వం సహించదు. కానీ భారత్‌లో ఇప్పటికీ మతాన్ని రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందే విధానం కొనసాగుతోంది. వాస్తవానికి ఇక్కడ కూడా ప్రజలు మత ఆధారితంగా ఓట్లేయడంలేదు. గతంలోనే ఇది అనేక సార్లు రుజువైంది. ఆధ్యాత్మిక సమావేశాలకొచ్చే లక్షలాదిమంది భక్తులు అదే ప్రసంగికుడు లేదా ఆధ్యాత్మికవేత్త నేరుగా ఎన్నికల్లో నిలబడితే అతనికి ఓట్లేయడం లేదు. తిరిగి పార్టీల సిద్ధాంతాలు, ఇతర ప్రాతిపదికల్నే విశ్వసిస్తున్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా మతాన్ని, రాజకీయాన్ని వేరుచేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ సమాజం మత పరదాడుల కారణంగా అనేక నష్టాల్ని చవిచూసింది. ప్రపంచంలో ఇంతవరకు జరిగిన యుద్ధాల్లో 80 శాతానికిపైగా మత ప్రాతిపదికనే చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ మతం పేరిట ప్రపంచవ్యాప్తంగా మారణహోమాలు నిత్యకృత్యమయ్యాయి. మతాన్ని వ్యక్తిగత విశ్వాసంగా తప్ప సామాజిక విధానంగా అనుసరించడం వల్ల కలుగుతున్న నష్టాల్ని గుర్తించిన ఆధునిక తరం అంచెలంచెలుగా దీనికి దూరమయ్యే ప్రయత్నం చేస్తోంది. ఈ దశలో కూడా భారత రాజకీయవేత్తలు మత ఆధారిత ప్రయోజనాల కోసం ప్రాకులాడ్డం విమర్శలకు తావిస్తోంది.

# పడని వేలిముద్ర!

(మొదటిపేజీ తరువాయి)

పింఛన్లు ఇస్తోంది. అయితే పింఛన్ల చెల్లింపుల్లో తరచూ అనేక సాంకేతిక అవరోధాలేర్పడుతున్నాయి. లబ్ధిదార్లు తప్పనిసరిగా తమ వేలిముద్రను అధికారుల వద్దనున్న ట్యాబ్‌పై వేయాలి. ఆధార్‌కు అనుసంధానించిన వేలిముద్రతో ఇది సరిపోలాలి. అప్పుడే పింఛన్ ఇవ్వొచ్చన్న సంకేతం ట్యాబ్ ద్వారా వెలువడుతుంది. లేనిపక్షంలో పింఛన్ చెల్లింపునకు అవకాశముండదు. అయితే వయసు రీత్యా 65ఏళ్ళుదాటిన వృద్ధుల్లో అనేక శారీరక మార్పులు ప్రకృతి రీత్యా సహజం. వారి చర్మం సాగడం లేదా ముడతలు పడ్డం జరుగుతుంది. అలాగే దీర్ఘకాలంగా కష్టించి పనిచేయడం వల్ల చేతులపైనున్న చర్మం అరిగిపోతుంది. ఈ కారణంగా ట్యాబ్‌పై వేలిముద్ర సరిగా అతకడంలేదు. దీంతో చెల్లింపులు జరగడంలేదు. అలాగే ఆధార్ కార్డులో ఉన్న చిరునామాకు ప్రస్తుతమున్న చిరునామాకు మధ్య సరిపోలని సందర్భాల్లో కూడా ఈ పింఛన్ల చెల్లింపును నిలిపేస్తున్నారు. అసలు ఈ పింఛన్లకు దరఖాస్తులు చేసేదే పేదలు. వారిలో అత్యధికులకు సొంతిళ్ళుండవు. పరిస్థితుల్ని బట్టి ఇళ్ళు మారుతుంటారు. ఆధార్ కార్డు నమోదు సమయంలో వారు అప్పటికి నివసిస్తున్న ఇంటి చిరునామానే ఇస్తారు. ఆ తర్వాత ఇల్లు మారడంతో కొత్త చిరునామా నమోదు చేస్తారు. ఈ రెండింటికి సరిపోలడంలేదు. ఇలాంటి పింఛన్లు రద్దవుతున్నాయి. ఈసారి ప్రభుత్వం గ్రామసభల్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

అర్హులందరికీ పింఛన్లు ఇతర ప్రభుత్వ పథకాల్ని రాజకీయాలకతీతంగా అందజేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో కార్యకర్తల ప్రమేయాన్ని పక్కన పెట్టాలని కూడా సూచించింది. నేరుగా అర్హతలాధారంగా అధికారులే లబ్ధిదార్లను ఎంపిక చేయాలని పేర్కొంది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఎక్కువ సేపు దీనిపైనే వివరణివ్వడం కూడా జరిగింది. పైగా కొత్తగా వచ్చే దరఖాస్తులకు గరిష్టపరిమితి లేకుండా అర్హులందరికీ పింఛన్లు ఇమ్మంటూ కూడా ఆయన సూచించారు. అయితే ఇప్పుడు వస్తున్న దరఖాస్తుల్లో సగానికి పైగా రద్దయిన పింఛన్లను పునరుద్ధరించమనే. అయినప్పటికీ ఇందుకు సాంకేతిక అవరోధాలెదురౌతున్నాయి. తిరిగి చిరునామా, వేలిముద్రల సమస్యలు తప్పవు. దీనికి శాశ్వత పరిష్కారాన్ని ప్రభుత్వమే నిర్దేశించాలి. ఇలాంటి సాంకేతిక అవరోధాల్ని పక్కనపెట్టి ఒకసారి మంజూరైన పింఛన్‌ను జీవితాంతం కొనసాగించేలా నిబంధనలు రూపొందించాలి. అప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరుతుంది. పేద కుటుంబాలకు చెందిన లబ్దిదార్లు తరచూ ప్రభుత్వాధికారుల చుట్టూ తిరిగి ప్రాదేయపడాల్సిన దుస్థితి తప్పుతుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

# మత్స్యకారులందరికీ ఫిబ్రవరి 15 లోగా బయోమెట్రిక్ కార్డులు

- మెరైన్ పోలీసులకు డేటా అందజేయండి
- తీర ప్రాంత రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలి : సీఎస్ దినేష్ కుమార్



**అమరావతి, ఆంధ్రప్రభ:** సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులందరికీ ఫిబ్రవరి 15వ తేదీ లోపల బయోమెట్రిక్ కార్డులు ఇవ్వాలని మత్స్యశాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం సచివాయంలో సముద్ర తీర ప్రాంత రాష్ట్రస్థాయి రక్షణ కమిటీ సమావేశాన్ని దినేష్ కుమార్ నిర్వహించారు. ఈ సమావేశంలో దినేష్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల వివరాలు, సెల్ నెంబర్లు సముద్రతీర ప్రాంత రక్షణ పోలీసులకు అందచేయాలని ఆయన సూచించారు. ప్రాంతాల వారిగా మత్స్యకారులతో సమావేశాలు నిర్వహించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నోటిఫైడ్ ఫిష్ ల్యాండింగ్ పాయింట్స్, బోట్స్, కలర్ కోడింగ్, ఫైబర్ బోట్స్, బోట్స్ నిర్వహణ వాటి మరమత్తులు, మచిలీపట్నం పాత పోర్టు ప్రాంతంలో తీర ప్రాంత పోలీస్ శిక్షణ కేంద్రంకు భూమి కేటాయింపు, ప్రాంతీయ శిక్షణ కేంద్రాలు, తీరప్రాంత రక్షణ పోలీసు ప్రధాన కార్యాలయ నిర్మాణం, రాష్ట్రా మేరీటైం బోర్డు, జిలా స్థాయి కమిటీల ఏర్పటు, జట్టీలు, జట్టీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు తదితర అంశాలను మత్స్యశాఖ అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో 974 కిలో మీటర్ల తీర ప్రాంతంలో 9 జిల్లాలు, 64 మండలాలు, మొత్తం 21 తీరప్రాంత రక్షణ పోలీసు స్టేషన్లు ఉన్నట్లు, వాటిలో ఒక్క స్టేషన్ కు మాత్రమే సొంత భవనం లేదని, 19 స్టేషన్లకు కాంపౌండ్ వాల్స్ నిర్మించవలసి ఉందని అధికారులు సీఎస్ కు వివరించారు. పోలీసు స్టేషన్ పరిధిని నిర్ణయించవలసి ఉందని సీఎస్ దృష్టికి తీసుకు వచ్చారు. ఏపీ మెరైన్ బోర్డు బిల్-2017ని కేంద్రానికి పంపినట్లు సీఎస్ చెప్పారు. హోంశాఖ గత నవంబర్‌లో రూపొందించిన జీఓ ప్రకారం జిల్లా స్థాయి తీరప్రాంత రక్షణ కమిటీలను జిల్లా కలెక్టర్లు ఏర్పటు చేయనున్నట్లు తెలిపారు. తీర ప్రాంత రక్షణ పథకం ఫేజ్2 కింద కేంద్రప్రభుత్వం 7 జట్టీల నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో 350 నోటిఫైడ్ ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాట్లు తెలిపారు. బోట్లకు కలర్ కోట్ ఉంటే ఏరియల్ సర్వే తేలికవుతుందని సూచించారు. మొత్తం 33,275 బోట్లలో 32,931 బోట్లకు సంబంధించి అన్ లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి అయిందన్నారు. ఈ సమావేశంలో డీజీపీ ఎం.మాల కొండయ్య, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్ అనురాధ, విశాఖ పోర్టు ఛైర్మన్ ఎం.టి కృష్ణబాబు, కోస్ట్ గార్డు కమాండెంట్ ఎస్ఎస్ సింగ్, ఫిషరిస్ శాఖ డైరెక్టర్ కె.ప్రవీణ్, కెప్టెన్ కె.శ్రీధర్మ తదితర కేంద్ర, రాష్ట్రప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి దేవినేని ఉమాకు హరీశ్‌రావు ఫోన్

- నేడు తుంగభద్ర నుంచి నీటి విడుదల?

**అమరావతి, ఆంధ్రప్రభ :** తుంగభద్ర నీటి విడుదలకు సంబంధించి ఉభయ తెలుగు రాష్ట్రాల భారీ నీటిపారుదల శాఖామంత్రుల మధ్య బుధవారం చర్చలు జరిగాయి. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు తెలంగాణ భారీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేసి, ఈ అంశంపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా వారిరువురు ఇరు రాష్ట్రాల అవసరాలను చర్చించినట్లు సమాచారం. తుంగభద్ర నుంచి నీటి విడుదల కోసం సంయుక్త ఇండెంట్ ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఈ నేపథ్యంలో రాజోలి బండ డైవర్షన్ స్కీం,కేసీ కెనాల్ ఆయకట్టుకు గురువారం తుంగభద్ర నుంచి నీరు విడుదలచేసే అవకాశం ఉంది.

# కాఫర్‌డ్యామ్‌పై తుది నిర్ణయం?

- నేడు, రేపు ఢిల్లీలో కీలక సమావేశాలు
- పోలవరం ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష
- ట్రాన్స్‌ట్రాయ్ పనితీరుపైనా చర్చ

**అమరావతి, ఆంధ్రప్రభ:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి సంబంధించి తుది నిర్ణయం తీసుకునేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సమన్వయంతో ముందుకొచ్చాయంటున్నారు. ఈ విషయ మై ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిగిన సంగతి తెలి సిందే. ఇందుకు సంబంధించి ఆకృతుల కమిటీ బృందంతో పాటు జాతీయ విద్యుత్పాదన హైడ్రో పవర్ కార్పొరేషన్‌కు చెందిన నిపుణుల బృందం పలుమార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి,ఆకృతులను పరిశీలించి వెళ్లడం జరిగింది. అంతేకాకుండా కాఫర్‌డ్యామ్ ఆకృతులను క్షుణ్ణంగా పరిశీ లించి,కేంద్రానికి నివేదించి,అధ్యయనం చేసిన తర్వాతనే కాఫర్‌డ్యామ్ పనులను ప్రారంభించాల్సి ఉంటుందని కేంద్ర జలవనరుల అధికారులు గతంలో స్పష్టం చేసిన సంగతి తెలి సిందే. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు పురోగతితో పాటు ప్రధానంగా కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి సంబంధించి చర్చించేందుకు ఈనెల 5వ తేదీన కేంద్ర జలవనరుల శాఖ ప్రత్యేకించి, ఢిల్లీలో సమావేశం నిర్వహించబోతున్నది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సంబంధిత శాఖాధికారులు నివేదికలను తయారు చేసి,కేంద్రానికి నివేదించేందుకు సిద్ధమయ్యా రు. ఈనెల రెండో వారంలోనే కేంద్ర జలవనరుల శాఖా మం త్రి నితిన్ గడ్కరీ పోలవరం ప్రాజెక్టును సంద ర్శించి, అధికా రులతో పనులపై సమీక్షించనున్నారు.ఈ లోపు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి,కాఫర్‌డ్యామ్ ఇతర ఆకృతులకు సంబంధించి రాష్ట్ర జలవనరుల శాఖాధికారుల వద్ద ఉన్న పక్కా ప్రణాళికపై చర్చించేందుకు ఈనెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో ప్రత్యేకించి సమావేశం కాబోతున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో కాఫర్‌డ్యామ్ ఆవశ్యకత, ఎంత ఎత్తులో ఏ మేరకు, ఏ సమయంలో, ఎంత ఖర్చుతో నిర్మిస్తే మేలు జరుగుతుందో నిపుణుల కమిటీ ఇచ్చిన నివేది కపై కూలంకషంగా చర్చించి, తుది నిర్ణయాన్ని కేంద్ర జల వనరుల శాఖా మంత్రిత్వ శాఖకు వదిలివేయనున్నారు. చివరగా నితిన్ గడ్కరీ ఈ విషయమై తుది నిర్ణయం తీసుకుంటారం టున్నారు. ఇప్పటికే ఆకృతుల కమిటీ పోలవరం ప్రాజెక్టు క్షేత్రంతో పాటు విజయవాడ,హైదరాబాద్,ఢిల్లీలో పలు విడతలుగా జరిగిన సమావేశాల్లో ఆకృతులపై తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. అయితే త్వరలో ఢిల్లీలో జరగ బోయే సమావేశంలో చర్చించిన తర్వాత ఆకృతులను కేంద్ర జలవనరుల శాఖనే ఫైనల్ చేయబోతున్నది. ఇటు ఎన్‌హెచ్ పీసీ నిపుణుల బృందం ఇచ్చిన నివేదికను, అటు ఆకృతుల క మిటీ రూపొందించిన నివేదిక,వారి అభిప్రాయాలను సమీ క్షించిన అనంతరం కేంద్ర జలవనరుల శాఖ తుది నిర్ణయం తీసుకుంటుందని అంటున్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మాణ నాణ్యతతో పాటు తక్కువ ఎత్తులో నిర్మించేందుకు ఉన్న అవ కాశాలపై ఢిల్లీ సమావేశంలో కీలకంగా ప్రస్తావించేఅవకాశం ఉందంటున్నారు. అయితే నిపుణుల క మిటీ నివేదికలోని అంశాలు, ఆకృతుల కమిటీ నివేదికలోని అంశాల్లో కొంత తేడా ఉందంటున్నారు. ఈ రెండింటిలో ఏది మెరుగైన పద్ధ తో చర్చించి,కీలక నిర్ణయం తీసుకుంటారని అంటున్నా రు.అంతేకాకుండా 4వ తేదీన పోలవరం ప్రాజెక్టు గేట్ల నిర్మా ణం, నాణ్యత ఇతరఅంశాలపై చర్చించేందుకు కూడా కేంద్ర జనలవరుల శాఖ నిర ్ణయించింది. ఈ రెండు తేదీల్లో జరిగే కీలక సమావేశాల్లో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్‌కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు తదితర అధికారులు పాల్గొంటారని అంటున్నారు.అయితే ఈ సమావేశాలకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూడా హాజరు కావాల్సి ఉంది. కానీ జన్మభూమి - మావూరు కార్యక్రమం ఉండడం వల్ల ఆయన ఢిల్లీకి పోవడం లేదంటున్నారు. ఈ సమావేశాల్లో ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ సంస్థకు ఇచ్చిన నెల రోజుల గడువులో ఇప్పటివరకు చేసిన పనుల వివ రాలపై కూడా చర్చించనున్నారు. ట్రాన్స్‌ట్రాయ్ ప్రతినిధుల ను కూడా సమావేశానికి ఆహ్వానించినట్లు సమాచారం. ఈనెలలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పోలవరం ప్రాజెక్టును సందర్శించి, పనులను పరిశీలించేందుకు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాం తంలో సిద్ధం చేసిన మోడల్ గేట్‌ను గడ్కరీ ముఖ్యమంత్రితో కలసి, పరిశీలించనున్నారు. కాగా గడ్కరీ పర్యటనలోనే కాంక్రీట్ పనుల్లో కొంత భాగాన్ని సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. ఇలా ఉంటే త్వరలో పూర్తి స్థాయిలో బాచింగ్‌ప్లాంట్, కూలింగ్ ప్లాంట్ అందుబాటులోకి రానున్నాయి. ఇవి పూర్తి స్థాయిలోఅందుబాటులోకి వస్తే కాంక్రీట్ పనులు మరింత వేగంతో జరుగుతాయంటున్నారు. వారానికి 3 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున ఏప్రిల్ నాటికి తవ్వకంలో కీలక భాగం పనులు పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. రెండు నెలల విరామం తర్వాత పోలవరం పనులను త్రివేణి సంస్థ మళ్లీ తిరిగి మొదలు పెట్టడడంతో పనులు మరింతగా ఊపం దుకున్నాయంటున్నారు. జన్మభూమి - మావూరు కార్యక్రమంలో పలు ప్రాధాన్య ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నారు. బుధవారం కడప జిల్లాలోని గండికోట - సీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అదే విధంగా కడప జిల్లాలోని గండికోట - సీబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని కూడా ప్రారంభించారు. ఈనెల 7వ తేదీన కర్నూల్ జిల్లాలోని సిద్దాపురం ఎత్తిపోతల పథ కాన్ని, 11వ తేదీన అనంతపురం జిల్లాలోని ధర్మవరం, బుక్కపట్నం చెరువులకు జలహారతి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించబోతున్నారు. కాగా పూణెలో ఏర్పాటు చేసిన పోలవరం ప్రాజెక్టు త్రీడీ మోడల్‌ను ఈనెల 12తర్వాత ముఖ్యమంత్రి తిలకించనున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 4 జనవరి 2018

## మహారాష్ట్రలో కోరేగావ్ చిచ్చు!

భీమ్- కోరేగావ్ అంశం రెండు శతాబ్దాల నాటిదే అయినా... కాలక్రమంలో మహారాష్ట్ర సమాజంలో నివురుగప్పిన నిప్పులా రగులుతున్న సామాజిక అసమానతకు దర్పణం. మొత్తంమీద ఇలాంటి సంఘటనలు కమలనాథుల పాలనలోనే జరగడాన్ని కాకతాళీయమంటే దానికి పెద్దగా ఆమోదం లభించే వాతావరణం లేదు. లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెస్సెస్ ప్రస్తావన తేవడం ఈసందర్భంగా గమనార్హమే. మహారాష్ట్రలో రెండు వందల ఏళ్ళనాటి యుద్ధంలో సాధించిన విజయాన్ని గుర్తు చేసుకునేందుకు మహర్ దళితులు జనవరి ఒకటో తేదీన నిర్వహించిన ఉత్సవాలు కుల ఘర్షణలకు దారితీయడం దురదృష్టకరం. ఆనాడు పీష్వా -2 నేతృత్వంలోని సేనలతో ఈస్టిండియా కంపెనీ తరఫున పోరాడిన మహర్ దళితులు సాధించిన విజయానికి సంకేతంగా కోరేగావ్‌లో ఒక స్థూపాన్ని ఆనాడే నిర్మించారు. ఆ స్థూపం వద్ద ఏటా దళితులు సమావేశమై వార్షికోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీ. దానిని మరాఠాలు వ్యతిరేకించడమూ సర్వసాధారణమే. ఈసారి ఇరువర్గాల మధ్య అపోహలు, అనుమానాలు పెరిగిపోవడానికి ఇటీవల పొరుగున ఉన్న గుజరాత్ ఎన్నికల్లో కుల సమీకరణాల ప్రభావమే కారణం. దళితుల్లో అభద్రతా భావాన్ని తొలగించేందుకు ప్రభుత్వపరంగా పటిష్ఠమైన చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘర్షణలు చోటు చేసుకునేవి కావు. ఆనాడు ఈస్టిండియా కంపెనీ తరఫున దళితులు పోరాడారు కనుక, వారు నిర్వహించే ఉత్సవాలు సాగనీయరాదన్న పట్టుదలతో మరాఠాలు వ్యవహరించడమే ఘర్షణలకు మూల కారణం.

విభజించి పాలించడం బ్రిటిష్ వారినుంచి వారసత్వంగా మనకు వచ్చిందేమోనని ఇలాంటి సందర్భాల్లో అనిపిస్తుంటుంది. బ్రిటిష్ సైన్యంలో పనిచేసిన వారిలో దళితులే కాకుండా, ఇతర వర్గాల వారూ ఉన్నారు. పాత విషయాలను తవ్వుకుంటూ పోతే సమాజంలో సామరస్యం ఆవిరవుతుంది. ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి రాజకీయ పార్టీలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. దళితులు సంఘటితమవుతున్నారన్న అపోహ మరాఠాల్లో ఏర్పడటం వల్లనే వారు ఈ ఉత్సవాలను వ్యతిరేకించారు. గుజరాత్ ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ అనుసరించిన వ్యూహం తాజాగా కులాల వారీగా సమీకరణలకు కారణమైంది. గుజరాత్‌లో జిగ్నేష్ నేతృత్వంలో దళితుల్లో కొత్తతరం ఈ ఎన్నికల్లో చురుకుగా పాలు పంచుకుంది. అదే మాదిరిగా మహారాష్ట్రలో కూడా దళితులను సంఘటిత పరిచే కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయి. అందులో భాగంగానే, దళితులు కొత్త సంవత్సరం ఆరంభం రోజున పూణేకి సమీపంలోని కోరేగావ్‌లో ఉత్సవాన్ని నిర్వహించారు. దీనిని గురించి మరాఠాలు పట్టించుకోకుండా ఉంటే ఘర్షణలు జరిగిఉండేవి కావు. దళితులు, మరాఠాలు రెండేళ్ళుగా సమయం వచ్చినప్పుడల్లా ఘర్షణ పడుతూనే ఉన్నారు. పాత సంఘటనలకు ప్రతీకారం తీర్చుకునేందుకు ఈసారి మరాఠాలు దళితుల విజయోత్సవ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. రెండేళ్ళ క్రితం కోపర్డీ గ్రామంలో పద్నాలుగేళ్ళ బాలిక మరణానికి దళితులే కారణమన్న ఆరోపణలపై మరాఠాలూ, దళితుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఒక్క మహారాష్ట్రలోనే కాకుండా, భూస్వాములు, దళితుల మధ్య దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఇందుకు పైకి కనిపించే కారణాలు వేర్వేరుగా ఉన్నా, సామాజిక న్యాయం నినాదంగా మిగిలి పోవడమే అసలు కారణం. గుజరాత్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లలో గోరక్షకుల పేరిట దాడుల్లో మరణించిన వారంతా దళితులే. ఈ దాడుల ప్రభావంగానే దళితులంతా జిగ్నేష్ నాయకత్వంలో ఒక్కటయ్యారు. మహారాష్ట్రలో అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ నేతృత్వంలో దళితులు సమయంవచ్చినప్పుడల్లా దళితుల సంఘటనా శక్తిని ప్రదర్శిస్తూనే ఉన్నారు. గోరక్షకులను హెచ్చరించే సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంత తీవ్రంగా స్పందించారో ఇంకా మన స్మృతిపథంలోనే ఉంది. రాజకీయ లబ్ధి కోసం కులాల సమీకరణ ఎంత చేటో తాజాగా మహారాష్ట్రలో జరుగుతున్న ఘర్షణలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఘర్షణల్లో ఒక యువకుడు మరణించాడు. అనేక మంది గాయపడ్డారు. కోరేగావ్‌లో రెండు రోజుల నుంచి సాగుతున్న బంద్ కారణంగా వాహనాలు, భవనాలు దగ్ధమయ్యాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అసమర్థత, అనుభవ రాహిత్యం వల్లే గోటితో పోయే గొడవలు ఘర్షణలకు దారితీస్తున్నాయని మహారాష్ట్ర స్ట్రాంగ్ మ్యాన్, మాజీ కేంద్ర మంత్రి శరద్ పవార్ వ్యాఖ్యను రాజకీయమనుకోలేం. అన్ని వర్గాలనూ కలుపుకుని పోవడంలో ఫడ్నవీస్ విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకులు కూడా ఆరోపించారు. ఇరువర్గాలను సమావేశపర్చి శాంతి సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఫడ్నవీస్‌పై ఉంది.

# చమురు: పరాధీనత తగ్గాలి

భూతాపంపై అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా కార్బన్ వాయువుల నియంత్రణ అంశం ప్రధానంగా చర్చకు వస్తుంటుంది. బొగ్గు ఆధారిత పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాల ద్వారా మాత్రమే కాకుండా, చమురు, సహజవాయువుల ద్వారా కూడా కార్బన్ వాయువులు విడుదలవుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనదేశంలో ఇంధన వినియోగాన్ని పరిశీలిస్తే కార్బన్ వాయువులను విడుదల చేసే ఇంధనాన్ని తగ్గించి, సంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ క్రమంలోనే పవన విద్యుత్, సౌర విద్యుత్, బయోగ్యాస్ వంటివి ప్రాచుర్యం పొందాయి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నా మన దేశంలో ఇప్పటికీ 90 శాతం చమురు, సహజవాయువుల వినియోగంపైనే పరిశ్రమలు, సంస్థలు ఆధారపడుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముడి చమురు దిగుమతులను తగ్గించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. 2022 నాటికి దిగుమతులను పది శాతం తగ్గించాలన్న లక్ష్యాన్ని ఆయన నిర్దేశించారు. అంతర్జాతీయంగా చమురు, సహజవాయువుల ఉత్పత్తి, లభ్యత మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుని భారత్ తన ప్రణాళికలను నిర్దేశించుకోవల్సి ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పుడున్న అవకాశాలను అంది పుచ్చుకోవాల్సుంది.

అంతర్జాతీయ స్థాయిలో ముడి చమురు ధర బాగా పడిపోవడం వల్ల చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తులను తగ్గించాయి. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర గత ఏడాది ఇదే కాలంలో బ్యారల్ 40 డాలర్లు ఉండగా, ఈ ఏడాది 60 డాలర్లు ఉంది. 2011 లో ముడిచమురు బ్యారల్ ధర గరిష్టంగా బ్యారల్ ఒక్కింటికి 115డాలర్లకు పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలో ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ భారత్ వ్యూహాలను రూపొం దించుకోవాల్సి ఉంది. మరింత చొరవ తీసుకోవల్సి ఉంది. పశ్చిమాసియా దేశాల పై ఆధారపడటాన్ని తగ్గించి అమెరికా నుంచి క్రూడ్ దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వ రంగంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. చమురు ధరలు పడిపోవడం ఎగువ ప్రాంతంలోని దేశాలు,సంస్థలకు చేదు అనుభవాలను మిగిల్చాయి. దాంతో ఆ దేశాలు చమురు అన్వేషణ, ఉత్పత్తి కార్యక్రమాలను తగ్గించాయి.

2016 నాటికి అన్వేషించాల్సిన చమురు నిక్షేపాలు



**అంతర్జాతీయ స్థాయిలో ముడి చమురు ధర బాగా పడిపోవడం వల్ల చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తులను తగ్గించాయి. అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర గత ఏడాది ఇదే కాలంలో బ్యారల్ 40 డాలర్లు ఉండగా, ఈ ఏడాది 60 డాలర్లు ఉంది. 2011 లో ముడిచమురు బ్యారల్ ధర గరిష్టంగా బ్యారల్ ఒక్కింటికి 115డాలర్లకు పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలో ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ భారత్ వ్యూహాలను రూపొం దించుకోవాల్సి ఉంది. మరింత చొరవ తీసుకోవల్సి ఉంది. పశ్చిమాసియా దేశాల పై ఆధారపడటాన్ని తగ్గించి అమెరికా నుంచి క్రూడ్ దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వ రంగంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రయత్నాలు ప్రారంభించాయి.**

3.14మిలియన్ కిలోమీటర్లకు విస్తరించి ఉన్నాయి. భారత్‌లో కూడా అన్వేషణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగాల్సి ఉంది. అన్వేషణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు విస్తృతం చేస్తున్నప్పటికీ, చమురు క్షేత్రాల్లో ఇప్పటికీ 40 శాతం వనరులను దక్కించుకోవల్సిఉంది. నిక్షేపాలున్న దామాషాలో అన్వేషణ కార్యక్రమాలు సంతృప్తికరంగా సాగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేనందున అన్వేషణ ఆశించిన స్థాయిలో లేదు. చమురు క్షేత్రాల నుంచి డ్రిల్లింగ్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడితే, దిగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండదు. డిజిటైజేషన్, ఆటోమేషన్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పద్దతుల ద్వారా ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉంది. వీటి వల్ల ఉత్పత్తి వ్యయం చాలా వరకు తగ్గుతుంది. చమురు క్షేత్రాల ఉత్పాదకత పెరుగుతుంది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించాల్సి ఉంది. పెట్రో రసాయనాల విలువ పెరగడానికి శుద్ధి, రీగ్యాసింగ్ ప్రక్రియలు సమర్థంగా జరగాలి. యావత్ ఆసియా దేశాలకే భారత్ చమురు శుద్ధి కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఆసియా మార్కెట్లకు శుద్ధి చేసిన చమురు, గ్యాస్ సరఫరా ఇక్కడి నుంచే చేస్తున్నారు. గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది.


ఈ క్రమంలోనే ద్రవీకరించిన సహజవాయువుల (ఎన్ఎన్‌జి)దిగుమతులపై దృష్టి సారించింది. చమురు, సహజవాయు రంగాలకు సంబంధించి ఎగువ, దిగువ ప్రాంతాలకు శుద్ధి చేసిన గ్యాస్ సరఫరా చేసే కేంద్రంగా భారత్ రూపుదిద్దుకుం టోంది. వనరులను సాధ్యమైనంత ఎక్కువ సేకరించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. అదే సందర్భంలో మార్కెట్‌లో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తన వ్యూహాలను మార్చుకోవల్సి ఉంది. భారత పెట్రో రసాయనాల మార్కెట్ వార్షిక వృద్ధి రేటు వచ్చే ఐదేళ్ళలో పది శాతం ఉంటుందని అంచనా. వచ్చే ఐదేళ్ళలో అది 100 బిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. దేశంలో పెట్రోల్, డీజిల్, తదితర ఇంధనాలను డీరెగ్యులేట్ చేసిన దృష్ట్యా రిటైల్ వ్యాపారస్తులు విక్రయ, పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయడంపై దృష్టిని సారించాల్సి ఉంది. ఇప్పటికే రంగంలో ఉన్న కంపెనీలకు తోడు మరిన్న కంపెనీలు ప్రవేశిస్తున్న దృష్ట్యా. విక్రయాలు, పంపిణీపై ఒత్తిడి తగ్గవచ్చు. చిన్న,మధ్య తరహా పంపిణీ దారులకు సకాలంలో ,వారి అవసరాల మేరకు సరఫరా చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పంపిణీ వ్యవస్థకొద్ది మంది ఉత్పత్తి దారుల వద్దనే కేంద్రీ కృతమైంది. ఈ రంగంలో ఉన్న వాటాదారులు మరింత దూకుడును ప్రదర్శిస్తూనే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సంప్రదాయ , సంప్రదాయేతర ఇంధన వనరుల సమీకరణ, పంపిణీల మధ్య సమన్వయంఉంటే మన దేశం ముడి చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధార పడాల్సిన అవసరం బాగా తగ్గుతుంది. మెళకువలు పాటిస్తే చమురు రంగంలో పరాధీనతను తగ్గించవచ్చు.

**● ఏపీ స్వామి**

నివాళి

## అంధులకు కావాలి చేయూత

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం. మూగవారు, చెవిటివారూ పరాధీనులు కాకుండా బతకొచ్చు. అంధులు మాత్రం ఇతరుల సాయంలేనిదే కదలలేరు. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని స్వతంత్ర జీవనం సాగించగలుగుతున్నారు. అంధుల కోసం 186 సంవత్సరాల క్రితం ఫ్రెంచ్ విద్యా వేత్త అయిన లూయీ బ్రెయిలీ ప్రత్యేక లిపిని రూపొందించారు. బ్రెయిలీ పేరిట అది ప్రత్యేక లిపిగా స్థిరపడింది. బ్రెయిలీకి ప్రత్యేక లిపిని రూపొందించాలన్న ప్రేరణ కలగడానికి మూలపురుషుడు ఛార్లెస్




బార్బియర్ అనే సైనికాధికారి. సైనికులు రాత్రి వేళల్లో సమాచారాన్ని గ్రహించడం కోసం 12 ఉబ్బెత్తు చుక్కలతో ఒక లిపిని తయారు చేశాడు. వాటిని ఆరు చుక్కలకు తగ్గించి బ్రెయిలీ కొత్త లిపిని రూపొందించాడు. క్షయ వ్యాధి కారణంగా ఆయన 1852లో మరణించారు. ఆయన కనుగొన్న బ్రెయిలీ లిపి 20వ శతాబ్దంలో ప్రాచుర్యాన్ని పొందింది. స్ఫూర్తితోనే కంటి చూపు లేని వారు విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోగలుగుతున్నారు. బ్రెయిలీ లిపిలో అనేక పుస్తకాలు వచ్చాయి. ప్రపంచంలో ఈనాడు కంప్యూటర్ లేనిదే ఏ రంగంలోనూ వ్యవహారాలు నడవని పరిస్థితి నెలకొంది. యావత్ సమాచారం కంప్యూటర్లలో నిక్షిప్తమై ఉంటోంది. బ్రెయిలీ లిపిలో ఇప్పటికే టైపు రైటర్లు వచ్చాయి. అంధుల కోసం బ్రెయిలీ అథారిటీ ఆఫ్ నార్త్ అమెరికా కంప్యూటర్ బ్రెయిలీ కోడ్‌ని రూపొందించింది. 2016లో దాని స్థానే యూనిఫైడ్ ఇంగ్లీష్‌కోడ్‌ని ప్రవేశపెట్టారు. బ్రెయిలీ కోడ్‌లో రామాయణ,మహాభారతాలవంటి ఇతిహాసాలనూ, చారిత్రక గ్రంథాలను తయారు చేస్తే అంధులు స్వంతంగా వాటి గురించి తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుంది. మిల్టన్ అనే ఆంగ్ల కవి రాసిన ప్యారడైజ్ లాస్ట్ ప్యారడైజ్ గెయిన్ అనే పుస్తకం ఎంత ప్రాచుర్యాన్ని పొందిందో వేరే చెప్పనవసరంలేదు. అంధులకు సమగ్ర సమాచారాన్ని అందించేందుకు వివిధ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి.అంధులు తమ పట్ల సానుభూతిని ప్రదర్శించకుండా, సమాజం అండగా నిలవాలని కోరుకుంటున్నారు. అంధులకు కావల్సింది సహాయంకాదు, చేయూత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల సంక్షేమానికి పెద్ద పీట వేయాలి.

**● కామిడి సతీష్‌రెడ్డి, పరకాల**

# దండెత్తే శకునంలా కిమ్

కొత్త సంవత్సరం అణుయుద్ధానికి వేదికవుతుందా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ ఉన్ ఉద్రేకం ఇందుకు బాటలు వేస్తోంది. అమెరికాకు ఆయన చేసిన తాజా హెచ్చరిక ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలను సృష్టిస్తోంది. నా టేబుల్‌పైనే న్యూక్లియర్ బటన్ ఉంది కాస్కో అంటూ బెదిరింపులకు దిగుతున్నాడు. నా ప్రధాన లక్ష్యం అమెరికా అంటూ స్పష్టంచేశాడు. ట్రంప్-కిమ్ మధ్య మాటల యుద్ధం శృతిమించితే ఆ ప్రాంతంలో అణుయుద్ధం తప్పకపోవచ్చు. దీనికి తోడు అమెరికా సైనిక బలగాల జాయింట్ చీఫ్ మైక్ ములెన్ చేసిన ప్రకటన అమెరికన్ల గుండెల్లో గుబులు రేపుతోంది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గతంలో కంటే ఉత్తర కొరియా గురికి దగ్గరగా ఉందనేదే ఆ ప్రకటన. ఈ సమస్యకు దౌత్యపరమైన పరిష్కారం లభించే అవకాశం దాదాపు లేకపోవడం వల్ల ములెన్ ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. నా ఉద్దేశంలోఅమెరికా ఉత్తర కొరియా అణ్వాస్త్రానికి దగ్గరగా ఉంది. ఇంతకు ముందెన్నడూ ఉత్తర కొరియాకు ఇంత సమర్థమైన అణ్వాయుధం లేదంటూ ఓ టెలివిజన్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. అమెరికా నుంచి ఎదురయ్యే ఎటువంటి సవాలునైనా ఎదుర్కొనే స్థితిలో ఉత్తర కొరియా ఉంది.. అదే సందర్భంలో అమెరికా కంటే బలమైన అణ్వాయుధాన్ని అది సొంతం చేసుకుందని పేర్కొన్నారు. నిప్పుతో చెలగాటమాడుతున్న అమెరికాను అడ్డుకోగలరనేది కిమ్ మాటల సారాంశం. న్యూక్లియార్ బటన్ నా టేబుల్‌పైనే ఉంది.. ఇలా చెప్పి బ్లాక్‌మెయిల్ చేయడం లేదని అమెరికా తెలుసుకోవాల్సిన అంశమని ఆయన స్పష్టంచేశారు. ఇది వాస్తవమని తెలిపారు.




విధ్వంసక ఆయుధాల ఉత్పత్తి కార్యక్రమాన్ని రెట్టింపు చేస్తామన్నారు. ఇదే అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను పెంచేస్తోంది.

మనం తొందరగా అణ్వస్త్రాలు కలిగిన వార్ హెడ్స్‌నూ, బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసి, వాటివాటి స్థానాల్లో ఉంచాలని దేశాన్నుద్దేశించి చేసిన ప్రసంగంలో కిమ్ చెప్పారు. అణ్వాయుధ దేశంగా మారిన ఉత్తర కొరియా తన గమ్యాన్ని చేరుకుందని ప్రకటించారు. ఎక్కువ పరిధిగల ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను 2017 సంవత్సరం పొడుగునా తయారు చేస్తూనే ఉంది. పరీక్షిస్తూనే ఉంది. ఉత్తర కొరియా లక్ష్యం ఒక్కటే.. అమెరికా పీచమణచడం. మరొకవంక ట్రంప్ ఎప్పటికప్పుడు నార్త్ కొరియా పరీక్షలకు స్పందిస్తూనే ఉన్నారు. తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. పదేపదే ఎగతాళి చేస్తున్న కిమ్‌ను సమూలంగా నాశనం చేస్తానన్నారు. ఆయన ఒక ఆత్మహత్య కార్యక్రమంలో ఉన్నారని ట్రంప్ చెప్పారు. అసలు కిమ్ ఎందుకిలా తయారయ్యారు. అమెరికాపై ఇంత కసి దేనికి? ఎందుకింత పెద్ద ఎత్తున అణ్వాయుధాల తయారీకి పూనుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానంగా వేళ్ళన్నీ ట్రంప్‌వైపే చూపిస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ వాడుతున్న కఠిన పదజాలం, కొరియా ప్రాంతంలో సైనిక కార్యకలాపాలు కిమ్‌ను రెచ్చగొట్టాయి. సంయుక్త మిలటరీ విన్యాసాలు జంగ్‌ను జంగిల్‌లో కోతిలా తయారు చేశాయి. దండెత్తడానికి కిమ్ ఒక శకునంలా మారాడు. ఏతా వాతా చూసుకుంటే, ట్రంప్ కోరికోరి కోతితో కరిపించుకున్నట్లయ్యింది. నాయకుల మధ్య వైషమ్యాలు శాంతికి విఘ్నం కలిగేలా మారడం ఇదే ప్రథమం కాదు. పాకిస్థాన్-అమెరికా, భారత్-పాకిస్థాన్, ఇరాక్-అమెరికా, పాలస్తీనా-ఇజ్రాయిల్.. ఇలా ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ప్రపంచ యుద్ధాలుగా మారకుండా వాటిని నివారించుకోవడంలోనే మన నేర్పు కనిపిస్తుంది. నివారించుకోకుంటే మానవాళి మనుగడకే ముప్పులా మారుతుంది.

**● సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి**

# క్షమాశీలజలధి ద్రౌపది

## ● రామ్‌మాధవ్‌వి నిందారోపణలే!

భారతీయ ద్వితీయ ఇతిహాసం మరో మారు అనివార్యంగా వివాదాస్పద రచ్చలోకి వచ్చింది. భారతీయ జనతా పార్టీచే నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర స్థానాన ఒక బలోపేతమైన ప్రభుత్వ స్థాపన జరిగిన 2014 నుండి ఆ పార్టీ ప్రజాప్రతినిధులూ, నాయకులూ, వీరాభిమానులూ పదే పదే పెదవిజారుతున్న వివాదాస్పద భాషణాపరంపరల కోణంలోనే ఈ దుమారాన్ని కూడా చూడాల్సి ఉంటుంది. పనాజీ లో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ మహాభారత కథానాయిక ద్రౌపది జీవనాడిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద దుమారాన్నే సృష్టించాయి. మహాభారతాన్ని మరోమారు ఆయన సంకల్పితంగానే చర్చలలోకి లాక్కొచ్చారు. కురుక్షేత్ర సంగ్రామానికి ద్రౌపది హేతువనీ, ఆమె యుద్ధ కాంక్ష వల్లే నాటి సమరంలో 18 లక్షలమంది విహతులయ్యారనీ, ఆమె పట్టుదలే లేకుంటే ఐదూళ్ళతో సమస్య పరిష్కారమయ్యేదనీ, పంచ భర్తృక ఐనా! ఐదుగురు భర్తలలో ఏ ఒక్కరి మాట కూడా వినేది కాదనీ, శ్రీకృష్ణుని సూచనలనే ఆమె అనుసరించిందనీ రామ్‌మాధవ్ ద్రౌపదీ మాతపై రామ్ మాధవ్ తీవ్రస్థాయిలో సంధించిన ఆరోపణాస్త్రాల సారాంశం. ఇదే కోవలో ఆయన ద్రౌపదిని ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి స్త్రీవాదిగా, దృఢ చిత్తురాలిగా ప్రశంసించారు కూడా.

ద్రౌపది వ్యక్తిత్వ వికాసంపై ఆయనకు బొత్తిగా అవగాహన లేదనుకుంటాను. ఊహాజనిత స్వీయ భావనలతోనే ఆయన ద్రౌపది నడవడిని గాయపరిచివుంటారు. రామ్ మాధవ్‌కి ప్రాథమికంగా మహాభారత ఇతివృత్తం లోతులపై స్పష్టత కావాలి. మహాభారత గాథ వాస్తవిక చరిత్రాంశమా! కాల్పనికమా! అనే పెద్ద మీమాంస నడుస్తున్న ఈ కాలంలో రామ్ ఆ కథనంపై మరింత కసరత్తు చేయాలి. ఏ యే అంశాల ప్రాతిపదికగా రామ్‌మాధవ్ ద్రౌపదిని స్త్రీవాదిగా పేర్కొన్నారో! ఆయా ప్రమాణాలను ఆయన వెదికి పట్టుకుని బహిర్గతం చేయాల్సింది. ద్రౌపది దృఢచిత్తురాలు అన్న ఒక్క సంగతి మాత్రమే ఆమె నడివడికి అన్వయం కుదురుతుంది. పలు సందర్భాల్లో ఆమె ఉపేక్షలు, క్షమా నిర్ణయాల ఈ సుగుణానికి నిరూపణగా దర్శనమిస్తాయి.

వాస్తవానికి ద్రౌపది జీవన గమనాన్ని మూల్యాంకనం చేస్తే ఆమెతో అనేక కోణాలు మనకు బోధపడతాయి. తొలుత తండ్రి నిరాదరణతో ప్రారంభమైన ఆమె ప్రయాణం విపరీత ఆచారానికి ఒంగిన శిరసు, మెడలో ఐదుగురితాళి, వీటితో అనుభవించిన ఎగతాళి, అవమానాలు, అఘాయిత్య ప్రయత్నాలు, కడుపుకోత, క్షమ, దయ, అమ్మదనం, విశాల ఆలోచన, మానవత్వం, గొప్ప సౌశీల్యం, బుద్ధికుశలత ఇత్యాది అంశాల కలబోతతో ఆమె కథాగమనమంతా నిండి ఉంటుంది.

18 అక్షౌహిణుల సైన్యాన్ని 18 లక్షలుగా చెపుతున్న రామ్ మాధవ్ మొత్తం మహాభారతంలోని కృష్ణ రాయభారం సందర్భంలో చోటు చేసుకున్న అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ద్రౌపదిపై ఈ నిందలు మోపి ఉంటారు. రాయభారం ప్రయత్నంలో కూడా ద్రౌపది తను అనుభవించిన క్షోభ, అమర్యాదలనూ వివరిస్తూ సంధి భావనను నిరసించి ఉండవచ్చు. అంతమాత్రం చేత యుద్ధానికి ఆమే కారణమని ధ్రువీకరించడానికి వీలులేదు. శ్రీకృష్ణుని ఎదుట అందరి మాదిరిగానే ద్రౌపదికూడా తన మనోభావాన్ని వ్యక్తం చేసింది. కృష్ణ రాయబారానికి పాండవులతోపాటు ఆమె కూడా ఏకాభిప్రాయానికి ఆమోదం తెలిపారు. కనీసం ఐదూళ్ళు కోరే అంశానికి కూడా అందరూ అంగీకరించడం మూలంగానే శ్రీకృష్ణుడు రాయబారానికి అడుగులు పడ్డాయి ఈ సందర్భంలో ద్రౌపది తనకు జరిగిన అవమానాలను పూర్వపరం చేసుకుని తనంత తానే మనసును కుదుట పరుచుకుంది. స్వేచ్ఛగా దాపరికంలేని అభిప్రాయాలను బయల్పరచడాన్ని దోషంగా ఎంచలేము.

అనేక ఘట్టాల్లో ద్రౌపది సర్దుబాటుతోనే వ్యవహరించింది. మత్స్యయంత్రాన్ని ఛేదించిన అర్జునుని పెనిమిటిగా గౌరవాన్ని పొందవలసిన తరుణంలో కుంతీదేవి జారిన మాటను కీలకంగా చేసుకుని వ్యాసుడూ, శ్రీకృష్ణుడు కథనాలకు సంతృప్తి చెంది ఐదుగురినీ కట్టుకోవడానికి తలదించింది. ఇక్కడ ఆమె అబలత్వమే కనిపించింది.

మానమర్యాదలుండవనే పరుష పదాల తాకిడికి గురైంది. అంతేగానీ శ్రీకృష్ణుడు ద్రౌపదికి యుద్ధకాంక్షను ప్రేరేపించే మలుపు ఒక్కటీ మహాభారతంలో అగుపించదు. ఆగ్రహించిన సందర్భాలూ కూడా లేవు.

కురుక్షేత్ర మహాసంగ్రామానికి ద్రౌపది కారణమనే రామ్‌మాధవ్ ఆరోపణకు ఒక్క దృష్టాంతమూ మనకు లభించకపోగా, ఆమెక్షమా, దయాగుణాలను లోకానికి మధ్యాహ్న మార్తాండుని వెలుగులా కనిపించే దృష్టాంతాలు స్పష్టంగా



ఉన్నాయి. జూద గృహంలో వస్త్రాపహరణ రాక్షసక్రీడ చోటు చేసుకున్నపుడు పెద్దలను కొన్ని ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టే ప్రయత్నమే చేసింది గానీ, ఆగ్రహాన్ని వెలిబుచ్చలేదు.

ఉపపాండవులను తెగటార్చిన అశ్వత్థామను ఉపేక్షించిన దయాజలధి ద్రౌపది. మెత్తని మనసు కలిగిన ద్రౌపది మాతలోని యుద్ధ పిపాసను రామ్‌మాధవ్ ఏకోణం నుంచి గ్రహించాడో ఎవరికైనా అంతు చిక్కుతుందా?

ఒకవేళ ద్రౌపది యుద్ధాన్ని కోరుకున్నా, మనం తప్పుపట్టవలసిన అవసరమేమీ లేదు. ఆమె వల్లనే కురుక్షేత్ర మహాసంగ్రామం చోటు చేసుకున్నా దాన్ని మానవనైజంగానే పరిగణించాలి. ఎవరైనా సరే దెబ్బకు దెబ్బ, ప్రాణానికి ప్రాణం తీయాలని భావించరా? రాచరికాల్లో యుద్ధం అనివార్యం. దేశాన్ని, రాజ్యాన్ని రక్షించుకోవాలన్నా, విస్తరించాలన్నా యుద్ధంవలననే సాధ్యమనే విషయాన్ని రామ్‌మాధవ్ గుర్తించాలి. కాకతీయ సామ్రాజ్యం, గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యం, విజయనగర సామ్రాజ్యం, గుప్తసామ్రాజ్యం ఇట్లా సామ్రాజ్యాలు ఏర్పడిన పూర్వరంగాలను విశ్లేషించుకుంటే వీటి పునాదులన్నీ రణమూ, రక్తపాతమూ, నరమేధం తోనే నిండివుంటాయి. ఈ సామ్రాజ్యాధినేతలందరినీ మనం ఈనాటికీ కీర్తిస్తూనే ఉన్నాం కదా! వీరంతా శాంతిసామరస్యాలతో ఇతర రాజ్యాలను కబళించలేదనేది నిజం. ఇట్లా కాకపోతే ద్రౌపది మహిళ కనుక, మహిళలకు యుద్ధాపేక్ష వుండకూడదని రామ్‌మాధవ్ అభిప్రాయపడుతున్నారా! ఈదిశగా ఆలోచన చేస్తే కాకతి రుద్రమనూ, ఝాన్సీలక్ష్మీభాయినీ, చండీరాణినీ, వారి యుద్ధరీతులను కూడా అభిశంసించవలసి ఉంటుంది. అట్లా చేయగలమా! అని ఆలోచించాలి.


మహిళామణుల ప్రేరణ వలన భర్తలు లబ్ధిపొందిన విజయగాథలు వాస్తవం కాదా! ఈ యుద్ధాలలో ప్రాణనష్టం తప్పదు. అనివార్యమైన పరిణామాలను అడ్డుకోలేముకదా! శ్రీకృష్ణుని సలహాల వలన ద్రౌపది యుద్ధకాంక్షను నింపుకోలేదు. పాండవులే శ్రీకృష్ణునిచే యుద్ధ ప్రేరేపితులయ్యారు. యుద్ధాల గురించీ, యుద్ధాలలో కోల్పోయే లక్షల ప్రాణాల గురించీ రామ్‌మాధవ్ చాలానే చదవాల్సివుంది.

పురుషుని వలన యుద్ధం జరిగితే ఒక తీరుగానూ, స్త్రీవలన యుద్ధం సంభవిస్తే మరోతీరుగానూ చూడటం మనకు ఏనాటినుండో అలవాటుగా మారింది. చరిత్రను పురుషులకు అనుకూలంగా మలుచుకోవడం కూడా ఎప్పటినుండో ఆచారంగా మలుచుకున్నాం. ఆ దురాచారం ఇంకా కొనసాగుతూనే ఉంది. వక్రీకరణలు మనకు వెన్నతో పెట్టిన విద్యకదా! రామ్‌మాధవ్ కూడా ఈ కోవలోనే నడిచాడని చెప్పడానికి ఎలాంటి సంశయమూ ఉండనవసరం లేదు. మహాభారత సంగ్రామానికి ఎవరైతే కారకులో వారిని వదలి ఏమాత్రం సంబంధంలేని ద్రౌపదిచుట్టూ యుద్ధోన్మాది అంటూ రామ్‌మాధవ్ ప్రదక్షిణలు చేశాడు. ధృతరాష్ట్రుడు, సుయోధనుడు, ధర్మరాజు కొంతమేరకే పాత్రధారులు. ప్రధానమైన దోషి భీష్ముడు. ఈయన జోలికిపోకుండా శూన్యంలో వెతికాడు రామ్‌మాధవ్.

నాటి ఆర్యావర్తంలో భీష్మునితో సమానమైన యోధుడు లేనేలేడు. భీష్ముని భుజబలాన్నీ, శౌర్యాన్ని నమ్ముకునే సుయోధనుడు రంగంలోకి దిగాడు. కురుక్షేత్ర సంగ్రామం 18 రోజులు జరిగితే, 10వ రోజు భీష్ముడు విగతుడయ్యాడు. తన మరణ రహస్యాన్ని దేబరించిన పాండవులకు విడమరిచి, అస్త్రసన్యాసం చేసి, దేహాన్ని అప్పగించి అర్జునుని శరాఘాతాలతో పడిపోయాడు. 10 రోజులలో భీష్ముని సైన్యాధిపతిగా నడిచిన యుద్ధంలో 5 అక్షౌహిణులు పాండవులు సైన్యం హతమయ్యింది. భీష్ముడే కలుగజేసుకుంటే మహాభారత సంగ్రామమే లేదు. పాండవుల రాజ్యం పాండవులకీయమని భీష్ముడే గనుక గట్టిగా నోరు చేసుకుంటే పాండవులకు రాజ్యం సులభంగా దక్కివుండేది. విదురుని మాదిరిగా, భీష్ముడు యుద్ధానికి దూరంగా ఉంటానని ప్రకటిస్తే భారత యుద్ధానికి తావే లేదు. భీష్ముని బలంతోనే సుయోధనుడు విర్రవీగాడు. భీష్ముడే కురురాజ్యానికి రక్షకుడు. ఆయనే ఆ రాజ్యానికి పెట్టనికోట. వికర్ణుడి పాటి జ్ఞానాన్ని ప్రదర్శించలేక పోయాడు. పెదవులు విప్పని భీష్ముని వైఖరిని తప్పుపట్టాల్సింది పోయి ద్రౌపదిని ఆడిపోసుకోవడం రామ్‌మాధవ్‌కు న్యాయంకాదు. యుద్ధానికి కారకులూ, ప్రేరకులూ అయిన దృతరాష్ట్రుడు, సుయోధనుడూ, కర్ణుడూ, శకుని మరోరకంగా మెత్తటి పులి ధర్మరాజూ, ఇందరిని వదలి ఏ పాపం ఎరుగని ద్రౌపదిపై నిందలు సరికాదు. ద్రౌపది వ్యక్తిత్వాన్ని ఉచిత రీతిలో అర్థం చేసుకుని వుంటే రామ్ మాధవ్ ఈవిధంగా వ్యాఖ్యానించి ఉండేవాడు కాదు.

**● వై.హెచ్.కె.మోహన్‌రావు, 9440154114**

## రైల్వే డెబిట్ కార్డుతో 100% క్యాష్‌బ్యాక్



**న్యూఢిల్లీ:** నగదురహిత లావాదేవీలను మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటి వరకు వివిధ రంగాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రవేశపెట్టిన ప్రభుత్వం, తాజాగా దీనిని రైల్వేలకు విస్తరించింది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రైల్వే శాఖ సొంతంగా డెబిట్ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రమంలో ఎస్‌బీఐతో రైల్వే శాఖ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డెబిట్ కార్డులతో రైల్వే టికెట్లు బుక్ చేసుకుంటే, నెలలో ఒకసారి లాటరీ తీసి పది మంది ప్రయాణికులకు 100శాతం క్యాష్‌బ్యాక్‌ను అందించనున్నట్లు సమాచారం. ఈ డెబిట్ కార్డుల ద్వారా టికెట్ కొంటే ఎలాంటి సర్వీస్ చార్జీలు ఉండవు. ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్ బుక్ చేసుకునే వారికి మాత్రమే ఈ సదుపాయం ఉంటుంది.

### రైలు లేటుపై గంట ముందే ఎస్ఎంఎస్

రైలు రాకపోకల్లో జాప్యం గంట సేపటి కన్నా ఎక్కువ ఉంటే సదరు రైలు కోసం మార్గమధ్యం స్టేషన్లలో ఉండే ప్రయాణికులు ఎస్ఎంఎస్ పొందుతారని భారతీయ రైల్వే బుధవారం ప్రకటించింది. ఈ సర్వీసును అదనంగా 1,104 రైళ్ళకు వర్తింపజేసింది. గత నవంబర్‌లో మొదట 102 ప్రీమియం రైళ్ళతో ప్రారంభించిన ఈ సర్వీసును, ఆ తర్వాత మరో 157 రైళ్ళకు వర్తింపజేశారు.

## రోహింగ్యాలు ఆధార్ పట్టేశారు

**న్యూఢిల్లీ:** రోహింగ్యాలు అడ్డదారిలో ఆధార్, పాన్, ఓటరు కార్డులను సంపాదిస్తున్నారు. విషయాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రోహింగ్యా ముస్లింలు కొందరు ఆధార్, పాన్, ఓటరు కార్డులు సంపాదిస్తున్న ఉదంతాలు వెలుగులోకి వచ్చాయని హోం శాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అక్రమ పద్ధతుల్లో వారు ఈ పత్రాలను పొందుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఘటనలను గుర్తించిన వెంటనే సంబంధిత రాష్ట్రప్రభుత్వాలు, ఇతర అధికారులు కఠిన చర్యలు చేపట్టడంతో పాటు ఆ యా పత్రాలను రద్దు చేస్తారని మంత్రి పార్లమెంట్‌కు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

## న్యాయవాది మృతి... లాలూశిక్ష వాయిదా!

**రాంచీ:** దాణా కుంభకోణం కేసులో దోషులుగా తేలిన ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ సహా ఇతరులకు శిక్ష ఖరారును సీబీఐ కోర్టు నేటికి వాయిదా వేసింది. న్యాయవాది విందేశ్వరి ప్రసాద్ మృతిచెందడంతో తీర్పును వాయిదా వేశారు. కాగా ఈ కేసులో సీబీఐ కోర్టు లాలూ కుమారుడు తేజస్వి యాదవ్‌తో పాటు పార్టీ నేతలు రఘువంశ్ ప్రసాద్ సింగ్, మనోజ్ ఝాలకు కోర్టు ధిక్కారం కింద నోటీసులు జారీ చేసింది. అయితే ఈ కేసు తీర్పు గురించి తాము ఒక్క మాట మాట్లాడకపోయినా కోర్టు తమకు నోటీసులు పంపడం దారుణమని మనోజ్ ఝా పేర్కొన్నారు. గత నెల 23న దాణా కుంభకోణం కేసులో లాలూతో పాటు మరో 14 మందిని దోషులుగా తేల్చిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసులు లాలూను అదుపులోకి తీసుకుని బిర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు.

## రంజాన్ సెలవుల్లో కోత

**లక్నో:** పాలనాపర సంచలన నిర్ణయాలతో దూసుకెళ్తున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తాజాగా మరొక సంచలన నిర్ణయం తీసుకున్నారు. సెలవు దినాలను తగ్గిస్తూ యూపీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. హిందువుల పండుగల నాడు మదరసాలను మూసివేయాలని ఆదేశించింది. మరోవైపు రంజాన్ సెలవుల్లో కోత విధించింది. మహర్నవమి, దసరా, దీపావళి, రక్షా బంధన్, బుద్ధ పూర్ణిమ, మహావీర్ జయంతి రోజుల్లో మదరసాలకు సెలవులు ఇస్తున్నట్లు ఉత్తర ప్రదేశ్ మదరసా బోర్డు ప్రకటించింది. ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీకి గతంలో ఒక రోజు సెలవు ఇచ్చేవారని, ఈ సంవత్సరం నుంచి రెండు రోజులు సెలవు ఇస్తున్నట్లు పేర్కొంది. మహనీయుల గురించి విద్యార్థులకు తెలియజేయడానికే కొన్ని కొత్త సెలవులను ప్రకటించినట్లు బోర్డు పేర్కొంది. మదరసాలకు శీతాకాలపు సెలవులు డిసెంబరు 26 నుంచి జనవరి 5 వరకు ఉంటాయని పేర్కొంది.

# 'మహా' అల్లర్లపై అట్టుడికిన పార్లమెంట్



- ఉభయసభల్లో ప్రతిపక్షాల నిరసన
- బీజేపీ దళిత వ్యతిరేకపార్టీ అన్న కాంగ్రెస్
- కాంగ్రెస్ పార్టీ విద్వేషాలను రెచ్చగొడుతోందన్న బీజేపీ
- ఓబీసీ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- హిందీపై సుష్మా - థరూర్ మధ్య వాగ్వాదం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** భీమా కోరెగావ్ అల్లర్లపై పార్లమెంటు ఉభయసభలు బుధవారం అట్టుడికాయి. ఈ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చింది. అయితే దానిని తిరస్కరించడంతో విపక్షాలు గందరగోళం సృష్టించాయి. దాంతో సభ పదే పదే వాయిదా పడింది. బీజేపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆరోపించారు. బీజేపీ దళిత వ్యతిరేకి అని, సమాజాన్ని ముక్కలు చేయాలని చూస్తోందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో బీజేపీ ప్రజలను విడదీస్తోందన్నారు. ప్రతి రోజూ దేశంలో ఏదో ఒక మూలన దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ అంశాలను పార్లమెంటులోపల, బయటా చర్చించేందుకు ప్రభుత్వం ఇష్టపడడం లేదని అన్నారు. ఇటు లోక్‌సభలోనూ కోరెగావ్ అల్లర్ల అంశం పై సభలో గందరగోళం చెలరేగింది. దళితులను అణిచివేసేందుకు మతతత్వ శక్తుల ప్రయత్ని స్తున్నాయని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ నేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో దళితులపై దా డులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశా రు. సామరస్యపూర్వకంగా, ఆత్మగౌరవంతో జీవించాలని దళితులు ప్రయత్నిస్తుంటే ఆ ప్రయత్నాలను నీరుగారుస్తున్నారని విమర్శించారు. భీమా కోరెగావ్‌లో అల్లర్లకు ఇదే ప్రధాన కారణమని అన్నారు. అనేక సంవత్సరాలుగా కోరెగావ్ ఉత్సవాలు జరుపుతుంటే, ఇప్పుడెందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. దీని వెను ఆర్ఎస్ఎస్ లాంటి శక్తులు ఉన్నాయని అన్నారు. దళితులను అడుగడుగునా అణగదొక్కుతున్నారని విమర్శించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెంటనే ప్రక టన చేయాలని డిమాండ్ చేశారు. గుజ రాత్‌లోని ఉనా, రాజస్థాన్‌లోనూ ఎక్కడా బీజేపీ ప్రభుత్వాలున్నా అక్కడ దాడులు కొన సాగుతూనే ఉన్నాయని అందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ విమర్శలకు బీజేపీ ధీటుగా బదులిచ్చింది. అన్ని రాష్ట్రాలలో ఓడిపోతున్న కాంగ్రెస్ పార్టీ దళితుల అంశంతో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ అన్నారు. తాము శాంతి, సామరస్యం కోసం ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ పార్టీ వారిని గొడ వలకు పురికొల్పుతోందని అన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఘటనలను పార్లమెంటులో చర్చ జరపాలనడం సరికాదని, అక్కడి ప్రభుత్వం గొడవలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుం టోం దన్నారు. మధ్యాహ్నం తర్వాల లోక్‌సభలో ఓబిసి కమి షన్ కు రాజ్యాంగ హోదా కల్పించే 123వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ ఈ బిల్లును సభలో ప్రతిపాదించారు. అయితే గతంలోనే ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన రాజ్యసభలో నూతనంగా కొన్ని సవరణలు చేర్చడంతో తిరిగి లోక్‌సభ ఆమోదానికి తీసుకువచ్చారు. అయితే రాష్ట్రాలను సంప్రదించకుండా ఈ బిల్లును రూపొందించారని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు విమర్శించడంతో గందరగోళం చెలరేగింది. దాంతో స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

### హిందీపై సుష్మా-థరూర్ మధ్య వాగ్వాదం

ఐక్యరాజ్యసమితిలో భారతదేశం తరుపున హిందీని అధికార భాషగా చేసే ప్రయత్నాలపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తమిళనాడు నుంచిగానీ, పశ్చిమబెంగాల్ నుంచి ప్రధానమంత్రి అయితే వారిని హిందీలోనే ప్రసంగించాలని ఎలా ఒత్తిడి చేయగలమని ప్రశ్నించారు. హిందీ జాతీయ భాషకాదని, కేవలం ఇంగ్లీష్‌లాగానే, హిందీ కూడా వర్కింగ్ లాంగ్వేజ్ అని గుర్తు చేశారు. అయితే హిందీని అధికారభాషగా చేసేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని, ఇందుకు ఇతర దేశాల మద్దతు తీసుకుంటామని కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేశారు.

# 500 మిలియన్ డాలర్ల ఒప్పందనం రద్దు

**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెహన్యాత్యూ మనదేశంలో పర్యటించనున్న వేళ భారత్- ఇజ్రాయెల్ కు గట్టి షాక్ ఇచ్చింది. ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేయాలనుకున్న 500మిలియన్ డాలర్ల విలువైన 1600 స్పైక్ యాంటీ ట్యాంక్ గైడ్ మిస్సైల్స్ ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. ఈ మిస్సైల్స్ కు సంబంధించిన పూర్తిస్థాయి టెక్నాలజీ పంచుకునేందుకు ఇజ్రాయెల్ ఒప్పుకోకపోవడం వల్లే ఒప్పందం రద్దయినట్లు తెలుస్తోంది.అదే సమయంలో 70 మిలియన్ డాలర్ల విలువైన 131 ఉపరితలం- గగనతలానికి ప్రయోగించగల బరాక్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసింది. భారత్ తో ఒప్పందం రద్దుపై ఇజ్రాయెల్ రక్షణ సంస్థ రాఫెల్ విచారం వ్యక్తం చేసింది. ఒప్పందం రద్దయినప్పటికీ తమదేశ రక్షణ వ్యవస్థ నుంచి భారత్ కు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొంది. భారత్ కొనుగోలు చేయదలిచిన స్పైక్ యాంటీ ట్యాంక్ గైడ్ మిస్సైల్స్ కదులుతున్న లక్ష్యాన్ని కూడా చేధించగలవు. అయితే ఒక్క మిస్సైల్‌ను ఒక్కసారి మాత్రమే ప్రయోగించగలము..దీంతో టెక్నాలజీని పంచుకోవాలని భారత్ ఇజ్రాయెల్ ను కోరింది. మిస్సైల్ టెక్నాలజీ పంచుకునేందుకు ఇజ్రాయెల్ ససేమిరా అనడంతో ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. భారత రక్షణ సంస్థ డీఆర్‌డీవో నాలుగేళ్లలో ప్రపంచ స్థాయి క్షిపణులను అందిస్తామని హామీ ఇవ్వడం కూడా ఒప్పంద రద్దుకు ఓ కారణంగా అధికారులు చెబుతున్నారు.

# 'మహా' బంద్ హింసాత్మకం

- విద్యార్థి మృతి
- అంతటా ధర్నాలు, హింసాత్మక ఘటనలు
- బంద్ ప్రశాంతం అని అంబేద్కర్ మనుమడు ప్రకటన
- హింసాత్మక ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు



**ముంబై:** పూనెలో చోటు చేసుకున్న హింసకు వ్యతిరేకంగా భారిప బహుజన్ మహా సంఘ్ ఇచ్చిన బంద్ పిలుపును పురస్కరించుకొని మహారాష్ట్ర అంతటా పోలీసులు బుధవారం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముంబై మహానగరంలో చెంబూర్ నాక, వర్లీ నాకా లాంటి అనేక ప్రాంతాల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో కనిపించారు. మంగళవారం నాటి హింసాత్మక ఘటనలకు హిందూ ఏక్తా అఘాడీ కారణమని ప్రకాష్ అంబేద్కర్ ఆరోపించారు. తాము ఇచ్చిన బంద్ పిలుపునకు మహారాష్ట్ర డెమొక్రటిక్ ఫ్రంట్, మహారాష్ట్ర లెఫ్ట్ ఫ్రంట్ సహా 250 సంఘాలు మద్దతు తెలిపాయని ఆయన అన్నారు. బంద్ సందర్భంగా థానే, పాల్‌ఘడ్ జిల్లాల్లో జెండాలు చేబూనిన దళిత కార్యకర్తలు రైలు పట్టాలపైకి ఎక్కారు. పలు రైల్వే స్టేషన్లలో రైళ్ళ రాకపోకలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అయితే అక్కడే ఉన్న భద్రతా బలగాలు వారిని తరిమికొట్టారు. ముంబై మహానగరంలోకి ప్రవేశించేందుకు కీలక కేంద్రంగా భావించే దహిసర్ చెక్‌పోస్ట్ వద్దకు నిరసనకారులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాస్తారోకో చేపట్టారు. రెండు వైపులా వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.ముంబైలోని గోరెగావ్, జోగేశ్వరి, పొవాయి, భండప్, చెంబూర్, గోవండి, నవీ ముంబైకి చెందిన కొన్ని ప్రాంతాల్లో వాహనాలపై రాళ్ళు రవ్విన ఘటనలు చోటు చేసుకున్నాయి. కనీసం 40 బెస్ట్ బస్సులు ధ్వంసమయ్యాయి.

### విద్యార్థి దుర్మరణం

నాందేడ్ జిల్లాలో నిరసనకారులు రాస్తారోకో జరిపిన సందర్భంగా 16 సంవత్సరాల యోగేశ్ ప్రహ్లాద్ జాదవ్ అనే విద్యార్థి మరణించాడు. అస్తి గ్రామం సమీపంలో రాస్తారోకో తొలగించడం కోసం పోలీసులు లాఠీచార్జీ జరపడంతో జాదవ్ తీవ్రమైన గాయాలతో మరణించాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే మరణం వెనుక కారణం తెలుసుకునేందుకు మృతదేహాన్ని శవపరీక్షకు పంపించినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు.


# భారత్ లక్ష్యంగా డ్రాగన్ కుట్ర

## రహస్యంగా హైపర్‌సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్స్ పరీక్ష

**బీజింగ్:** భారత్ లక్ష్యంగా చైనా కుట్రలు మరోసారి బహిర్గతమయ్యాయి. డ్రాగన్ తయారు చేసిన కొత్త హైపర్ సోనిక్ బాలిస్టిక్ మిస్సైల్ అమెరికా భద్రతా వ్యవస్థకు సవాల్ విసరడమే మాత్రమే కాకుండా జపాన్, భారత్ దేశాలను కూడా లక్ష్యంగా చేసుకుని రూపొందింటినట్లు తాజా నివేదికలో ద్వారా వెల్లడైంది.. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక ఈ మిస్సైల్ కు సంబంధించిన కీలక విషయాలను బయటపెట్టింది. చైనా రాకెట్ బలాగాలు గతేడాది హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికిల్ (హెచ్‌జివి) సంబంధించిన రెండు పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. హెచ్‌జివికి డీఎఫ్- 17 అని కూడా నామకరణం చేశారని స్పష్టం చేసింది.అమెరికా నిఘావర్గాల ప్రకారం గతేడాది నవంబర్ 1నఒకపరీక్ష, వారంరోజుల తర్వాత మరో మిస్సైల్ టెస్ట్ చేసినట్లు టోక్యో మ్యాగజైన్ గతనెల వెల్లడించింది.ఈ రెండు పరీక్షలు విజయవంతం కావడంతో డీఎఫ్-17 కార్యకలాపాలు 2020 నుంచి అందుబాటులోకి రానున్నాయని తెలిపింది.

హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికిల్ కు ఇంకా పేరును ఖరారు చేయకపోయినప్పటికీ ఈ మిస్సైల్ ను వివిధ రకాలుగా వినియోగించవచ్చని పేర్కొంది. హెచ్‌జీవో అస్త్రాలు చాలావేగంగా దూసుకుపోవడంతో పాటు, తక్కువ సామర్థ్యం, అతితక్కువ ట్రాక్ చేయగలవని స్పష్టం చేసింది. డీఎఫ్ -17 క్షిపణులు మంగోలియా అంతర్గత ప్రాంతమైన జుక్వాన్ లాంచింగ్ సెంటర్ నుంచి పరీక్షించినట్లు తెలుస్తోంది. ప్రయోగించిన సమయంలో ఇవి దాదాపు1400 కిలోమీటర్ల దూరపు లక్ష్యాన్ని చేధించినట్లు సమాచారం. హెచ్‌జివి టెక్నాలజీ గురిం చి చైనా మీడియా గతేడాది అక్టోబర్ లో తెలిపింది. హెచ్‌జీవీ టెక్నాలజీ అణు వ్యూ హాలలో భాగమని బీజింగ్ కు చెందిన మిలిటరీ విశ్లేషకుడు తెలిపారు. ఇది ప్రపం చలో అతిపెద్ద అణు శక్తి కలిగిన చైనా,అమెరికా, రష్యా దేశాల్లోనే ఈవ్యూహాలు అమ లు చేయవచ్చన్నారు.చైనా రూపొందించి హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్ వల్ల భారత్, జపాన్ దేశాల్లో ఆందోళన కనిపిస్తోందనిసౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తెలిపింది.

# ఎంఎస్ సుబ్బులక్ష్మి కుమార్తె కన్నుమూత




**బెంగళూరు:** కర్నాటక సంగీత కళాకారిణి, గాయకురాలు, దివంగత ఎంఎస్ సుబ్బులక్ష్మి కుమార్తె రాధా విశ్వనాథన్(83) కన్నుమూశారు. శ్వాసకోస సంబంధిత ఇబ్బందులతో ఇక్కడి ఫోర్టిస్ ఆస్పత్రిలో మంగళవారంనాడు చేరిన ఆమె గత అర్ధరాత్రి కన్నుమూశారని ఆమె కుమారుడు శ్రీనివాసన్ తెలిపారు. భారతరత్న అవార్డు గ్రహీత ఎంఎస్ సుబ్బులక్ష్మితో రాధా విశ్వనాథన్ ఎన్నో కచేరీల్లో పాల్గొన్నారు. విదేశాల్లో తల్లితోపాటు పలు ప్రదర్శనలు ఇచ్చారు. రాధా విశ్వనాథన్‌కు చంద్రశేఖర్, శ్రీనివాసన్ ఇద్దరు కుమారులు, శుభలక్ష్మి కుమార్తెతో పాటు ఇద్దరు మనవరాళ్లు ఉన్నారు.ఇప్పటికీ పలు ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఇళ్లలో శ్రీవేంకటేశ్వర సుప్రభాతం, విష్ణు సహస్రనామం, భజగోవిందంలో సుబ్బులక్ష్మి గొంతుతో పాటు తన తల్లి రాధా విశ్వనాథన్ గొంతు కూడా వినిపిస్తుందని శ్రీనివాసన్ తెలిపారు. సుబ్బులక్ష్మి 88 ఏళ్ల వయసులో 2004లో పరమపదించిన విషయం విదితమే.

## రన్‌వేపై నుంచి పక్కకు దూసుకుపోయిన విమానం

**పనాజీ:** భారత నేవీకి చెందిన మిగ్-29కె విమానం గోవాలోని డాబోలిమ్ విమానాశ్రయంలో టేకాఫ్ అవుతుండగా అదుపుతప్పి రన్‌వేపై నుంచి పక్కకు ఒరిగింది. ఈ ఘటనతో విమానంలో భారీగా మంటలు వ్యాపించాయి. విమానం టేకాఫ్ అవుతుండగా ప్రమాదాన్ని ముందే ఊహించిన పైలట్ వెంటనే విమానం నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో ఇతర విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది. ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు యత్నించారు. ప్రస్తుతం విమానాశ్రయాన్ని మూసివేశారు.

# పార్టీపేరు, గుర్తుపై ఇంకా ఆలోచించలేదు



- రజనీ - కమల్‌ల మధ్య పోటీ ఎంజీఆర్ - శివాజీ మధ్య పోటీని తలపిస్తుంది
- ద్రావిడియన్ స్కాలర్, రచయిత ఆర్ కన్నన్ విశ్లేషణ

**న్యూఢిల్లీ:** తమిళనాడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన రాజకీయ పార్టీకి పెట్టబోయే పేరు, పార్టీ గుర్తు పట్ల మళ్లీ సస్పెన్స్‌కు తెరలేపారు. నేను ఇప్పటివరకు ఏపేరును అనుకోలేదని రజనీ చెప్పారు. రజనీకాంత్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొత్త పార్టీకి ఏ పేరు పెడుతున్నారని విలేకరులు ప్రశ్నించినప్పుడు పేరును ఏమీ అనుకోలేదు. పార్టీ ప్రారంభించినప్పడే పేరును కూడా ప్రకటిస్తామని తెలిపారు. ఎప్పటినుంచో రజనీ రాజకీయ ప్రవేశంపై దేశ వ్యాప్తంగా చర్చ సాగుతున్న నేపథ్యంలో అందరి ఊహాగానాలకు తెరదించుతూ కొత్త సంవత్సరం తొలిరోజు తన రాజకీయ ప్రవేశంపై ప్రకటన చేశారు. 'నా విధి నిర్వహణను నేను పూర్తిచేస్తాను. వ్యవస్థను మార్చేందుకు ఇదే సరైన సమయం' అని రజనీ అన్నారు. రజనీ రాజకీయ ప్రవేశం ఖాయం కావడం ఆయన అశేష అభిమానుల్లో సంతోషాన్ని నింపింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాలకు పోటీచేస్తుందని రజనీ ప్రకటించారు. సోమవారం పార్టీకోసం సభ్యుల నమోదుకోసం ఒక వెబ్‌సైట్‌ను రజనీకాంత్ ప్రారంభించారు. పార్టీ స్థాపనకు ముందే ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేపడతారా అన్న విలేకరుల ప్రశ్నకు రజనీ సమాధానమిస్తూ.. అది వచ్చే కాలానికి వదలివేస్తున్నాని చెప్పారు. 'ఒకేసారి అన్ని విషయాలను చెప్పడం సాధ్యం కాదు' అని రజనీ అన్నారు. జయలలిత మరణాంతరం రాష్ట్రంలో ముఖ్యంగా అధికార ఎఐఎడిఎంకెలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఇది రాష్ట్రానికి సిగ్గుచేటు ఇప్పుడు నేను నిర్ణయాన్ని తీసుకోకపోతే, ప్రజలను అవమానించినట్లవుతుంది. ఈ పాపం నన్ను వెంటాడుతుంది. ఈ నేపథ్యంలోనే నేను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించాను అని రజనీ వివరించారు.

### రజనీ- కమల్ మధ్య స్టార్స్ వార్

రజనీకాంత్ రాజకీయ ప్రవేశాన్ని కాంగ్రెస్, బీజేపీలు స్వాగతించాయి. మరోవైపు తమిళ సినీరంగంలో సుప్రసిద్ధ నటుడు కమల్ హాసన్ కూడా రాజకీయ ప్రవేశం చేస్తానని ప్రకటించాడు. ఈ పరిస్థితి నాలుగు దశాబ్దాల క్రితం తమిళనాడులో నెలకొన్న రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అప్పటి కాలంలో ఎంజి రామచంద్రన్, శివాజి గణేషన్‌లకు భారీగా అభిమానుల ఫాలోయింగ్ ఉండేది. అయితే రాజకీయ రేసులో శివాజి చతికిల పడ్డాడు. ప్రస్తుతం ఇదే స్థాయి పోటీ వాతావరణం ఇద్దరు సూపర్ స్టార్ల మధ్య తలెత్తుతోంది. కొన్ని నెలల క్రితం కమల్ హాసన్ తాను రాజకీయ ప్రవేశం చేయనున్నానని ప్రకటించగా, రెండు రోజుల క్రితం రజనీ కాంత్ అదే తీరుగా ప్రకటనను వెలువరించారు. తమిళనాడులో జయలలిత మరణంతో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ ఖాళీని భర్తీ చేసేందుకు వీరిద్దరు పోటీపడే పరిస్థితి ఏర్పడింది. ఎంజిఆర్ సంక్షేమ పనులు ఆయనకు నిజాయతీ ఉన్న అభిమానులను సంపాదించిపెట్టాయి. శివాజీ ఈ దిశలో విఫలమయ్యాడని చెప్పుకోవచ్చు. శివాజీని తెరపై హీరోగా చూడడానికే అభిమానులు కోరుకున్నారు కాని రాజకీయ నేతగా ఒప్పుకోలేదు. రజనీ-కమల్ రాజకీయ ప్రవేశం కూడా ఇదేరీతిలో జరిగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.


## రజనీ జట్టులోకి సినీ ప్రముఖులు!

**చెన్నై:** సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయపార్టీ పెట్టనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, పలువురు ప్రముఖులు తలైవర్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో '2.ఓ' సినిమాను నిర్మించిన లైకా ప్రొడక్షన్స్ క్రియేటివ్ హెడ్ రాజు మహాలింగం తన బాధ్యతలకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మహాలింగం మాట్లాడుతూ, 'రజనీతో కలిసి మూడేళ్లు పని చేశాను. ఆయన వ్యక్తిత్వం, దూర దృష్టి నన్ను ఆకట్టుకున్నాయి. అందుకే లైకాకు రాజీనామా చేసి తలైవా రాజకీయ ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నా' అని చెప్పారు. తన బాధ్యతలకు రాజీనామా చేసి రజనీతో కలుస్తానని ప్రకటించారు. కొరియాగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ కూడా రజనీ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని నేడు విలేకరుల సమావేశంలో లారెన్స్ స్పష్టం చేసే అవకాశం ఉంది. రజనీకి వీరాభిమాని అయిన లారెన్స్ తమిళనాడు ప్రజలకు ఎన్నోసార్లు సాయం చేసి మద్దతుగా నిలిచారు. గతంలో తమిళనాడు రైతుల సమస్యలు పట్టించుకోవాలంటూ పలు నిరసనల్లోనూ పాల్గొన్నారు. అక్కడి ప్రజలు సాయం కోరితే చేయడానికి ఎప్పుడూ వెనుకాడరు. ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అనేక మంది చిన్నారులకు ఉచితంగా చికిత్సలు చేయించారు.ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోకి వస్తున్న రజనీకి లారెన్స్ లాంటి వ్యక్తుల నుంచి మద్దతు లభిస్తే ఆయన వచ్చే శాసన సభ ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోపక్క రజనీ రాజకీయాల్లోకి వస్తే ఆయనతో కలిసి పనిచేస్తానని కమల్ ఇదివరకే ప్రకటించారు. మరి రజనీ పార్టీ ఏర్పాటు అనంతర పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.




## డేటా సరాసరి వినియోగం 1.6 జీబీ

**న్యూఢిల్లీ :** టెలికం రంగంలో 4జీ ప్రవేశించడంతో డేటా వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. గతేడాది సెప్టెంబర్‌లో వినియోగదారుడులు సరాసరి 1.6 జీబీ డేటా వినియోగించారు. ఇదే మూడు సంవత్సరాల క్రితం చూస్తే కేవలం 70 ఎంబీ మాత్రమే ఉండేది. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా మొబైల్ సబ్‌స్క్రైబర్లు విపరీతంగా పెరిగిపోయారని ఐటి టెలికం మంత్రి రవిశంకర్‌ప్రసాద్ లోకసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. డిజిటల్ చెల్లింపులతో పాటు ఎలక్ట్రానిక్ డెలివరీ సేవలు గణనీయంగా పెరిగాయని ప్రసాద్ తెలిపారు. ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రతి సరాసరి ప్రతి సబ్‌స్క్రైబర్ జూన్ 2014లో 70.10 ఎంబీ డేటా వినియోగిస్తే.. సెప్టెంబర్ 2017 నాటికి 1600 ఎంబీ వినియోగించారని తెలిపింది. ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల విషయానికి వస్తే జూన్ 2014లో 259.14 మిలియన్‌ల నుంచి సెప్టెంబర్2017 నాటికి 429.23 మిలియన్‌లకు చేరారని రవిశంకర్ ప్రసాద్ వివరించారు.



# ఐటీ ఉద్యోగాలు గాల్లో దీపం!




**న్యూఢిల్లీ:** గతేడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన వెంటనే భారత్ ఐటి రంగంలో ప్రకంపనలు మొదలయ్యాయి. హెచ్-1బీ వీసాలపై ఉక్కుపాదం మోపుతారని అందరూ ఊహించినట్లుగానే అన్నంత పని అయ్యింది. తాజాగా ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలపై కాకుండా (హెచ్1బీ వీసాలపై అమెరికాలో మూడు సంవత్సరాల పాటు ఉండొచ్చు.) అటు తర్వాత మరో మూడేళ్ల పాటు వీసాలను పొడిగిస్తుంటారు. ఈ మధ్యలో ఉద్యోగి నైపుణ్యాన్ని బట్టి కంపెనీ గ్రీన్‌కార్డు ప్రాసెస్‌కు సిఫారసు చేస్తుంది. ఇక ఆ గ్రీన్‌కార్డు అనేది ఎప్పుడు వస్తుందో ఆ దేవుడికి తెలియాలి. ఎందుకంటే దానికి చాంతాడంత వెయిటింగ్ లిస్టు ఉంది. ఒకప్పుడు గ్రీన్‌కార్డు మూడు నుంచి నాలుగు సంవత్సరాల్లో వచ్చేది. ఐటి రంగం ఎప్పుడైతే జోరందుకుందో అప్పటి నుంచి భారత్‌కు చెందిన ఐటి కంపెనీలు భారత్ నుంచి తమ ఉద్యోగులను క్లయింట్ లోకేషన్‌కు పంపుతుంటాయి. అలా వెళ్లిన వారు ప్రస్తుతం కొన్ని లక్షల్లో ఉన్నారు. ఒకసారి హెచ్1బీ వీసా లబ్ది దారుని గ్రీన్‌కార్డు ప్రాసెస్ అయితే వారిని దేశంలోనే పనిచేయడానికి అనుమతిస్తుంటారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం మాత్రం ఇలా గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్‌లో ఉన్న వారిని కూడా తిప్పి పంపాలనే ఆలోచనలో ఉంది. (ఇక్కడో చిన్న ఉదాహరణకు కూడా చెప్పాలి.. అమెరికా పౌరసత్వం లభించిన వ్యక్తి ..వెంటనే తన కుటుంబసభ్యులు తల్లి, లేదా త్రండి, సోదరుడు, సోదరి ఇలా అందరికి గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తుంటారు. దీని వల్ల గ్రీన్‌కార్డు వెయిటింగ్ లిస్టు పెరిగి ప్రాసెసింగ్ ఆలస్యం అవుతుందని మన భారతీయులే చెబుతుంటారు.)

తాజాగా ట్రంప్ ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చి హెచ్-1బీ వీసాల పొడిగింపు ఫుల్‌స్టాప్ పెట్టాలనే ఆలోచనలో ఉన్నట్లు సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన నాస్కామ్ కూడా చెబుతోంది.

ఒక వేళ అమెరికా ప్రభుత్వం వీసాల పొడిగింపును నిలిపివేస్తే సుమారు ఒక మిలియన్ .. పది లక్షల మంది హెచ్1బీ వీసా లబ్దిదారులు మాతృదేశానికి తిరిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడుతుం దని.. వారిలో చాలా మంది గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. ట్రంప్ నిర్ణయం కేవలం ఐటి పరిశ్రమే కాకుం డా హెచ్1బీ వీసా వినియోగించుకునే భారతీయులందరికి ఇబ్బం దే. అమెరికా ప్రభుత్వ నిర్ణయంతో అమెరికాలో కూడా స్టాఫ్‌వేర్ నిపుణుల కొరత ఏర్పడుతుంది. ఇది అమెరికాతో పాటు భారత్‌కు కూడా నష్టమేనని నాస్కామ్ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ చెప్పారు.

తాజాగా యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ హెచ్1బీ వీసాలతో పొడిగింపుతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రీన్‌కార్డులను అనుమతులు నిరాకరించాలనే ఆలోచనలో ఉన్నట్లు వస్తున్న వార్తలపై ఆయనపై విధంగా స్పందించారు.

### హెచ్-1బీ వీసా కఠిన నిబంధనలతో




ఇదే కనుగ పక్కాగా అమలైతే.. అమెరికాలో పనిచేస్తున్న హెచ్1బీపై పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులతో పాటు గ్రీన్‌కార్డు దరఖాస్తులు ప్రాసెసింగ్‌లో ఉన్నా వారికి కష్టకాలం ముంచుకొచ్చినట్లేనని ఆయన అన్నారు.

డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారంలో బై అమెరికన్, హైర్ అమెరికన్ (అమెరికా వస్తువులనే కొనుగోలు చేయండి.. అమెరికన్లనే ఉద్యోగాల్లో పెట్టుకోండి) అనే నినాదంతో ఎన్నికల్లో గెలిచారు. విదేశీయులు స్థానికుల ఉద్యోగాలను కబళిస్తున్నారని అమెరికన్ల ఆవేదన. అయితే గత ఏడాది నుంచి ఈ దిశగా అమెరికా ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం తీసుకొనే చర్యల వల్ల ప్రతి భారతీయుడిపై ఎంతో కొంత ప్రభావం ఉంటుందని చంద్రశేఖర్ చెప్పారు.

భారీగా తగ్గిన వీసాల వినియోగం: అమెరికా ప్రతి ఏడాది భారత్‌కు 85వేల హెచ్1బీ వీసాలు మంజూరు చేసేవి.. భారతీయ ఐటి కంపెనీలు వీటిని ఇప్పటి వరకు చక్కగా వినియోగించు కున్నాయి. గత రెండేళ్ల నుంచి కొత్త నిబంధనలు తీసుకురావడంతో ఐటి కంపెనీలు కూడా స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చి వీసాలకు తగ్గించుకుంటున్నాయి. ప్రస్తుతం 10వేల కంటే కిందికి ఈ వీసాలు దిగివచ్చాయి. ప్రస్తుతం ఈ వీసాలు కూడా ఖరీదైన వ్యవహారంగా మారిపోవడంతో కంపెనీల లాభాల మార్జిన్‌పై ప్రభావం చూపుతోంది. వీసా రుసుము భారీగా పెంచేశారు. ఇదిలా ఉండగా ఒకవేళ ట్రంప్ అనుకున్నంత పనిచేస్తే.. దాని ప్రభావం భారత జీడీపీతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా పెద్ద దెబ్బే అని చంద్రశేఖర్ అన్నారు.

దీంతో పాటు భారతీయ ఐటి కంపెనీలకు మరో ఎదురుదెబ్బ తగలడానికి సిద్దంగా ఉంది. అది ప్రొటెక్ట్ అండ్ గ్రో అమెరికన్ జాబ్స్ (హెచ్‌ఆర్170) దీని ద్వారా కొన్ని హెచ్1బీ వీసాలు దుర్వినియోగం కాకుండా కొన్ని ప్రతిపాదనలు చేస్తోంది. వీసాలపై ఆధారపడిన కంపెనీలపై మరిన్ని కఠిన నిబంధనలు అమలు చేయబోతోంది. వీసాలు దుర్వినియోగం కాకుండా నిబంధనల విషయానికి వస్తే కనీస వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. వీసాలపై ఆధారపడిన కంపెనీలు హెచ్1బీ వీసాల దారుడి వేతనాన్ని ప్రస్తుతం 60,000 డాలర్లనుంచి 90,000 డాలర్లకు పెంచాలనేది కొత్తగా ప్రతిపాదించనున్న బిల్లులో చేర్చనుంది. దీంతో పాటు క్లయింట్ ఆ ఉద్యోగిని 5-6 సంవత్సరాల పాటు కొనసాగించాలని పక్కా నిబంధన తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ బిల్లు హౌజ్ జ్యూడిషిరీ కమిటి ముందుఆమోదం పొందింది. అటు నుంచి అమెరికా సెనెట్‌లో ఆమోదం పొందాల్సిఉంటుంది. నాస్కామ్ అంచనా ప్రకారం ప్రస్తుతం ప్రతిపాదించే చట్టంలో నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయని, దీని బట్టి చూస్తే వీసాలు లభించడం చాలా కష్టమని, దీంతో పాటు ఈ వర్క్ పర్మిట్లని ఎలా వినియోగిస్తారో అర్ధం కావడం లేదన్నారు.

### సంక్షోభంలో ఐదు లక్షల ఉద్యోగాలు

ఆనంద్ మహీంద్రా : ట్రంప్ ప్రభుత్వం వీసాల నిబంధనల్లో మార్పులు చేస్తే సుమారు ఐదు లక్షల నైపుణ్యం కలిగిన ఉద్యోగుల జీవితాలు గాల్లో దీపంలా తయారవుతాయని మహీంద్రాగ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా ట్విట్టర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక వేళ ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలను పొడిగించకపోతే (శాశ్వతంగా పౌరసత్వం) కోసం దరఖాస్తు చేసుకున్న వారు (గ్రీన్‌కార్డు) దరఖాస్తు దారుడు మాతృదేశానికి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇదే కనుక వాస్తవ రూపం దాల్చితే.. నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు తాను స్వాగతం పలుకుతానని, ప్రస్తుతం భారత్ కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని.. మీరు కూడా ఒక చేయి వేసి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

# వృద్ధిరేటు 7 శాతం దిగువకే!

- ఆర్థిక నిపుణుల అంచనా





**న్యూఢిల్లీ :** పెద్దనోట్ల రద్దు, జీఎస్టిప్రభావం వల్ల ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతం లోపే నమోదువుతుందని ఆర్థికవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 7.1 శాతంగా నమోదుకాగా.. 2015-16లో 8 శాతంగా నమోద య్యింది. ఇదిలా ఉండగా కేంద్ర గణాంకాల కార్యాలయం 2017-18 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఆదాయం గణాంకాలను శుక్రవారం నాడు విడుదల చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతం దాటడం కష్టమేనని, అయితే మూడవ త్రైమాసికంలో కాస్తా ఫర్వాలేదని ఎస్‌బీఐ పరిశోధన ఆర్థికవేత్త సౌమ్యకాంతి ఘోష్ చెప్పారు. తన అంచనా ప్రకారం గతేడాది మాదిరిగానే జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చునని అన్నారు. దీనికి ఆయన వివరణ ఇస్తూ.. గతేడాది విస్తరణను డౌన్‌గ్రేడ్‌గా సవరించి ఉంటే వృద్ధిరేటు ఎక్కువగా ఉండేదన్నారు. మాజీ ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా కూడా ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.2 నుంచి 6.3 శాతం మధ్యలో ఉంటుందన్నారు. యాక్సిస్ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త సుగాతా భట్టాచార్య కూడా గ్రాస్ వాల్యూయాడెడ్ (జీవీఏ) ఈ ఆర్థికసంవత్సరం 6.6 శాతం నుంచి 6.8 శాతం మధ్యలో ఉంటుందన్నారు. పన్ను వసూళ్లను పరిగణనలోకి తీసుకోలేదని.. ఒక వేళ పన్ను వసూళ్లు జోరందుకుంటే దాంతో పాటు జీడీపీ వృద్ధిరేటు కూడా అధికంగా ఉంటుందని ఆయన అన్నారు. కేంద్ర గణాంకాల కార్యాలయం ఆర్థిక వ్యవస్థ కొలమానానికి కొత్తగా జీవీఏ పద్ధతిని తీసుకువచ్చింది. అయితే కొత్త జీవీఏ పద్ధతిలో సబ్సిడీలను తీసేసిన తర్వాత మాత్రమే అసలు జీడీపీని లెక్క తెలుస్తున్నారు. మాజీ ప్లానింగ్ కమిషన్ సభ్యుడు, సీనియర్ ఆర్థికవేత్త అభిజిత్ సేన్ మాట్లాడుతూ ఈ ఆర్థికసంవత్సరం జీడీపీవృద్దిరేటు 6శాతం నుంచి 6.5 శాతం మధ్యలో ఉంటుందన్నారు. వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి వచ్చిన తర్వాత పన్ను వసూళ్లు బాగా తగ్గాయని ఆయన కారణాలు చెబుతున్నారు. తాజా పీఎంఐ గణాంకాలతో పాటు ఇతర గణాంకాలను చూపించి ఆర్థిక వ్యవస్థ బాగుందని చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. అయితే వాస్తవ పరిస్థితి చూస్తే అందకు భిన్నంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

### కియా మోటార్స్ ఇండియా ఎండీగా కుక్యూన్ షిమ్

**హైదరాబాద్ :** కియా మోటార్స్ ఇండియా (కెఎంఐ) కుక్యూన్‌సిమ్‌ను భారత్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా నియమించింది. ఆయన భారత్ మార్కెట్లో కియోమోటార్స్ మొదటి తయారీప్లాంట్ నిర్మాణం బాధ్యతలు చేపడతారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో కియా మోటార్స్ 1.1 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతోంది. కాగా ఆయనకు ఆటో రంగంలో సుమారు 30 సంవత్సరాల అనుభవం ఉంది.

# రహస్యంగా ఎన్నికల బాండ్ల ముద్రణ

- బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు విరాళాలు
- పారదర్శకత కోసం కేంద్రం చర్యలు
- ఎస్‌బీఐలో మాత్రమే బాండ్ల విక్రయం నుంచి మాత్రమే కొనుగోళ్లు




**న్యూఢిల్లీ :** రాజకీయపార్టీలకు కంపెనీలు విరాళాలు ఇవ్వడం తరచూ జరిగే తంతే! సాధారణంగా రాజకీయపార్టీలకు కంపెనీలు నల్లధనం ఇస్తుంటాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి పెట్టడానికి ప్ర భుత్వం సమాయత్తం అయ్యింది. ప్రభుత్వం కొత్తగా ఎన్నికల బాండ్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. రాజకీయపార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకునే వారు ఈ బాండ్లను ఇస్తే సరిపోతుంది.

అయితే ఈ ఎన్నికల బాండ్ల ముద్రణను ప్రభుత్వం కరెన్సీ నోట్ల ముద్రణ మాదిరగా రహస్యంగా ఉంచుతోంది. మార్కెట్లో నకిలీ బాండ్లు రాకుండా చూడ్డమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ బాండ్ల కాలపరిమితి కేవలం 15 రోజులు మాత్రమే ఉంటుంది. కొత్తగా రాత్రికి రాత్రి పుట్టుకొచ్చిన పార్టీలకు ఈ బాండ్లను విరాళంగా ఇవ్వడానికి వీల్లేదు. ఎందుకంటే ఆ పార్టీలు ఈ బాండ్లను సొమ్ము చేసుకొని మనీలాండరింగ్‌కు పాల్పడతారనే ఉద్దేశంతో కొత్త పార్టీలకు బాండ్ల విరాళాన్ని నిషేధిస్తున్నట్లు ఆర్థికమంత్రిత్వశాఖ వర్గాలు తెలియజేశాయి. ఎస్‌బీఐ ద్వారానే బాండ్ల అమ్మకాలు : ఈ బాండ్ల అమ్మకాల విషయానికి వస్తే కేవలం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు చెందిన ఎంపిక చేసిన బ్రాంచీల్లోనే విక్రయిస్తారు. ఇవి కూడా ప్రధానంగా పెద్ద నగరాలకు చెందిన బ్రాంచీల్లోనే విక్రయిస్తారని ఆ వర్గాలు తెలియజేశాయి. ఎన్నికల్లో నల్లధనం రాకుండా నిరోధించడానికి కొత్తగా ఎన్నికల బాండ్లను తీసుకొస్తున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం నాడు వివరాలు అందించారు. రాజకీయ పార్టీలకు నగదుకు బదులు బాండ్లను ఇవ్వాలనేది ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. అయితే ఇక్కడ ఎవరైతే రాజకీయ పార్టీలకు బాండ్లు విరాళాలుగా ఇస్తారో వారి పేర్లు గోప్యంగా ఉంచుతారు. అలాగే ఈ బాండ్లను ఏ రాజకీయపార్టీకి విరాళంగా ఇచ్చారో ఆ పార్టీ ఖాతాలోనే జమ అవుతాయి. ఈ బాండ్ల ముద్రణను అతి గోప్యంగా ఉంచుతున్నారు. ముద్రించేసమయంలో సమాచారం బయటికి పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కరెన్సీ ముద్రణకు ఎలాంటి నియమనిబంధనలు పాటిస్తున్నారో అలాంటి నిబంధనలనే ఈ బాండ్లకు పాటిస్తున్నారు. ఈ బాండ్లను కేవలం ఎస్‌బీఐ ద్వారా జనవరిలో, ఏప్రిల్, జులై, అక్టోబర్‌లలో కేవలం 10 రోజులు మాత్రమే విక్రయిస్తారు. అది కూడా ఎస్‌బీఐకి చెందిన 8-10 బ్రాంచీల్లో మాత్రమే అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం రాజకీయపార్టీలకు వచ్చే విరాళాలు పారదర్శకంగా ఉండాలనేది.. కాగా గత బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మదిలో నుంచి వచ్చింది ఈ ఎన్నికల బాండ్‌ల ఐడియా. ఈ బాండ్ల కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చే వ్యక్తిపేరు రహస్యంగా ఉంచుతారు. అయితే బాండ్ల కొనుగోలుకు మాత్రం కెవైసీ నిబంధనలు అమలవుతాయి. రాజకీయపార్టీల విరాళాలు ఇవ్వాలనుకునే వారు ప్రతిపక్షపార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకుంటే ఎలాంటి భయాందోళనలు లేకుండా ఇవ్వవచ్చు. ఒక వేళ విరాళం ఇచ్చే వ్యక్తిని రహస్యంగా ఉంచకపోతే పెద్దెత్తున నగదు విరాళాలను ప్రోత్సహించినట్లవుతుందని, రాజకీయ వ్యవస్థలో అన్నీ పారదర్శకంగా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలుతెలియజేశాయి.

ఇక ఎన్నికల బాండ్ల విషయానికి వస్తే ఇవి కేవలం రిజిష్టర్డ్ రాజకీయ పార్టీలకు మాత్రమే ఇవ్వడానికి అనుమతిస్తారు. అలాగే చివరి ఎన్నికల్లో ఒక శాతం ఓట్లు సాధిస్తేనే విరాళాలకు అర్హత సాధించినట్లవుతుంది. దీంతో పాటు రాజకీయపార్టీ ఎన్నికల కమిషన్ వద్ద ఒక బ్యాంకు ఖాతా నెంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. విరాళంగా వచ్చిన బాండ్లను 15 రోజుల్లోగా నగుదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం కొత్త రాజకీయ పార్టీలు బాండ్లను నగదుమార్చుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే ఈ బాండ్లను నగదుమార్చుకొని మనీలాండరింగ్‌కు పాల్పడే అవకాశాలున్నందు వల్ల కొత్త పార్టీలకు బాండ్ల విరాళాన్ని నిషేధించినట్లు ఆర్థికమంత్రిత్వశాఖ అధికారులు వివరించాయి.


# స్కోడా అమ్మకాల్లో 30% వృద్ధి



**ముంబై :** ఫోక్స్‌వ్యాగెన్ గ్రూపునకు చెందిన కార్ల తయారీ కంపెనీ స్కోడా ఏప్రిల్ 2016 నుంచి అక్టోబర్ 2017 మధ్యలో కొత్తగా నాలుగు మోడల్స్‌ను దేశీయ మార్కెట్లకు పరిచయం చేసింది. సూపర్బ్, రాపిడ్, ఒక్టావియా ఆర్ 230తో పాటు కొత్తగా 7 సీటర్ల ఎస్‌యూవీ కొడియాక్‌ను భారతీయ మార్కెట్లో విడుదల చేసింది. దీంతో 2016తో పోల్చుకుంటే 2017లో తమ అమ్మకాలు 30 శాతం పెరిగి 17,438 యూనిట్లకు చేరాయని ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త మోడల్స్‌ను విడుదల చేయడంతో అమ్మకాలు పెంచుకోడానికి వీలైందని, అలాగే ఈ ఏడాది 2018లో కూడా కొత్త మోడల్స్‌ను మార్కెట్లకు పరిచయం చేస్తామని స్కోడా ఆటో ఇండియా సేల్స్, మార్కెటింగ్ అండ్ సర్వీసెస్ డైరెక్టర్ అశుతోష్ దీక్షిత్ చెప్పారు. గత ఏడాది అక్టోబర్‌లో కొత్త ఎస్‌యూవీ కొడియాక్ విశేష స్పందన లభించిందని.. దీంతో గ్రూపు చెందిన అమ్మకాలు భారీగా పెరిగాయని తెలిపింది. ఈ ఏడాది కొత్త కొత్త మోడల్స్‌ను తీసుకువస్తామని, ర్యాపిడ్ మోడల్ కారు అత్యధికంగా అమ్ముడవు తోందన్నారు. డిజెల్‌కార్లపై మోజు తగ్గింది : దేశీయ వినియోగదారుల్లో డిజిల్ కార్లపై మోజు తగ్గింది. గతంలో పెట్రోల్, డిజిల్ ధరలకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో కొనుగోలుదార్లు డిజిల్ కార్లకొనుగోలుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం పెట్రోల - డిజిల్‌కు మధ్య వ్యత్యాసం తగ్గడంతో డిజిల్ కార్ల కొనుగోలుకు కస్టమర్లు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు.

# మార్కెట్ జోరు తగ్గింది

### అందరి దృష్టి క్యూ3 ఫలితాలపైనే



**ముంబై :** స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు స్వల్పనష్టాలతో ముగిశాయి. కార్పొరేట్ ఫలితాల సీజన్ ఈ వారంలోనే మొదలుకాబోతుండటంతో మదుపరులు వేచి చూసే దోరణిలో ఉన్నారు. ఆటో, ఐటి, చమురు సహజవాయువు, టెక్, హెల్త్‌కేర్ రంగానికి చెందిన షేర్లపై లాభాలను ఆర్జించడంతో సూచి నష్టపోయింది. సెన్సెక్స్ 33,929.61 పాయింట్ల వద్ద మొదలై అటు తర్వాత 33,998.37 పాయింట్లకు ఎగబాకి 33,765.43 వద్ద స్థిరపడింది. అయితే చివరి గంటలో మదుపరులు పెద్దమొత్తంలో షేర్లు కొనుగోలు చేయడంతో సూచి కాస్తా కోలుకొని చివరకు 18.88 పాయింట్లు నష్టపోయి 33,998.73 వద్ద ముగిసింది. గత రెండు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 244.57 పాయింట్ల వరకు నష్టపోయింది. ఇక నిఫ్టీ విషయానికి వస్తే కేవలం 1 పాయింట్ లాభపడి 10,443.20 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,503.60 నుంచి 10,429.55 వద్ద ఊగిసలాడింది. మార్కెట్లు ఉదయం లాభాలతోనే మొదలైనా.. తర్వాత మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాలు లేకపోవడంతో సూచి కిందికి దిగి వచ్చింది. ముడి చమురు ధరలు పెరిగిపోవడంతో దాని ప్రభావం మార్కెట్లపై కనిపించింది. లోహ రంగానికి చెందిన కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్న అంచనాతో షేర్లు పుంజుకున్నాయి. ఆటో రంగానికి చెందిన షేర్లపై మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఇటీవల కాలంలో ఆటో షేర్లు జోరందుకున్నాయి. మదుపరులు క్యూ3 ఫలితాలపై ఎదురుచూస్తున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మంగళవారం నాడు రూ.522.74 కోట్ల షేర్లు కొనుగోలు చేయగా.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.64.70 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయింది మాత్రం డాక్టర్ రెడ్డీస్ 2.97 శాతం వరకు క్షీణించింది. నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే విప్రో, ఒఎన్‌జీసీ, బజాజ్‌ఆటో, మారుతి సుజుకి, టాటామోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లు 2.73 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా లాభాలను ఆర్జించిన షేర్లు ఇలా ఉన్నాయి. అదానీ పోర్ట్స్ 2.78 శాతం, ఎల్ అండ్‌టి, ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్ బ్యాంకు, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటాస్టీల్ షేర్లు 2.75 శాతం లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీ 0.54 శాతం పుంజుకుంది. జామ్‌నగర్‌లో అతి పెద్ద రిఫైనరీ ఆఫ్ గ్రాస్ క్రాకర్‌ను ఏర్పాటు చేయడమే కారణం. హీరోమోటో కార్ప్ 0.17శాతం పెరిగింది. డిసెంబర్ అమ్మకాల్లో 43 శాతం పెరగడమే దీనికి ప్రధాన కారణం. టైటాన్ 1.30 శాతం లాభపడింది. క్యూ3 ఫలితాలు తమ అంచనాలకు తగ్గట్టే ఉన్నాయని తెలిపింది. పంజాబ్‌సింధ్ బ్యాంకు 3.32 శాతం లాభపడింది. ఎరువుల షేర్లు మాత్రం జోరందకున్నాయి. నాగార్జున ఫెర్టిలైజర్స్ 19.91 శాతం, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ 5.72 శాతం, గుజరాత్ స్టేట్ ఫెర్టిలైజర్స్ 2.49 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ 4.08 శాతం, జువారి ఆగ్రో కెమికల్స్ 2.46 శాతం, మంగళూరు కెమికల్స్ 3.59 శాతం, చంబల్ ఫెర్టిలైజర్స్ 2.07 శాతం పెరిగిన వాటిలో ఉన్నాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియా మార్కెట్లతో పాట ఐరోపా మార్కెట్లు లాభాలతో ముగిశాయి.

# తలాక్ పడేనా?!




(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ట్రిపుల్ తలాక్ బిల్లులో స్పష్టత లేదని, దీనిని సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాల్సిందేనని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ట్రిపుల్ తలాక్ బిల్లుకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో అడ్డుపడడం ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ముస్లిం మహిళలకు న్యాయం చేసేందుకు వచ్చిన సువర్ణ అవకాశాన్ని అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని బట్టి కాంగ్రెస్ పార్టీ ట్రిపుల్ తలాక్ బిల్లుకు వ్యతిరేకమని తేలిపోయిందని చెప్పారు. ఇప్పటికీ దేశంలో ట్రిపుల్ తలాక్ కేసులు నమోదవుతూనే ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. దీనిపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా లేదని విమర్శించారు. బిల్లును పెండింగ్‌లో పెట్టేందుకు, కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందన్నారు. ముస్లిం మహిళలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని అన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు మహిళల గౌరవ ప్రతిష్టలను పెంచేదని అన్నారు. సుప్రీంకోర్టు సైతం ట్రిపుల్ తలాక్‌ను రాజ్యాంగ విరుద్ధమని తేల్చిందని, దీనిపై చట్టం చేయాలని సూచించిందని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం సూచనమేరకే తాము బిల్లును తయారు చేశామని అన్నారు. ఈ బిల్లుకు అడ్డుపడడం సరైన చర్య కాదన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు వ్యతిరేకం కాదని కాంగ్రెస్ పార్టీ అంటోంది. అయితే అందులోని కొన్ని అంశాలపై అభ్యంతరాలున్నాయని, అందుకే విస్తృతంగా చర్చించేందుకు సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని కోరుతున్నామని అంటోంది. వివాహం అనేది సివిల్ అంశమని, దానిని క్రిమినల్ అంశంగా మార్చడం సబబు కాదని చెబుతోంది. అలాగే తలాక్ చెప్పిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష వేయాలని ప్రతిపాదించడం కూడా సరైంది కాదని అంటోంది. భర్త జైలుకు వెళితే, భార్య, పిల్లల పోషణ భారం ఎవరు చూస్తారని ప్రశ్నిస్తోంది. కోర్టుకు అప్పీల్ అంశం లేవనెత్తి ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

అధికార, విపక్షాలు ఎవరూ పట్టువీడకపోవడంతో రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న నోటీసుపై ఓటింగ్ నిర్వహించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అదే సమయంలో న్యాయశాఖ మంత్రి మాట్లాడేందుకు ప్రయత్నించడంతో ఇరుపక్షాలు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దాంతో డిప్యూటీ చైర్మన్ కురియన్ సభను గురువారానికి వాయిదా వేశారు. పార్లమెంటు సమావేశాలు శుక్రవారం ముగియనుండడంతో ఎట్టిపరి స్థితుల్లోనూ బిల్లు పాస్ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# శరవేగంగా హైకోర్టు విభజన

**● ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తుల సమావేశం**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఉమ్మడి హైకోర్టు విభజనకు సమయం ఆసన్నమైంది. అమరావతిలో ఏపీ హైకోర్టును తాత్కాలిక భవనంలో ప్రారంభించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యం లో ఉమ్మడి హైకోర్టులో విభజన అలజడి మొదలయ్యింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలో న్యాయమూర్తుల (ఫుల్ కోర్టు) సమావేశం బుధవారం గంట పాటు జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరుగా హైకోర్టులు వచ్చే జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకోసం అవసరమైన భవనాలను పరిశీలించేందుకు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ త్వరలో న్యాయమూర్తులతో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. న్యాయమూర్తుల కమిటీ ఏపీకి వెళ్లి అక్కడి భవనాలను పరిశీలించి హైకోర్టు ఏర్పాటు నిమిత్తం భవనాన్ని పరిశీలించి ఎంపిక చేసి తుది నిర్ణయాన్నిజనవరి చివరి వారంలోగా తెలియజేస్తే జూన్‌లో హైకోర్టు ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేసుకుంటామని ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ లేఖను ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కి గత శనివారం అందజేశారు. ఏపీ ప్రభుత్వం గుర్తించి న కొన్ని భవనాలను జడ్జీల కమిటీ పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు, మార్పులు చేర్పులు చేసేందుకు తగు సూచనలు చేస్తుంది. జడ్జీల కమిటీ సూచనలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం భవనాన్నిఏప్రిల్, చివరి వారంలో సిద్ధం చేసేందుకు, మేవి సెలవుల్లో ఫైళ్లు, ఫర్నీచర్ తదితర సామాగ్రిని ఏపీ హైకోర్టుకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌లో ఉన్న హైకోర్టుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి కక్షిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఏపీ హైకోర్టును అమరావతి ప్రాంతంలోని తాత్కాలిక భవనం లో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం హైకోర్టు అవసరాలకే కాకుండా న్యాయమూర్తులు, సిబ్బంది నివాసాలకు కూడా తగిన భవనాలు అవసరమవుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నప్పటి నుంచి హైకోర్టు విభజనపై తెలంగాణ ప్రభుత్వం , న్యాయ వాదులు కేంద్ర ప్రభుత్వం పై తీవ్రంగా ఒత్తిడి తెచ్చాయి. అయితే అప్పట్లో ఏపీ అంతగా సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం, భవనాలను సిద్ధం చేయకపోవడంతో ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఆలస్యమైంది. అయితే తాత్కాలిక భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ఏపీ ముఖ్య మంత్రి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంతో ప్రత్యేక హైకోర్టు చేసేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. దీనికి తోడు లోక్ సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటన చేయడంతో ఉమ్మడి హైకోర్టు విభజనకు మార్గం సుగమమైంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 కింద ఉమ్మడి హైకోర్టు విభజనకు కేంద్ర న్యాయశాఖ అనుమతించింది. దీనికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇందులో భాగంగా హైకోర్టులో న్యాయమూర్తుల సమావేశం జరిగింది. కమిటీ ఏర్పాటుపై చర్చ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఆ తర్వాత ఏపీ హైకోర్టు అమరావతికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఇటు తెలంగాణ హైకోర్టు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌ను కలిసి హైకోర్టు విభజనపై చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రపతి నోటిఫికేషన్ వెలువడిన తర్వాత తగు చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే జూన్2 నాటికి తెలంగాణ హైకోర్టు ఏర్పడటం ఖాయమని, అందుకు అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.

## జనపనార సంచుల్లోనే

# ఇక ప్యాకింగ్

(మొదటిపేజీ తరువాయి)

పాటిస్తోంది. తాజా నిర్ణయంతో 90శాతం ఆహారధాన్యాలన్నీ జనపనార సంచుల్లోనే ప్యాక్ చేయాల్సి ఉంది. అలాగే 20శాతం చక్కెరను జుట్ బ్యాగుల్లోనే నింపాలి. ఆంధ్రప్రదేశ్, ఈశాన్యరాష్ట్రాలు, ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ రైతులకు దీని వల్ల లబ్ది చేకూరనుంది. ప్రభుత్వ సంస్థలే రూ.5500 కోట్ల రూపాయల విలువైన జనపనార ఉత్పత్తులను అత్యధికంగా వీటిని కొనుగోలు చేస్తుంటాయి. దీంతో 40లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతుంది.

**విశాఖ స్టీల్ ఫ్యాక్టరీలో పెట్టుబడుల ఉపసంహరణకు గతంలోనే ఆమోదం**

విశాఖ ఉక్కు కర్మాగారంలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనకు 2012లోనే కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని ఉక్కు శాఖ సహాయ మంత్రి విష్ణుదేవ సాయి వెల్లడించారు. అద్భుతమైన పనితీరుతో ప్రభుత్వ రంగంలో నవరత్నగా ప్రసిద్ధి చెందిన విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీలో పెట్టుబడుల ఉపసంహరణకు కారణాలేంటని రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విజయ సాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని అనుసరించి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వంద శాతం వాటాలో 10 శాతాన్ని పబ్లిక్ ఇష్యూ ద్వారా విక్రయించడం జరుగుతుందని విష్ణుదేవ అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో నష్టాలకు ప్రతికూల మార్కెటింగ్ పరిస్థితులు, ఉక్కు ఉత్పాదనల అమ్మకాలలో క్షీణత, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన బొగ్గు ధరలు, అంతర్జాతీయంగా ఉక్కు పరిశ్రమల్లో ఏర్పడిన మాంధ్యం ప్రధాన కారణాలలో కొన్ని అని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో దేశీయ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వివరించారు.

దిగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీ విధించడం, ఉక్కు దిగుమతులకు కనీస ధరను నిర్ణయించడం, క్వాలిటీ కంట్రోల్ చర్యల ద్వారా ఉక్కు ఉత్పాదనలు, దిగుమతులు బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిబంధనలు విధించడం, ప్రభుత్వ వినియోగం కోసం కొనుగోలు చేసే ఉక్కు ఉత్పాదనలన్నిటినీ తప్పనిసరిగా దేశీయ ఉక్కు పరిశ్రమల నుంచి మాత్రమే సేకరించే విధానాన్ని ప్రకటించడం వంటి పలు చర్యలను కేంద్రం చేపడుతున్నట్టు విష్ణుదేవ సాయి తెలిపారు.

## తాంత్రిక తతంగంపై

# ఈవోకు ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలోనూ సభ్యులకు సారీ చెప్పడం జరిగింది. తాజాగా అర్ధరాత్రి పూట అంతరాలయ తలుపులు తెరిచేందుకు కనీస సమాచారాన్ని పాలకమండలి సభ్యులకు ఇవ్వకపోవడం వారి ఆగ్రహం తెప్పించింది. గతంలో టెండర్లు లేకుండానే కోట్ల రూపాయిల సరకులు కొనుగోలు చేసి,ఆరోపణలు మూటకట్టుకున్నారు. కాగా అంతరాలయంలో అర్ధరాత్రి పూజల వ్యవహారాన్ని ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఈవో సీఎం ఆగ్రహానికి గురికాకతప్పలేదంటున్నారు. దీంతో ఈవో సూర్యకుమారిని బదలీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఆమె స్థానంలో సింహాచలం ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ దుర్గగుడి ఈవోగా రానున్నట్టు ప్రచారం ఊపందుకున్నది. ఇంకో వైపు ఈవో బదలీ అయ్యారని కూడా అంటున్నారు.కాగా


ఆలయంలో తాంత్రికపూజలు జరిగాయని ధర్మకర్తల మండలి ఛైర్మన్ యలమంచిలి గౌరంగబాబు స్పష్టం చేశారు. అమ్మవారి ఆలయ ప్రతిష్టను మసకబార్చే విధంగా ఈవో సూర్యకూమారి పాల్పడిందిని కనీసం ధర్మకర్తలకు సమాచారం లేకుండానే అర్ధరాత్రి అంతరాలయం తలుపులు తెరిపించి తాంత్రికపూజలు జరిపించారని అంటున్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా మీడియా ప్రతినిధులకు వివరించారు.. దుర్గగుడి పాలనంతా అవినీతి మయమైందని పేర్కొన్నారు. ఈవో సూర్యకుమారి హయంలో లెక్కలేనన్ని అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. ఇలా ఉంటే ఈ ఘటనల నేపథ్యంలో ఈవో కార్యాలయంలో హడావుడి వాతావరణం నెలకొంది. ఈవో బదలీ అయినట్లు ప్రచారం జరగడంతో సిబ్బంది హడావిడిగా కొన్ని దస్త్రాల మీద సంతకాలు చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే మంగళవారం అర్ధరాత్రి నవమి గడియాల్లో అంతరాలయంలోకి వెళ్లిన వారు మహిషాసురమర్ధని దేవిగా అమ్మవారిని అలంకరించినట్టు పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఇందుకు ఈవో అనుమతి కూడా ఉందనే కొందరు చెబుతున్నారు. అయితే ఈవో సూర్యకుమారి మాత్రం కేవలం ఆలయంలో శుద్ధి మాత్రమే అర్చకులు నిర్వహించారని బుధవారం విలేకరులకు వెల్లడించారు. పాలక మండలి సభ్యులకు తనకు మధ్య కొంత గ్యాప్ ఉందన్నారు. గ్రూపుల తగదాతోనే ఈ రాద్ధాంతం జరుగుతోందని అన్నారు. దుర్గగుడిలో శాస్త్రీయమైన పూజలు మాత్రమే జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా ఈ ఘటనలో ఇప్పటివరకు కేవలం క్యాలైన్ ఇన్స్పెక్టర్ డ్యూటీ మాత్రమే మార్చారు.అంతకుమించి ఎవరిపైనాఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**పూజలకు ఆస్కారమే లేదుః మంత్రి మాణిక్యాలరావు**

కాగా ఆలయంలో అర్ధరాత్రి పూజలు జరిగే ఆస్కారమే లేదని మంత్రి మాణిక్యాలరావు కొట్టిపారేస్తున్నారు. ఆరోజు కేవలం అంతరాలయం శుద్ధి మాత్రమే చేసి,అలంకరణ చేశారని చెప్పారు. రాష్ట్రపతి భార్య వస్తున్నారని అమ్మవారిని సుందరంగా అలంకరించేందుకు బయట నుంచి వ్యక్తులను బద్రీనాథ్ తీసుకొచ్చారని అన్నారు. అయితే బయట వ్యక్తులు ఆలయంలోకి రావడం అభ్యంతరకరమేనని పేర్కొన్నారు.ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణకు నిజ నిర్ధారణ కమిటీని వేస్తున్నామని చెప్పారు. ఇంకో వైపు పోలీస్ విచారణ కూడా జరుగుతుందన్నారు.అయితే ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా వ్యవహరిస్తే మాత్రం సహించేదిలేదని, చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు.

# కుప్పకూలిన దేవాలయ వ్యవస్థ

**● తాంత్రిక పూజలతో రాష్ట్రాన్ని ఏం చేయబోతున్నారు? ● దెబ్బతిన్న భక్తుల మనోభావాలు ● సాత్విక శక్తులు రప్పించేందుకు సంప్రోక్షణ చేయాల్సిందే ● పీఠాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి ● విశాఖ శారదాపీఠధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి**



విశాఖపట్నం,ప్రభన్యూస్ బ్యూరో : రాష్ట్రంలో దేవాలయ వ్యవస్థ సర్వనాశనమైందని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ధ్వజమెత్తారు. దుర్గ గుడిలో తాంత్రిక పూజలు నిర్వహించడంపై స్వరూపానందేంద్ర తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఇక్కడ పీఠం ప్రాంగణంలో పాత్రికేయులతో స్వామీజీ మాట్లాడుతూ తాంత్రిక పూజలు వెనుక ఏ అధికారులు హస్తముందో బయటపెట్టాలన్నారు. ఇదే సమయంలో ఏ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు సహకారం అందించారో తెలియాల్సిన విషయం కూడా ఉందన్నారు. పవిత్రమైన దుర్గ గుడిలో తాంత్రిక పూజలు నిర్వహించి ఈ రాష్ట్రాన్ని ఏం చేయబోతున్నా రని స్వరూపానందేంద్ర ప్రశ్నించారు. అధికారుల సహకారం లేకుండా ఒక అర్చకుడు ఏ విధంగా ఆలయంలోకి వెళ్లగలరన్నారు. అంత పెద్ద దేవాలయంలో ఈ విధమైన క్షుద్ర పూజలు జరిగితే భక్తులు మనోబావాలు ఏ విధంగా దెబ్బతింటాయన్నది అందరికి తెలిసిందేనన్నారు. దుర్గ ఆలయంలో క్షుద్రపూజలు నిర్వహించి వివాదం జరుగుతున్నా ఇప్పటి వరకు నిజనిర్ధారణ కమిటి నియమించకపోవడం దారుణమన్నారు. సామాన్యమైన పోలీసులతో మొక్కుబడి విచారణ సాగించడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాలకు రక్షణ కరువైందన్నారు. ఇప్పటికే ఆలయాల ఆదాయం అంతా పక్కదారి పట్టిందని, మరో వైపు పెద్ద ఎత్తున దుర్వినియోగం కూడా జరుగుతుందన్నా రు. ఇదే పరిస్తితి కొనసాగితే దేవాలయ వ్యవస్థ కుప్పకూలిపో వడం ఖాయమన్నారు. అమరావతి రాజధానిలో 40 దేవాలయాలను రాత్రికి రాత్రే కూల్చివేస్తే అడిగే నాధుడు లేడన్నారు. ఆలయంలో క్షుద్ర పూజలు జరిగిన నేపథ్యంలో తక్షణమే అక్కడ ఏ విధమైన సంప్రోక్షణ జరపాలి, అమ్మ వారికి తిరిగి సాత్విక శక్తులు ఏ విధంగా రప్పించాలన్నది పీఠాదిపతులు , మఠాదిపతులతో చర్చించి ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఒక వైపు హిందూధర్మ పరిరక్షణకు శారదాపీఠంతో పాటు అనేక ఆధ్యాత్మిక సంస్థలు పాటుపడగా , సాక్షాత్తు దుర్గ గుడిలో ఈ విధంగా తాంత్రిక పూజలు నిర్వహించడం దేశవ్యాప్తంగా భక్తుల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇటువంటి సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వరూపానందేంద్ర డిమాండ్ చేశారు. ఉత్తరపీఠాధిపతి కిరణ్‌కుమార్ శర్మ, పీఠం శ్రీకార్యం కామేశ్వరశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


# క్షుద్రపూజలు వట్టిదే!



**కోడూరు,ప్రభన్యూస్ :** ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో దుర్గమ్మ సన్నిధిలో ఎటువంటి క్షుద్రపూజలు జరగలేదని ఆరోపణ లు ఎదుర్కొం టున్న ఘంటసాల పార్థసారధి స్పష్టం చేశారు. గత నెల డిసెంబర్ 26వ తేదీన అర్ధరాత్రి దుర్గ గుడిలో క్షుద్రపూజలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘంటసాల పార్దసారధి కృష్ణా జిల్లా కోడూరు మండలంవిశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వారు. బుధవారం ఆయన నివాసం వద్ద ఆంధ్రప్రభ ప్రత్యేక ఇంటర్యూ చేసింది. ఈ సందర్భంగా తమ పూర్వీకులు నుంచి దాదాపు 100సంవత్సరాలుగా పురోహితుల్లో ఉంటున్నామని చెప్పారు. విశ్వనాధపల్లి గ్రామం లో వేంచేసియున్న శివాలయంలో ప్రధాన అర్చకులుగా ఉంటూ స్వామి వారికి సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే మాచవరంలోని శివాలయం మరియు అద్దంకి నాంచారమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి అలంకరణలో పాల్గొంటామని, తమ కుటుంబం మొత్తం పురోహిత్యం పై కొనసాగుతుందని పేర్కొన్నారు. దుర్గగుడి ప్రధాన అర్చుకులు బద్రీనాథ్ తమ పెద్దమ్మ అబ్బాయి కావటం వల్ల అక్కడ దేవాలయంలో అలంకరణ నిమిత్తం ఎప్పుడైనా వెళ్తుంటానని , గతంలో నాలుగు సార్లు వెళ్లినట్లు వెల్లడించారు. అమ్మవారి శాఖాలంకరణకు దుర్గగుడికి వెళ్లినట్లు చెప్పారు. దుర్గ గుడిలో క్షుద్ర పూజలు చేస్తున్నారనే ఆరోపణలపై ఆయన స్పందిస్తూ అసలు దుర్గ గుడిలో క్షుద్రపూజలకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. గత నెల 27వ తేదీ భారత రాష్ట్రపతి సతీమణి వస్తున్నారని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయటం జరిగిందని, అలంకరణ చేయటానికి మాత్రమే వెళ్లినట్లు చెప్పారు. అసలు దుర్గ గుడిలో క్షుద్ర పూజల జరుగ లేదని స్పష్టం చేశారు. దేవాలయంలో వందలాదిమంది పూజారులుండగా అలంకర ణకు ఎందుకు వెళ్లారనే ప్రశ్నకు ఆయన బదులిస్తూ దుర్గ గుడి అర్చకులు బద్రీనాద్ తమ బాబాయి కావడం వల్ల అమ్మవారి అలంకరణకు వెళ్లానని. అంతే తప్పా వేరే పూజలలో పాల్గొనటానికి వెళ్లలేదన్నారు. గత నెల 26వ తేదీ 11గంటల కల్లా అమ్మ వారి అలం కరణలు పూర్తవగానే తాను బయటకు వచ్చేశానని, తర్వాత ఏమి జరిగిందో తనకు తెలియదన్నారు. ఆ రోజు అలంకరణలో ప్రధానఅర్చకులు భద్రీ నాథ్, పెదపులివేరుకు చెందిన సుజిన్, ప్రణబ్ లు పాల్గొన్నారని తెలిపారు. సీసీ ఫుటేజీలో కూడా అమ్మవారి అలంకరణకు పూలు అందిస్తున్నానే తప్పా క్షుద్రపూజలో నేను పాల్గొనలేదని చెప్పారు.

# గజల్‌కు బెయిల్ ఇవ్వొద్దు.. బెదిరిస్తారు..

**● ఏడు రోజుల కస్టడీకి పోలీసుల అభ్యర్థన**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** మహిళను లైంగికంగా వేధించిన కేసులో అడ్డంగా బుక్కయిన గజల్ శ్రీనివాస్ బెయిల్‌కు సంబంధించి బుధవారం నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. అంతకుముందు బెయిల్ ఇవ్వవద్దని పంజాగుట్ట పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. గజల్ శ్రీనివాస్ బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశముం దని పోలీసులు తమ కౌంటర్లో పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా పలువురిని విచారించాల్సి ఉందన్నారు. ఆయనకు సమాజం లో పలుకుబడి ఉందని, కేసులో బాధితురాలి వాంగ్మూలం రికార్డ్ చేయాల్సి ఉందని చెప్పారు. గజల్ శ్రీనివాస్‌ను తమకు ఏడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయనకు బెయిల్ వస్తుందా? పోలీసుల కస్టడీకి కోర్టు అనుమతిస్తుందా అనే ఆసక్తి నెలకొంది. కేసులో ఏ1గా గజల్ శ్రీనివాస్ ఉండగా, ఏ2గా పార్వతి ఉన్నారు. పార్వతిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. రిమాండు రిపోర్టులో సంచలన విషయాలు ఉన్నాయని తెలుస్తోంది. మహిళల పట్ల గజల్ శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించేవాడని, అభ్యంతరకరమైన ప్రాంతాల్లో మసాజ్ చేయాలని బెదిరించేవాడని బాధిత యువతి చెప్పినట్లుగా రిపోర్టులో ఉంది.

# ఆర్టీసీ ఎండీ పోస్టుపై పలువురి కన్ను

**● పావులు కదుపుతున్న సీనియర్ ఐఏఎస్‌లు ● తెరపైకి మాజీ డీజీపీ నండూరి పేరు ● అధికారులకు విడిదిగా మారిన పోస్టు**

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఇప్పుడు ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టుకు మంచి గిరాకీ ఏర్పడిందంటున్నారు. సీనియర్ఐపీఎస్‌లకు ఈ పోస్టు వరప్రసాదంగా మారిందంటున్నారు.తాజాగా ఈ పోస్టుకు క్రేజీ ఏర్పడిందంటున్నారు. ఎందుకంటే ఎవరైతే ఆ పోస్టులో కూర్చుంటారో వారిని డీజీపీ పోస్టు వరించే అవకాశం ఉండడంతో సీనియర్ ఐపీఎస్‌లంతా ఈ పోస్టుపై కన్నేసి,పావులు కదుపుతున్నారు. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో దీని కోసం పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు ఆరంభించారు. సీనియర్ ఐపీఎస్‌లు ఠాగూర్‌తో పాటు ప్రస్తుత విజయ వాడ పోలీస్ కమిషనర్ గౌతమ్‌సవాంగ్, తాజాగా మరో సీనియర్ ఐపీఎస్ అధికారి సురేంద్రబాబు పేరు కూడా వినిపిస్తోంది. ఇలా రోజుకొక అభ్యర్థి పేరు వినిపిస్తోంది. మళ్లీ బుధవారం ఇంకో మాజీ డీజీపీ పేరు తెరపైకి వచ్చింది. డిసెంబర్ ఆఖరు వరకు ఆంధ్రప్రదేశ్ డీజీపీగా పని చేసి, ప్రభుత్వ మన్ననలు అందుకున్న నండూరి సాంబశివరావు పేరు తెరపైకి తెచ్చారు. తెలంగాణలో కూడా ఓ రిటైర్ అధికారిని అక్కడి ప్రభుత్వం ఆర్టీసీ ఎండీగా నియమించిందం టున్నారు. ఆంధ్రాలో కూడా తెలంగాణ మాదిరిగా రిటైర్డ్ పోలీస్ అధికారి సాంబశివరాను నియమిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు ఏ అధికారి వచ్చినా పట్టుమని సంవత్సరం కూడా ఆర్టీసీలో పని చేసిన దాఖలాలు లేవు. ఒక విధంగా చెప్పాలంటే పదవి విరమణ దశలో ఉన్న సీనియర్ ఐపీఎస్‌లకు ఆర్టీసీ ఎండి పోస్టు ఒక విడిదిగా మారిందంటున్నారు. డీజీపీ పదోన్నతి పొందడం, ఈ పోస్టులోకి రావడం ఆ తర్వాత డీజీపీగా వెళ్లిపో వడం జరుగుతుంది.

దీంతో మళ్లీ ఆర్టీసీ ఎండీ పోస్టు ఖాళీగా మారడం ఆనవాయితీ గా మారిందంటున్నారు. ఇలా ఈ పోస్టు ను తమ అవసరాలకు అనుగుణంగా వాడుకుంటు న్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇక నుంచైనా ఈ పోస్టులో ఎక్కువ కాలం ఉండే విధంగా నియమకం చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నారు. అసలే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని బయట పడేయాలంటే కొంచెం ఎక్కువ కాలం పదవిలో ఉండే అధికారులను ఈ పోస్టులో నియమిస్తే సంస్థ నష్టాల నుంచి బయట పడడానికి అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

# రాష్ట్రంలో మరో 1,02,977 ఇళ్ల నిర్మాణం

**అమరావతి,ఆంధ్రప్రభ :** ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకం( బిఎల్‌సీ ) కింద 2017 - 18 సంవత్సరానికి రాష్ట్రంలో కొత్తగా 1,02,977 ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద ఒక్కో ఇంటికి రూ. 3.50 లక్షలు వ్యయం చేయనున్నారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ కింద రూ. 1.50వేలు ఉంటుంది.కేంద్ర సబ్సిడీ రూ. 1లక్ష ఉండగా,లబ్దిదారుడు రూ. 25వేలు భరించాల్సి ఉంటుంది. మిగతా 75వేలను ప్రభుత్వం బ్యాంక్ రుణంగా అందజేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పథకం కింద ఒక్కో ఇంటిని 323 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రూ. 1544.66 కోట్ల ఆర్థిక సాయాన్ని అందిస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ అన్ని ఇళ్లకు కలిపి మొత్తంగా రూ. 3604.20 కోట్లను ఖర్చు చేయబోతున్నట్లు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో కార్యదర్శి క్రాంతిలాల్ దండె తెలిపారు.

# తెరపైకి రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు స్మృతి వనం



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాజధాని ప్రాంతంలో అంబేద్కర్ స్మృతివనం తరహాలో ప్రాచీన చారిత్రక అమరావతి సృష్టి కర్త రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు స్మృతి వనం ఏర్పాటు చేయాలనే అంశం తెరపైకి వచ్చింది. అదేవిధంగా వాసిరెడ్డి జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఆయన అభిమానులు నూతన సంవత్సరం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడ్ని కలిసి కోరడంతో ఈ అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. చరిత్రను పరికిస్తే క్రీశ 1761, ఏప్రిల్ 20న జన్మించిన రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు అమరావతిని రాజధానిగా చేసుకుని 1817 వరకు అమరావతి ప్రభువుగా వెలుగొందారు. ఇప్పటి ధరణికోట అప్పటి ధాన్యకటకాన్ని కేంద్రంగా చేసుకుని సుదీర్ఘ పాలనచేసి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 366 పైగా దేవాలయాలను నిర్మించి, ధూప, దీప, నైవేద్యాల నిమిత్తం కొన్ని వేల ఎకరాల్లో దానధర్మాలు చేశారు. అందులో ప్రముఖమైనవి అమరావతి శ్రీఅమరలింగేశ్వర స్వామి దేవస్థానం, చేబ్రోలు భావన్నారాయణ స్వామి గుడి, మంగళగిరి శ్రీపానకాల నర్సింహ స్వామి దేవస్థానం తదితరాలు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి. ఇందులో మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి 11 అంతస్తుల గాలిగోపురం నిర్మించడం విశేషం. విభజన అనంతరం రాజధానికి అమరావతి అనే నామకరణం చేసి నాలుగేళ్లు కావస్తోంది. కానీ ఇంత చరిత్ర కలిగిన రాజా వాసిరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తుందని హామీ నివ్వడం జరిగింది. అలాగే ఆయన వారసులు గుంటూరులో నిర్వహించిన సమావేశంలో కూడా ముఖ్యమంత్రి పలు హామీలనివ్వడం జరిగింది. అయితే ప్రభుత్వం ఆయనను విస్మరిస్తోందని అభిమానులు ఆవేదన చెందుతున్నారు. కృష్ణాపుష్కరాల సమయంలో సీఎం చంద్రబాబు అమరావతిని సందర్శించిన సమయంలో స్వర్గీయ రాజా వాసిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ సీఎం ఇచ్చిన హామీలు నెరవేరకపోయినా, కనీసం ప్రభుత్వం వాసిరెడ్డి జయంతి, వర్ధంతినీ అధికారికంగా నిర్వహించడం లేదంటూ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అమరావతి ప్రాంత వాసులుగా ముఖ్యమంత్రిని కలిసి అమరావతి ప్రజల ఆకాంక్షను తెలిపినట్లు చెప్పారు. నవ్యాంధ్ర నూతన రాజధానిలో 125 అడుగుల వాసిరెడ్డి విగ్రహం తోపాటు 25 ఎకరాల్లో స్మృతి వనం భావితరాలకు ఆయన చేసిన సేవలు గుర్తిండేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రిని పలువురు కోరడం జరిగింది. అలాగే ఆయన జయంతిని రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర పండుగగా జీవో విడుదల చేసి అధికారికంగా జరపాలని కోరారు. చారిత్రక అమరావతిలో ఉన్న రాజావారికోటను మ్యూజియంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. నేటి వరకు కూడా ఆచరణలో ముందుకు వెళ్లలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కోటను మ్యూజియంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రిని కోరినట్లు అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు తెలిపారు.

# గిరిజన కుంభమేళాకు అన్నీ సిద్ధం

**ఉప రాష్ట్రపతికి టీ. సర్కార్ ఆహ్వానం**

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరను ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సమాయత్తంగా ఉందని తెలంగాణా దేవాదాయ శాఖా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు సీతారాం నాయక్, నగేష్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి బుధవారం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుణ్ని మర్యాదపూర్వకంగా కలిశారు. జాతరకు తప్పకుండా రావాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. శరవేగంగా జరుగుతున్న జాతర ఏర్పాట్లను వెంకయ్యకు వివరించారు. అనంతరం ఇంద్రకరణ్ రెడ్డి తెలంగాణా భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో మీట్ ది ప్రెస్‌లో పాల్గొన్నారు. 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే జాతరకు ఉప రాష్ట్రపతిని ఆహ్వానించినట్టు పాత్రికేయులకు తెలిపారు. గిరిజన బిడ్డలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సూచించాలని ఉపరాష్ట్రపతిని కోరినట్లు ఇంద్రకరణ్ చెప్పారు.



## కర్నూలు జిల్లాలో విషాదం

# టిప్పర్ బోల్తాపడి ఏడుగురి దుర్మరణం

### తెల్లారిన వలస కూలీల బతుకులు

**ఆదోని , ప్రభన్యూస్:** రెక్కాడితే కాని డొక్కాడని వలస కూలీలు పొట్ట కూటి కోసం బతుకుదెరువుకు వచ్చి తిరిగి జన్మభూమికి చేరుకుంటున్న తరుణంలో తెల్లారేసరికి వారి బతుకులు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. మరికొద్దీ సేపట్లో స్వగ్రామం చేరుకుంటున్న సమయంలో ఏడుగురు కూలీలను మృత్యుదేవత వాహన రూపంలో కబళించివేసింది. మరో ఏడుగురి పరిస్థితి విషమంగా వుండగా , ఓ చిన్నారి మృత్యుదేవతతో పోరాటం సలుపుతోంది. కర్నూలు జిల్లా ఆదోని పోలీసు సబ్ డివిజన్ ఆస్పరి మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామానికి చేరువగా బుధవారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద వివరాలు ఇలా వున్నాయి. కర్నూలు జిల్లా హోళగుంద మండలంలోని కొత్తపేట గ్రామం జిల్లాలో పూర్తిగా వెనుకబడిన ప్రాంతం. సుమారు 80 ఇళ్లు కలిగి 250 మందికి పైగా నివసిస్తున్న ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఏటా బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లడం పరిపాటిగా మారింది. విజయదశమి సందర్భంగా ఈ ప్రాంతంలో జరిగే దేవరగట్టు బన్ని ఉత్సవాల అనంతరం వలస వెళతారు. ఇందులో భాగంగా గత అక్టోబరు నెల మొదటి వారంలో గ్రామానికి చెందిన పలువురు వలస కూలీలు తెలంగాణా రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో గల బొర్లపల్లి గ్రామానికి వలస వెళ్లారు. సుమారు 3 నెలల పాటు పత్తిపొలాల్లో కూలీపనులు చేసి తిరిగి స్వగ్రామం వెళ్లి బంధుమిత్రులతో కలసి జీవించేందుకు కొత్తపేట వెళ్లేందుకు సిద్ధమయ్యారు. తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి టిప్పర్ వాహనాన్ని బొర్లపల్లికి రప్పించారు. 30 మంది వలస కూలీలు తమకు చెందిన బియ్యం మూటలు, ఇతర సామాగ్రితో మంగళవారం కొత్తపేటకు పయనమయ్యారు. మరో గంటలోపు స్వగ్రామానికి వీరంతా చేరుకోవాల్సి వుండగా తాము పయనిస్తున్న వాహనమే మృత్యుదేవతగా మారింది. అకస్మాత్తుగా టిప్పర్ టైరు పంక్చర్ కావడం , ఆ వెంటనే అదుపు తప్పి బోల్తాపడింది. దీనితో పయనిస్తున్న వారిలో ఐదుగురు ప్రమాద స్థలంలోనే దుర్మరణం చెందగా , మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మృతి చెందిన వారిలో బళ్లారి శేకమ్మ (48) , కోసిగి ఈరమ్మ(45) , చిన్న మంగమ్మ( 42), నర్సమ్మ(40) గోవిందమ్మ (50) నారాయణ(45) లు వున్నారు. ఈ ప్రమాదంలో మరో 10 మంది తీవ్రంగా గాయపడగా వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా వుంది. కాగా మృతి చెందిన నారాయణ కుమార్తె చిన్నారి స్రవంతి (09) కర్నూలు సర్వేజన వైద్యశాలలో ఐసియులో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతుంది. ఇదిలా వుండగా మృతి చెందిన వారు మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం పోలీసులు ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందు క్షతగాత్రులను కూడా ఆదోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఆదోనిలో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆదోని వచ్చిన ఎమ్ఎల్‌సి కెఇ ప్రభాకర్ ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఆదోని, ఆలూరు నియోజక వర్గాల టిడిపి ఇంఛార్జిలు మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, ఫుడ్ కమిషన్ సభ్యురాలు గుడిసె



కృష్ణమ్మ, ఆర్డీఓ ఓబులేషు, ఆదోని డిఎస్పీ అంకినీడు ప్రసాద్, టిడిపి నాయకులు ఉమాపతినాయుడు తదితరులు ఆసుపత్రి వెళ్లి మృతదేహాలను సందర్శించారు. గాయపడ్డవారిని కూడా పరామర్శించి , కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మృతి చెందడంతో గ్రామానికి చెందిన ప్రజలందరూ ఆసుపత్రి వద్ద వుండగా మృతుల కుటుంబాల వారి రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం దద్దరిల్లిపోయింది. కొత్తపేట యావత్తు స్మశానవాటికగా మారింది. ఇదిలా వుండగా కొత్త సంవత్సరం వేడుకల నుండి ప్రజలు తేరుకోక మునుపే మంగళవారం ఆదోనికి చేరువలోని కోటేకల్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా బుధవారం ఉదయం 7 మంది మృతి చెందడంతో ఆదోని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 24 గంటలు గడువక మునుపే ఆదోని ప్రాంతంలో జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణ చెందడం పట్ల మరికొంత మంది ఆవేదన చెందుతున్నారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



• కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రులు • ఒంగోలు రిమ్స్‌లో ప్లేట్‌లెట్ మిషన్ ఏర్పాటు • 'జన్మభూమి - మా ఊరు'లో మంత్రి శిద్ధా రాఘవరావు

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి శిద్ధారాఘవరావు అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కొండెపి నియోజకవర్గం, ఊళ్లపాలెం గ్రామంలో జన్మభూమి-మా ఊరు 2వ రోజు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి శిద్ధారాఘవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వాసుపత్రులను తీర్చిదిద్దడంతో పాటు, రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య వసతుల పెంపుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రిలో కోటి రూపాయల వ్యయంతో ప్లేట్ లెట్ మిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేలాది రూపాయల ఖర్చయ్యే 64 రకాల వైద్య పరీక్షలను పేదలకు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో లబ్దిదారులకు రేషన్ కార్డులు, పెన్షన్లు, మత్స్యకారులకు వలలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండెపి ఎమ్మెల్యే డి.బి.స్వామి, ఆర్‌వో మల్లికార్జున, పరిశీలకుడు అనిల్ కుమార్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

### దొంగల పార్టీ వైకాపా: మంత్రి అయ్యన్న

**ఆరిలోవ, (విశాఖపట్నం), ప్రభన్యూస్:** వైసీపీ దొంగల పార్టీ అని, జగన్ పాదయాత్రతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు ధ్వజమెత్తారు. జీవీఎంసీ 1వ వార్డు ఆరిలోవ కాలనీలో బుధవారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను సహించలేక, వారు తెదేపాపై బురద జల్లే కార్యక్రమంలో భాగంగా జగన్ పాదయాత్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 లక్షల మంది డ్వాక్రా గ్రూప్ సభ్యులున్నారని, వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల మంది వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు అందుకుంటూ నెలవారీ జీతంగా భావిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, తెదేపా పార్టీ పేద ప్రజల పక్షపాతి అన్నారు.



# ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

• సావిత్రి భాయి పూలే జయంతి వేడుకల్లో మంత్రి గంటా • 86 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయినిలకు అవార్డులు ప్రదానం



**విశాఖపట్నం, ప్రభ న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యా యులు నిష్కల్మషంగా నిర్వర్తించాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు కోరారు. విశాఖలో బుధవారం సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ మహిళా ఉపాధ్యా యినిలకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని విద్యా, విజ్ఞాన కేంద్రంగా తీర్చయిదిద్దాలన్న లక్ష్యంతో విద్యా రంగానికి రూ.23,209 కోట్లు కేటాయించిందని తెలిపారు. టెక్నాలజీని జోడిస్తూ విద్యా రంగంలో పలు సంస్కరణలు తీసుకువస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ 30వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేశామని తెలిపారు. టీచర్ల బాగోగుల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన 86 మందికి రూ.10వేల నగదు, రూ.10 వేలు విలువచేసే ట్యాబ్, బంగారు పతకం, ప్రశం సాపత్రాలను అందజేశారు.

**మొబైల్ యాప్ ఆవిష్కరణ**

ఫిర్యాదుల స్వీకరణ, పాఠశాలల పనితీరును పర్యవేక్షించేందుకు నూతనంగా రూపొందించిన వీక్షణం మొబైల్ యాప్‌ని మంత్రి ఆవిష్కరించారు. కస్తూరిభా విద్యా కేంద్రాల్లో విద్యాభ్యాసంచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యార్థుల విజయగాథలతో కూడిన కస్తూరి పూలు పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎంఎల్‌సి పీవీఎన్ మాధవ్, సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అధ్యక్షురాలు రమాదేవి, జాయింట్ కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్-2 ఎ.సిరి, ఏయూ వీసీ జి.నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి టి.శివరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 'ధార్మిక సంస్థలను కూడా రాజకీయం చేస్తున్న వైకాపా'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయంలో జరిగిన ఘటనపై ఓవైపు ప్రభుత్వ విచారణ కొనసాగుతుండగా, ప్రతిపక్ష వైకాపా నేతలు ధార్మిక సంస్థలను కూడా తమ స్వార్థ రాజకీయానికి వేదిక చేసుకోవాలని ఆరాటపడడం వారి దిగజారుడుతనంగా ఉందని శ్రీకాకుళహస్తి దేవస్థానం మాజీ ఛైర్మన్ పి.ఆర్. మోహన్ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా దాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబానికి ఆపాదిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వైకాపా నేతల నోటికి హద్దు, అదుపూ లేదనీ, నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. చంద్రబాబుపై వైకాపా నేతలు చేసిన వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన వైకాపా వాటిని గాలికి వదిలేసి తప్పుడు మార్గంలో రాజకీయాలు చేస్తోందని మోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రార్థనాలయాలు, ప్రార్థనా గ్రంథాలను రాజకీయ స్వార్థానికి వాడుకున్న చరిత్ర వైకాపాదేనని ఆయన అన్నారు.

### దళితులపై దాడులను టీడీపీ సహించదు: జూపూడి



**ఒంగోలు, ప్రభన్యూస్ బ్యూరో:** దళితులకు భరోసా కల్పించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే తెలుగుదేశం పార్టీ విధానమని, దీనికి భిన్నంగా ఏ సంఘటన జరిగినా తీవ్రంగా ఖండిస్తామని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు పేర్కొన్నారు. మహారాష్ట్రలో భీమా-కోరేగావ్ సంస్మరణ సభలో దళితులపై దాడిని జూపూడి ప్రభాకరరావు తీవ్రంగా ఖండించారు. ఇది బీజేపీ ప్రభుత్వ వైఫల్యం అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో దళితులకు అండ గా తెలుగుదేశం పార్టీ నిలబడుతుందని, దురదృష్టవశాత్తూ ఎక్కడైనా దళితులకు వ్యతిరేకంగా చిన్న సంఘటనలు జరిగినా, వాటిని తెలుగుదేశం మద్దతుతో జరుగుతున్నాయన్న కోణంలో ఎవరూ భావించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం, ఏ నాయకుడూ ఇవ్వని ప్రాధాన్యత చంద్రబాబు దళితులకు ఇస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్నంత మాత్రాన ప్రతి సంఘటననూ సమర్థించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

**జనవరి 26నుండి దళిత బాట**

చంద్రబాబు ఆదేశాల మేరకు జనవరి 26నుండి ఏప్రిల్ 20 వరకు 82రోజుల పాటు దళిత బాట కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులందరూ దళిత పల్లెలకు వెళ్లి అక్కడి సమస్యలు, అభివృద్ధి సమీక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు దళిత నేతలే నాయకత్వం వహిస్తారని, దళితనేతల ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరుగుతుందన్నారు.

### దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు: వైకాపా నేత నాగార్జున



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో దళితులను ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్నచూపు చూడడం వల్లనే దళితులపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఛైర్మన్ మేరుగు నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లా డారు రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు రోజురోజుకు దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు, ప్రకాశం జిల్లా దేవరపల్లిలో జరిగిన సంఘటనలు మరిచిపోకముందే విశాఖజిల్లాలోని జెర్రిపోతుల పాలెంలో దళిత మహిళను ఎమ్మెల్యే బండారు, అతని కుమారుడు ఆదేశాల మేరకు వివస్త్రను చేశారని తెలిపారు. ఈ సంఘటనలో నిస్పక్షపాతంగా వ్యవహరించి నిందితులైన టిడిపికి చెందిన నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడంతో ఏసిపి అర్జున్‌పై కక్షగట్టిన ఎమ్మెల్యే బండారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. నిజానికి నిజాయితీగా పనిచేసిన అధికారి లంకా అర్జున్‌ను మెచ్చుకోవాల్సిందిపోయి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా బదిలీ చేయడం ప్రభుత్వం అరాచకానికి పరాకాష్ట అని తెలిపారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా నేతలు కాలే పుల్లారావు, బూదాల శ్రీనివాసరావు, తోకల శ్యామ్, పనుమాకరవి, సొంగా చందన్, బొడా ప్రేమ్, తుళిమిల్లి సుందర ప్రసాద్, దారా తిరుపాల్, ఎం.ప్రేమలత పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

**అమరావతి, ఆంధ్రప్రభ:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో 5, 6వ తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కారెం శివాజీ బుధవారం తెలియజేశారు. శుక్రవారం రాజమండ్రిలోని నన్నయ్య యూనివర్శిటీ, శనివారం అమలాపురం ఇంజనీరింగ్ కళాశాలనందు ప్రసిద్ధి చెందిన 30 కార్పొరేట్ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ జాబ్‌మేళా ద్వారా దాదాపు రెండు వేల పైచిలుకు ఉద్యోగాలను కల్పించనున్నామని, ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాన్నారు. కనీసం 10వ తరగతి, ఆపైన విద్యా అర్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు మెగా జాబ్‌మేళా ద్వారా అర్హతకు తగిన ఉద్యోగాలను పొందే అవకాశం ఉందని, ముఖ్యంగా మహిళా నిరుద్యోగినులకు ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

### అటవీ శాఖ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన

**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో అటవీ శాఖ వినూత్నంగా ప్రజల్లోకి చొచ్చుకెళుతుందని రాష్ట్ర అటవీశాఖ దళాధిపతి(పీసీసీఎఫ్) పి.మల్లిఖార్జునరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు గ్రామ సభలలో ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. గ్రీనరీని పెంచడానికి గ్రామాలు, వార్డులలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని, అటవీశాఖ వన సురక్ష, వన వికాసం, వన సేవ, వన సంపద అనే నాలుగు పథకాలతో ముందుకెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన వివరించారు.. ఈ పథకాల్లో ఒకటైన వన సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏపీకే మణిహారంగా ఉన్న ఐదు జిల్లాలో అడవులలో విస్తరించి ఉన్న ఎర్రచందనం పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అడవులలో విలువైన పంటలను కాపాడడం, అడవులలో మంటలు చెలరేగకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అటవీ సంపదను కాపాడటానికి ప్రజల సహాయ సహకారాలు తీసుకోవడం వన్యప్రాణుల సంరక్షణకు మరింతగా ఏర్పాట్లు చేయడంతో పాటు వన్యప్రాణుల స్మగ్లింగ్‌ను నివారించడం, అడవులు అన్యాక్రాంతం కాకుండా రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వంటివి ఈ కార్యక్రమంలో చేపడతామన్నారు.

# రాజధాని నిర్మాణానికి నిధులు కేంద్రమే భరించాలి



### ప్రపంచ బ్యాంకు అప్పు వద్దు: సీపీఐ

**అమరావతి, ఆంధ్రప్రభ:** అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు రుణాన్ని మంజూరు చేయిస్తామని కేంద్రమంత్రి అరుణ్ జెట్లీ ప్రకటించడం దారుణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్రం సహకరించాల్సి ఉండగా అప్పులు ఇప్పిస్తామని చెప్పాడం ఒక విధంగా రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా మఖ్యమంత్రి చంద్రబాబు సహా టీడీపి ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే రాజధాని నిర్మాణానికి నిధులు కేంద్రమే బరించేలా ఒత్తిడి పెంచాలని ఆయన సూచించారు. విజయవాడ సీపీఐ పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు నుంచి రూ.3,324 కోట్ల రూణం ఇచ్చే అంశం పరిశీలనలో ఉన్నట్లు రాజ్యసభలో అరుణ్ జెట్లీ ప్రకటించడంతో ఎంపీలు హర్షం వ్యక్తం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇప్పటికే పీకల దాకా అప్పుల్లో కూరుకు పోయిన రాష్ట్రంపై మరింత రుణాభారాన్ని మోపడం ఎంత వరకూ సబబని ఆయన ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు రుణంతో రాజధాని నిర్మాణం చేపడతామని కేంద్రం గతంలో ఎప్పుడూ చెప్పలేదన్నారు. ప్రపంచబ్యాంకు అప్పు ఇస్తుంటే అమరావతి నిర్మాణం పై ప్రత్యేకంగా కేంద్రం బాధ్యతేమిటో , దీనిపై చంద్రబాబు వైఖరేమిటో స్పష్టం కావల్సి ఉందన్నారు. తెలంగాణ ఎంపీలు హైదరాబాద్‌లోనే ఉన్న హైకోర్టు విభజన విషయమై పార్లమెంటులో గొడవ చేస్తే జూన్ 2వ తేదీ నాటికి విభజన చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై అన్యాయం జరుగుతున్నా ఏపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నాలా బిల్లును ఆమోదించలేదని రాద్ధాంతం చేస్తున్న బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు పార్టీ ఫిరాయింపుదార్లపై చర్యల గురించి ఎందుకు నీలదీ యడం లేదన్నారు. నలుగురు ఫిరాయింపుదార్లతో మంత్రు లుగా ప్రమాణం చేయించడంపై గవర్నర్‌ను వెంకయ్య నాయుడు, విష్ణుకుమార్ రాజు ఎందుకు ప్రశ్నించడం లేదో ప్రజలకు స్పష్టం చేయాన్నారు. దుర్గగుడిలో జరిగిన క్షుద్ర పూజలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె నోటీసు



**అమరావతి, ఆంధ్రప్రభ:** కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా రాష్ట్రంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు జనవరి 23న సమ్మె రాష్ట్రా వ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్లు మరియు హెల్పర్స్ యూనియన్ నాయకులు స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమీషనర్‌కు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. కనీస వేతనం, ఐసిడిఎస్‌కు నిధుల పెంపు, పెన్షన్ తదితర సమస్యల పరిష్కారానికి కేంద్ర కార్మిక సంఘాలు సమ్మె చేస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. తమ సమస్యలైన కనీస వేతనం అమలు, అంగన్ వాడీ సెంటర్లను పంచాయితీలకు అనుసంధానం చేయరాదని, పెండింగ్ నిధులు విడుదల చేయాలని, స్కీమ్ వర్కర్లను వర్కర్లుగా గుర్తించాలని, కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించాలని, ఐసీడీఎస్‌లో నగదు బదిలీ, వ్యాకేజ్ ఫుడ్ సరఫరాను నిలుపుదల చేయాలి వంటి పలు డిమాండ్ల సాధన కోసం తమ ఈ సమ్మెలో పాల్గొంటున్నట్లు స్పష్టం చేశారు. కమీషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ప్రధాన కార్యదర్శి జె.లలిత, సీఐటియు, ఏఐటియుసి నాయకులు ఉన్నారు.

**మున్సిపల్ కార్మికుల సమ్మె కాలానికి వేతనం చెల్లించండి**

మున్సిపల్ కార్మికులు గత నెల 18 నుండి 22 వరకు చేసిన సమ్మె కాలాన్ని రెగ్యులరైజ్ చేసి జీతాలు చెల్లించాలని కొరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ మరియు వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్‌ను కోరింది. ఈ మేరకు ఒక వినతి పత్రన్ని ఆయనకు బుధవారం యూనియన్ నాయకులు అందజేశారు. సమ్మె సందర్భంగా నిలిచిపోయిన వ్యర్థాలను కార్మికులు అదనపు గంటలు పనిచేసి కార్మికులు తొలగించడం జరిగిందని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.

# కృష్ణయ్య తీరు సరికాదు

### రాష్ట్ర విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పోలాకి



**విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో:** రాష్ట్ర విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులను తొలగించే అధికారం, అర్హత ఆర్.కృష్ణయ్యకు లేదని ఆంధ్రప్రదేశ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు తేల్చి చెప్పారు. ఈ వ్యవహారంలో కృష్ణయ్య వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పోలాకి ధ్వజమెత్తారు. బుధవారం ఇక్కడ డాబాగార్డెన్స్ వీజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలాకి మాట్లాడుతూ తాజాగా జరిగిన సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలోనే తెలుగు రాష్ట్రాలకు గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్న కృష్ణయ్యను ఏపిలో తొలగించి ఆ స్థానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని నియమించుకోవాలని తాము తీర్మానించడం జరిగిందన్నారు. తాము తెలంగాణ శాసనసభ్యుడుగా ఉన్న కృష్ణయ్యను ఇక్కడ గౌరవ అధ్యక్షులుగా కొనసాగించడం వల్ల ప్రభుత్వపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అందువల్లే ఏపికి చెందిన వ్యక్తిని గౌరవ అధ్యక్షులుగా నియమించుకోవాలని భావిస్తున్నామన్నారు. గౌరవ అధ్యక్షులుగా ఉన్న ఆయన అధ్యక్షుడిగా ఉన్న తమను, సంఘం కార్యదర్శిని ఏ హోదాలో తొలగిస్తారో ఆయనకే తెలియాలన్నారు. ఏపిలో కాపులను బీసీల్లో చేర్చే విషయంలో తాము మద్దతు తెలియజేస్తున్నామనే అపోహతో ఆయనను తొలగించామనడం ఈ సమావేశంలో ఏపిఈపీడీసీఎల్ బిసి సంఘం అధ్యక్షులు కె.సాయిబాబా, ఏపిట్రాన్స్‌కో అధ్యక్షులు జె.కృష్ణమూర్తి ఏపి ట్రాన్స్‌కో అసిస్టెంట్ జాయింట్ సెక్రటరీ కె.అప్పారావు, ట్రెజరీ కె.శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ కె.శంకరావు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దుకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

### ఏపీ జేఏసీ కన్వీనర్ అశోక్‌బాబు

**అమరావతి, ఆంధ్రప్రభ:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నట్లు ఏపీ జేఏసీ కన్వీనర్ పి.అశోక్‌బాబు వెల్లడించారు. ఈ విషయమై బుధవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి సీఎస్ దినేష్‌కుమార్‌తో కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సీపీఎస్ విధానం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని ఇటీవల విజయవాడలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో తీర్మానించి, పెన్షన్ సాధనా సమితి పేరుతో ఆందోళన చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు మద్ధతు తెలిపారన్నారు. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది, రాష్ట్రంలో 1.86 లక్షల మంది ఉద్యోగులు సీపీఎస్‌తో ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 9న రాష్ట్రలోని అన్ని మండలాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు అశోక్‌బాబు చెప్పారు. అలాగే ఫిబ్రవరి 10న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# తెలుగు భాషపై ప్రకటన ప్రశంసనీయం

• చంద్రబాబుకు అభినందనలు • అమలుపై చిత్తశుద్ధి ఆశిస్తున్నాం • జన్మభూమిలో భాగంగా అమలు చేస్తే మంచిది: పద్మశ్రీ యార్లగడ్డ



**విశాఖపట్నం, ప్రభ న్యూస్:** తెలుగు భాషా సంవ త్సరంగా 2018ని పాటిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సర్వదా అభినందనీయులని లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖపట్నం లోని ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో జరిగిన పుస్తక కార్యక్రమంలో భాగంగా భారత ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ప్రసంగంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు భాష కోసం చేసిన ప్రకటన ప్రశంసనీయం అన్నారు. తన ప్రకటన ద్వారా తెలుగు భాషా, సంస్కృతిల పట్ల ఉన్న అపారమైన గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారని కొనియాడారు. అయితే, ఈ బాధ్యతను వేరే ఇంకెవ్వరికీ బదలాయించకుండా, స్వయం గా చంద్రబాబు నాయుడు వహిస్తేనే చిత్తశుద్ధితో అమలు సాధ్యం అవుతుందని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ సూచించారు. అలాగే, తెలుగు నూరు శాతం అమలుకు సంబంధించి తీసుకునే నిర్ణయాలు కూడా సహేతుకంగా ఉండి, ప్రత్యేక దృష్టి సారించడం వల్ల మాత్రమే సిద్ధిస్తుం దన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంలో కూడా తెలుగు భాష అమలు అంశాన్ని చేర్చి, ఇప్పటి నుంచే భాష అమలుకు ప్రయత్నం ప్రారంభం కావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని రాతపోతలన్నీ విధిగా తెలుగు భాషలోనే జరిగేలా ప్రభుత్వమే ప్రారంభించాలన్నారు. చంద్రబాబు నాయుడుకు తెలుగు భాషా సంస్కృతిల పట్ల ఉన్న ప్రత్యేక ఆపేక్ష ఇక నుంచీ కార్యరూపంలో వ్యక్తం కాగలదని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ భావించారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు నిర్వహించే వీడియో కాన్ఫరెన్సుల్లోనూ తెలుగు భాష అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలు పూర్తిగా భావోద్వేగపూరితమైనవని చెబుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పాలన ప్రారంభించి మూడున్నరేళ్ల కాలం అవుతున్నా తెలుగు విశ్వ విద్యాలయం అంశం ప్రగతిని సాధించలేకపోయిందన్నారు. తెలుగు విశ్వ విద్యాలయంకు సంబంధించిన 18 కోర్సుల్లో కేవలం మూడు మాత్రమే ఆ భాష అమలు, పరిశోధకులూ, అభిలాష పరులకు అందు బాటులో ఉన్నాయన్నారు. మిగిలినవన్నీ తెలంగాణ రాష్ట్రం లోనే ఉండిపోవడంతో ఇక్కడి వారు పడుతున్న ఇక్కట్లను ప్రభుత్వం గుర్తించి న్యాయం చెయ్యాలని ఆయన ఆశించారు. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వంటివి ఆంధ్రలో ప్రారం భించినట్లే తెలుగు విశ్వ విద్యాలయ పూర్తి స్థాయి ఏర్పాటు కూడా జరగాలని ఆయన పట్టుబట్టారు. మైసూరులోని తెలుగు సంస్థను మాకివ్వాలంటూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోటీ పడుతున్నారని, అయితే, ఆ సంస్థ ద్వారా వచ్చే ఫలితాల్ని రెండు తెలుగు రాష్ట్రాలకూ పంచడం మేలైన పరిష్కారం అన్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఔన్నత్యం వెనుక ఉన్న ప్రాభవంను కూడా ఆంగ్లభాష ప్రాకులాటలో దూరం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గుర్తు చేశారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి వంటి వారు ఆంధ్ర విశ్వ కళాపరిషత్‌ను సందర్శించి, ప్రారంభించిన మైలు రాళ్లకూ ఆంగ్లలోనే శిలాఫలకాలను తయారు చేసి ప్రారంభింపజేయడం విచారకరం అన్నారు. తాము ఆంగ్లంకు వ్యతిరేకం కాదని, ఆ భాషతో పాటూ తెలుగు భాషనూ పేర్కొనడం తప్పా? అని ఆయన ప్రశ్నించారు. తెలుగు భాషకు సముచిత స్థానం, గౌరవం బోధనా విశ్వ విద్యాలయంలోనే లేకుండా చేస్తే, అంతకంటే ఘోరం ఇంకెక్కడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రవిశ్వ కళాపరిషత్ నిర్వహణ అధి యంత్రాంగం తెలుగు భాషను నిర్లక్ష్యం చేయకుండా భాష సత్వర, సక్రమ అమలుకు మార్గదర్శకంగా ఉండగలరని ఆయన ఆశించారు.

### సాంస్కృతిక పోటీలకు స్పందన భేష్: మీనా

**అమరావతి, ఆంధ్రప్రభ:** జన్మభూమి కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని పర్యాటక శాఖ నిర్వహిస్తున్న సాంస్కృతిక పోటీలకు మంచి స్పందన వస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖా కార్యదర్శి ఎం.కే.మీనా తెలిపారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ సహకారంతో సంగీత, నృత్యం, ముకాభినయం, కథలు చెప్పడం, పద్యాలు, శ్లోకాల పఠనం, చర్చ, వ్యాసరచన, పాటల రచన, కథా రచన, నినాదాల కూర్పు, కవిత్వం, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు దశల్లో నిర్వహించనున్న ఈ పోటీలకు విద్యార్థులు, యువత నుంచి స్పందన బాగుందన్నారు. మూడు కేటగిరీల్లో మూడు దశల్లో పోటీలు ఉంటాయన్నారు. తొలి దశలో గ్రామ, వార్డు స్థాయిలోను, రెండో దశలో జిల్లా స్థాయి, మూడో దశలో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని,11వ తేదీన ముగియ నున్న ఈ పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలకు ఉగాది రోజున ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం ఉంటుందన్నారు.

### విభజన హామీలపై
# కొత్త డీజీపీ దృష్టి!

●కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు ●రేపటి డీజీపీల సమావేశంలో ప్రధానికి వివరించేందుకు యత్నం ●నేడు గవర్నర్‌తో మర్యాద పూర్వక భేటీ



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్ పోలీసు బలోపేతానికి విభజన చట్టంలో ఇచ్చిన హామీల సాధనకు నూతన డీజీపీ డాక్టర్ మన్నం మాలకొండయ్య దృష్టిసారించారు. రాష్ట్రంలో పోలీసు బలోపేతానికి ఇస్తానన్న నిధులు, వ్యవస్థల బలోపేతానికి కేంద్ర సహకారం వంటి సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో మధ్యప్రదేశ్‌లో జరగనున్న అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశంలో పాల్గొనేందుకు బయలుదేరిన మాలకొండయ్య వీటిపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇందులో భాగంగా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఇంటిలిజెన్స్ చీఫ్ ఎ.బి.వెంకటేశ్వరరావు, సిఐడీ చీఫ్ సిహెచ్.ద్వారకా తిరుమలరావు, గ్రేహౌండ్స్ అధిపతి ఎన్.వి.సురేంద్ర బాబు, శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ హరిష్ గుప్తా తదితర అధికారులతో ఆయన సమావేశమై ఆయా అంశాలను సమీక్షించారు. రాష్ట్ర విభజన చట్టంలో గ్రేహౌండ్స్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చింది. మూడేళ్ల పాటు హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ యూనిట్‌ను వినియోగించుకోవచ్చని చెప్తూ ఈలోగా కేంద్రం తగిన ఆర్థిక సాయంతో ఆ యూనిట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కేంద్రం పేర్కొంది. ఇప్పటి వరకు ఆ దిశగా కేంద్రం నుంచి ఏ విధమైన సహకారం లేకపోవడంతో విశాఖపట్టణంలో తాత్కాలిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. ముంబై దాడుల నేపథ్యంలో రాష్ట్ర మెరైన్ పోలీసు విభాగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రత్యేక హెలికాప్టర్లు కేటాయించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. రాష్ట్రానికి ప్రత్యేకంగా గెరిల్లా వార్ జోన్‌కు ప్రధాన నరేంద్ర మోదీ గత డీజీపీ నండూరి సాంబశివరావుకు ఇచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని మోదీ విశాఖలో దీనిని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రధాని హామీ ఇచ్చి ఏడాదికి పైగా గడిచినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఏ విధమైన సాయం రాలేదు. పోలీసు శాఖ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కూడా విభజన చట్టంలో స్పష్టమైన హామీలు ఉన్నప్పటికీ నెరవేరలేదు. వీటిని వీలైనంత తొందరగా సాధించేందుకు డీజీపీ మాలకొండయ్య దృష్టిసారించి నివేదిక తయారు చేశారు. మధ్యప్రదేశ్‌లో రెండు రోజుల పాటు జరిగే డీజీపీల సమావేశంలో వీటిని వారికి అందజేయనున్నారు.

**నేడు గవర్నరుతో భేటీ**

ఉమ్మడి రాష్ట్రాల గవర్నరు నరసింహన్‌ను గురువారం డీజీపీ మాలకొండయ్య కలవనున్నారు. గత నెల 31న రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి రాష్ట్రంలో శాంతి భద్రతలపై వివరించనున్నారు. అక్కడి నుంచి శుక్ర, శనివారాల్లో మధ్యప్రదేశ్‌లో జరిగే డీజీపీల సమావేశంలో పాల్గొనేందుకు ఆయన వెళ్లనున్నారు.

### రాజధాని బాహ్యవలయ రహదారిలో
# పారిశ్రామిక వాడలు

●అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దృష్టిలో ఉంచుకొని భూసేకరణ ●రూ.17,761 కోట్లతో 189 కి.మీ. మేర బాహ్యవలయ రహదారి ●ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే రాయలసీమకు దగ్గరగా రాజధాని ●రాష్ట్ర అభివృద్ధిలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కీలకం ●ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రమాణాలతో కృష్ణా నదిపై వారధులు ●ఐకానిక్ వారధుల నగరంగా అమరావతి వర్ధిల్లాలి: సీఆర్‌డీఏ సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాజధాని బాహ్య వలయ రహదారి మార్గంలో రెండు, మూడు ఇండస్ట్రియల్ టౌన్‌షిప్పుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి విజయవాడ క్యాంపు కార్యాలయంలో సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో అమరావతిలో చేపట్టిన వివిధ రహదారి ప్రాజెక్టుల పనుల పురోగతిని సమీక్షించారు. ఈసమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండే ప్రదేశాలలో, నీటి వనరులు పుష్కలంగా ఉన్న చోట్ల ఈటౌన్‌షిప్పులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇండస్ట్రియల్ జోన్ల ఏర్పాటు ద్వారా ఆప్రాంతం వాణిజ్యపరంగా త్వరత్వరగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై 30రోజుల లోపు ప్రతిపాదనలు అందిచాలని ఆదేశించారు. బాహ్య, అంతర్ వలయ రహదారులలో త్వరగా అభివృద్ధి ఎలా జరపాల అనే అంశంపై ఇప్పటినుంచే తగిన వ్యూహ ప్రణబూళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం చెప్పారు. అమరావతి- అనంతపురం ఎక్స్ ప్రెస్ హైవే మార్గంలో కూడా పలు జిల్లాల పరిధిలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్పులు ఏర్పాటు చేయాలని, తమ ప్రాంతం అభివృద్ధి చెందుతోందంటే సంబంధిత భూముల యజమానులు భూసమీకరణకు ముందుకు వస్తారని అన్నారు.

మూడు, నాలుగు సంవత్సరాల్లో ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయ విమానాశ్రమం అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే భూసమీకరణకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. గుంటూరు, కృష్ణా జిల్లాలోని మొత్తం 30గ్రామాల మీదుగా సాగే అమరావతి అంతర్ వలయ రహదారిని మొదటి విడతగా 97.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నట్టు అధికారులు ఈసమావేశంలో సీఎంకు వివరించారు. ఇందులో తాడికొండ, రావెల తదితర 5గ్రామాల రైతాంగం భూసమీకరణ విధానంలో తమ భూములను అందిచేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈగ్రామాలతో పాటు బాహ్య, అంతర వలయ రహదారుల పరిధిలోని ఇతర గ్రామాలలో కూడా భూసమీకరణకు ప్రతిపాదనలు తయారు చేసుకోవాలని ఈసందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. హైబ్రిడ్ నమూనాలో ఈప్రాజెక్టును చేపట్టాలని అధికారులను కోరారు.

బాహ్యవలయ రహదారి మొత్తం 189 కిలోమీటర్ల మేర నిర్మితం కానున్నదని, ఎన్‌హెచ్‌ఏఐ దీనికి అవసరమైన అనుమతులు మంజూరు చేసిందని అధికారులు చెప్పారు. మొత్తం రూ.17,761కోట్ల వ్యయం అంచనాతో ఈప్రాజెక్టును చేపడుతున్నట్టు వివరించారు. 150 మీటర్లు వెడల్పుతో ఆరు లైన్ల రహదారిగా ఇది ఏర్పాటవుతుందని తెలిపారు. దీనికోసం మొత్తం 3,404 హెక్టార్ల మేర భూమి అవసరం పడుతుందని చెప్పారు. రెండు జిల్లాలలో కలపి 87 గ్రామాలలో ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను కలుపుకుంటూ బాహ్య వలయ రహదారి ఏర్పాటు కానున్నదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

అమరావతి-అనంతపురం ఎక్స్ ప్రెస్ రహదారి పూర్తయితే 13జిల్లాల మధ్య ప్రయాణ భారం తగ్గిపోతుందని, ముఖ్యంగా రాయలసీమ రాజధానికి బాగా దగ్గర అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. 200మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఈరహదారి సమాంతరంగా రైల్వే లైను కూడా రానుండటంతో దారిపొడువునా వున్న జిల్లాలలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు. ఎక్స్ ప్రెస్ రహదారికి భూసేకరణ నిమిత్తం ఈబడ్జెట్ తొలి త్రైమాసికంలోనే రూ.2500కోట్లు కేటాయించాలని అధికారులు సీఎంని కోరారు. కడప, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలమీదుగా సాగే 393.6కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే రాష్ట్ర అభివృద్ధిలో కీలకం కానున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ప్రపంచశ్రేణి ప్రమాణాలతో నిర్మాంచాలనిస ఈరహదారి రాష్ట్రంలో ముఖ్యమైన ఇండస్ట్రియల్ కారిడార్ అవుతుందన్నారు.

అనంతపురం జిల్లా పరిధిలో 75కిలో మీటర్లనిర్మించే నాలుగు వరసల రహదారి పెగ్ మార్కింగ్, ఫీల్డ్ మెజర్ మెంట్ తీసుకోవడం పూర్తయిందని అధికారులు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో నిర్మించే 4లైన్ల రహదారికి సంబంధించి 80.8 కి.మీ మేర ప్రతిపాధిత రహదారిలో అటవీ ప్రాంతం మినహా 67.25 కి.మీ మేర పెగ్ మార్కింగ్ , ఫీల్డు మెజర్ మెంట్ పూర్తిచేశారు. ప్రకాశం జిల్లాలో నిర్మించే 6వరసల రహదారికి 146.5 కి.మీ పరిధిలో పెగ్ మార్కింగ్‌నూరు శాతం, ఫీల్డ్ మెజర్‌మెంట్ 85శాతం పూర్తయిందన్నారు. గుంటూరు జిల్లాలో ఆరు వరసల రహదారికి సంబంధించి 91.2 కి.మీ మేర పనులలో 42శాతం పెగ్ మార్కింగ్, 24శాతం ఫీల్డు మెజర్ మెంట్ పనులు పూర్తిచేశామన్నారు.

కృష్ణా నిదిపై నిర్మించబోయే వారధుల కోసం ప్రపంచంలోని అత్యుత్తమ నిర్మాణాలను పరిశీలించాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఐకానిక్ వారధులతో కూడిన నగరంగా అమరావతి భాసిల్లాలని సీఎం అభిలషించారు. ఈఏడాది మార్చి 31నాటికి పూర్తిచేయ్యాల్సిన కనకదుర్గమ్మ పైవ్లోర్ నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. సమావేశంలో పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ, రవాణా, రహదారుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేటా, సీఆర్‌డీఏ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారధి పాల్గొన్నారు.



## తిరుమలలో వైభవంగా ప్రణయ కలహోత్సవం

**తిరుమల, ప్రభ న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ప్రణయ కలహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరోరోజు, అధ్యయనోత్సవంలో 17 వ రోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు పల్లకి ఎక్కి మహా ప్రదక్షిణ మార్గంలో స్వామివారి పుష్కరిణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరొక పల్లకి పై ప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జియంగార్లు పూలచెండ్లతో వేటకు వెళ్ళి వచ్చిన స్వామివారిని మూడుసార్లు తాకించారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయ పడతారు. ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వారు రచించిన ఆళ్వార్ దివ్యప్రబంధంలోని పాశురాలను నిందాస్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకత. ఈ సందర్భంగా ఆలయంలో వసంతోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, ఆలయ డిప్యూటీ ఈవో కోదండరామారావు, పేష్కార్ రమేష్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి న్యూజిలాండ్‌తో
## అండర్-15 జట్ల క్రికెట్ పోటీలు



**ఎస్కేయూ, ప్రభ న్యూస్ :** నేటి నుంచి అనంతపురంజిల్లాలో న్యూజిల్యాండ్ కు చెందిన హాట్ హాక్స్ అండర్-15 జట్లతో జిల్లాకు చెందిన క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో ఢీకొట్టనున్నారు. నేటి నుంచి 11వ తేదీ వరకు జిల్లాలోని అనంత క్రీడా గ్రామంలో క్రికెట్ పోటీల్లో పాల్గొంటారు.

**అనంతపురం నగరానికి చేరుకున్న జట్లు..**

పోటీల్లో పాల్గొంటున్న అండర్ 15 వెల్లింగటన్, జట్టు క్రీడాకారులు 15 మంది, కోచ్‌లు, తల్లిదండ్రులు మొత్తం 37 మంది పర్యాటకులు నగరానికి చేరుకుని ఆర్డీటిలో బస చేశారు. తొలి రోజు రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రాక్టీస్ అనంతరం ఆర్డీటి కార్యాలయం, ఆర్డీటి స్కూల్‌ను సందర్శించారు. ప్రారంభ పోటీలను ఆర్డీటి ప్రొగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించనున్నారు.

### అండర్-14 ఆంధ్రా జట్టుకు జిల్లా క్రీడాకారులు
## కెప్టెన్‌గా అర్జున్ టెండుల్కర్



**ఎస్కేయూ, ప్రభ న్యూస్:** కేరళలో జరగనున్న బీసీసీఐ దక్షిణ భారత అండర్ 14 అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా అండర్ 14 జట్టుకు కెప్టెన్‌గా అర్జున్ టెండుల్కర్ ఎంపికయ్యాడు. జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన అర్జున్ టెండుల్కర్, మల్లికార్జునలు ఎంపికయ్యారని అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కేఎస్ షహబుద్దీన్ తెలిపారు. అర్జున్ టెండుల్కర్ జట్టులో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా అంతర్ జిల్లా పోటీల్లో రాణించి, రాష్ట్ర ప్రాబబుల్స్‌లో రాణించి జట్టులో నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. గతేడాది కూడా అర్జన్ టెండుల్కర్ జట్టులో స్థానం సంపాదించాడు. మరో క్రీడాకారుడు మల్లికార్జున్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో రాణించి 28 వికెట్లు తీసి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలంకు చెందిన మల్లికార్జున తొలిసారి ఆంధ్రా జట్టులో స్థానం సాధించాడు. వీరు ఇద్దరు అంతర్ రాష్ట్ర పోటీల్లో రాణించాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు మాంఛో ఫెర్రర్, కార్యదర్శి కేఎస్ షాహబుద్దీన్, ఇతర సభ్యులు అభిలాషించారు.

# క్రీడలకు తగిన ప్రాధాన్యం

●సౌత్‌జోన్ అంతర్ వర్శిటీల క్రికెట్ టోర్నీ ప్రారంభించిన మంత్రి గంటా
●రంజీ ప్లేయర్ పృధ్వికి ఘన సత్కారం
●ఐదు రాష్ట్రాల నుంచి 98 యూనివర్శిటీ జట్లు రాక

**విశాఖ స్పోర్ట్స్, ప్రభన్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం రఘు ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, పాఠశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ లో పాఠ్యాంశ ఏర్పాటు చేసిన ఘనత ప్రభుత్వానిదేనన్నారు. క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. స్పోర్ట్స్ పాలసీ ఏర్పాటు చేసామని, బ్యాడ్మింటెన్ క్రీడాకారిణి ఒలింపిక్‌లో పతకం తేవడం వలన సీఎం చంద్రబాబునాయుడు స్వాగతం పలికారన్నారు. విశాఖలో అగనంపూడి వద్ద 150 ఎకరాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మధురవాడలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేయడం వలన విశాఖలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహణకు ఎంతో అవకాశం ఏర్పడిందన్నారు. క్రీడల నిర్వహణకు ముందుకు వచ్చిన రఘు కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.



రంజీ ప్లేయర్ పృధ్వికి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న మంత్రి గంటా

అనంతరం రఘు కళాశాలలో చదువుతూ రంజీ జట్టు స్థానం సాధించిన వై. పృధ్వీరాజుకు రూ. 20 వేలు నగదు పురస్కారంతోపాటు క్రికెట్ క్రీడాకారుడు తల్లిదండ్రులు యర్రా శ్రీనువాసు, క్రిష్ణకుమారిలను అభినందించారు. ఏయూ వీసీ ఆచార్య జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల నుంచి 98 క్రికెట్ జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈనెల 12 వ తేదీ వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. జేఎన్‌టీయు కాకినాడ విశ్వవిద్యాయం ఉపకులపతి ఆచార్య వి.వి.ఎస్ కుమార్ మాట్లాడుతూ దూరదృష్టితో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామంగా తెలిపారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత ఏయూ సౌత్ జోన్ బాలుర క్రికెట్ పోటీలు ఆతిథ్యం ఇస్తుందన్నారు. రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ జెఎన్‌టియు క్రికెట్ జట్టులో తమ కళాశాలకు చెందిన 7 గురు విద్యార్థులు యూనివర్శిటి జట్టులోను, రంజీ జట్టులో ఇద్దరు స్థానం పొందారన్నారు. సౌత్ ఇండియా యూనివర్శిటీ పోటీలు నిర్వహణకు ఆతిథ్యం ఇచ్చిన యూనివర్శిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏయూ క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎన్. విజయమోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లవి, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ కబడ్డీ కోచ్ ఎం. ఉమాశంకర్‌బాబు, సీనియర్ స్పోర్ట్స్ రిపోర్టర్ జి నర్శింహారావులను ఘనంగా సత్కరించారు.

# భూమిలోనే సహజసిద్ధంగా ఎరువులు

### నాగలితోనే నేలను దున్నాలి : పద్మశ్రీ సుభాష్ పాలేకర్



**అమరావతి, ఆంధ్రప్రభ:** భూమిలోనే సహజసిద్ధంగా ఎరువు లను భగవంతుడు సృష్టించాడని, భూమి పొరల్లోకి వెళ్లేకొద్ది పోషకాల స్థాయి పెరుగుతూనే ఉంటుందని ప్రకృతి సేద్య పితామహుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ పేర్కొన్నాడు. గత నాలుగు రోజులుగా ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా గల బైబిల్ మిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. తాను చదువుకునే సమయంలో అడవులు, పర్యావరణంపై అధ్యయనం చేసే సమయంలో ప్రకృతి సేద్యంపై అవగాహన కలిగిందన్నారు. అడవుల్లో మానవ ప్రమేయం లేకుండా చెట్లు అద్భుతంగా పెరిగి రుచికరమైన, ఆరోగ్యకరమైన ఫలాలను అందిస్తున్నాయని చెప్పారు. దీని కారణం నేలలోని సహజసిద్దమైన ఎరువులను అవి ఉపయోగించు కుంటున్నాయని, అదే తనలో ప్రకృతి సేద్యం రూపకల్పనకు జిజ్ఞాసను పెంచిందని తెలిపారు. రైతులకు కావాల్సింది విజ్ఞానమేగానీ విషయ సేకరణ కాదన్నారు. ప్రకృతిలో ఉండే జ్ఞానం, విజ్ఞానమే సత్యమని, రసాయనిక సేద్యంలో ఉండేది అసత్యం, అజ్ఞానం అని వివరించారు. ఆహార చక్రములో భాగంగా ఏ పదార్థం ఎక్కడ నుంచి వచ్చిందో ఆ పదార్థం తిరిగి అక్కడికే వెళ్లడం అనేది ప్రకృతి ధర్మమని తెలిపారు. ప్రకృతి సమతుల్యత కోసం ఇది చాలా అవసరమని, దీనిలో కర్బన చక్రము, నత్రజని చక్రము, నీటి చక్రము, శక్తి చక్రము, పోషణ చక్రములు ఉంటాయని అన్నారు.

**ట్రాక్టర్ దుక్కితో దెబ్బతింటున్న నేల పోషకాలు..**

ఆచ్ఛాదన భూమాతకు చీరవంటిదని, నేలతల్లి సమతుల్యతకు పైపొరలను పోషకాలతో నింపడానికి ఆచ్ఛాదన తప్పనిసరి అని వివరించారు. ఈ ఆచ్ఛాదనలు మట్టి, కాష్ట, సంజీవ ఆచ్ఛాదనలని మూడు రకాలుగా ఉంటుందని, నేలను గోరుతోగానీ, నాగలితోగానీ దున్నడం ఎంతో శ్రేష్ఠమైనదన్నారు. దుక్కికి ట్రాక్టర్లను వాడటం వలన భూ భౌతిక వ్యవస్థ విచ్ఛిన్నమైపోతుందని, దీనితో పంటల ఎదుగుదలకు ముఖ్యకారకమైన జీవన ద్రవ్యం తయారు కాదన్నారు. ట్రాక్టర్ నేలను 9 అంగుళాలు దున్నితే, వానపాము 15 అడుగుల వరకు దున్నతుందని, దీని వలన సహజసిద్ధంగా ఉన్న నేల పోషకాలు దెబ్బతినడం జరుగుతోందన్నారు. దీనితో రైతులు తప్పని సరిగా రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడాల్సి వస్తుందని, తద్వారా పంటలు విషతుల్యంగా మారుతున్నాయని వివరించారు. వ్యవసాయ ఆధారితమైన మన దేశంలో పాశ్చాత్య పోకడలను వీడి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ తరహా సేద్యంతో ప్రకృతి విపత్తులను కూడా తట్టుకునే శక్తి పంటలకు వస్తుందన్నారు. పెట్టుబడిలేని ప్రకృతి సేద్యం ద్వారా రైతులు అధిక దిగుబడులతోపాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలను ప్రజలకు అందించవచ్చని ఆయన తెలిపారు.

**ప్రకృతి సేద్య పంటలతో సంపూర్ణ ఆరోగ్యం : కమిషనర్ హరి జవహర్‌లాల్**



ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆహారపు పంటలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరి జవహర్‌లాల్ తెలియజేశారు. అమరావతి కేంద్రంగా రాష్ట్రరైతాంగానికి ప్రకృతి వ్యవసాయంపై ఇస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ మన పెద్దలు సహజసిద్ధంగా పండించిన చిరుధాన్యాలతో తయారు చేసే ఆహార పదార్థాలను తీసుకోవడం వలన వంద సంవత్సరాలకు పైగా ఆరోగ్యంగా జీవించేవారని గుర్తు చేశారు. వైద్యుడిగా పనిచేసిన కాలంలో అతి చిన్నవయసులోనే మధుమేహం, రక్తపోటు, గుండెపోటు తదితర ప్రాణాంతక వ్యాధులబారిన పడిన వారిని చూసానన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగల మందులు వాడటం జరగదని, తద్వారా నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంట దిగుబడులు వస్తాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు విజయ్ కుమార్ పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించిన ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రాష్ట్రంలో దశల వారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి సేద్య పితామహుడు సుభాష్ పాలేకర్ నేతృత్వంతో ఇస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని పెట్టుబడిలేని ప్రకృతి సేద్యం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి


### ప్రొఫెసర్ వి.వెంకటరామన్

**అమరావతి, ఆంధ్రప్రభ :** విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలు, అంశాలపై దృష్టిసారించాలని, కోర్ బ్రాంచ్‌ల్లో చేరినా కొత్త టెక్నాలజీల గురించి తెలుసుకునే ప్రయత్నం చేయాలని అమెరికా ప్రఖ్యాత విశ్వవిద్యాలయం రోచెస్టర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వి. వెంకటరామన్ అన్నారు. అమరావతిలో అత్యున్నత ప్రమాణాలతో నెలకొల్పిన వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏపీ తమ విద్యార్థులకు అంతర్జాతీయ విద్య అందించేందుకు న్యూయార్క్ లోని ప్రసిద్ధ యూనివర్సిటీ రోచెస్టర్ యూనివర్శిటీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా విట్ ఏపీలోని విద్యార్థులకు ప్రొఫెసర్లకు అక్కడి యూనివర్సిటీలలో అమలవుతున్న విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఆధునిక నైపుణ్యాలను అందిపుచ్చుకోకపోతే పరిశ్రమలు గుర్తించవని విద్యార్థులకు సూచించారు. విట్ ఏపీ, రోచెస్టర్ యూనివర్సిటీ ఒప్పందంలో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులు రెండు సంవత్సరాలు ఇక్కడ రెండు సంవత్సరాలు న్యూయార్క్‌లోని తమ యూనివర్సిటీలలో చదువుకోవచ్చని ప్రొఫెసర్ వెంకటరామన్ చెప్పారు. విట్ ఏపీ అంతర్జాతీయ కరిక్యులం అందిస్తున్నందున తమ యూనివర్సిటీలో చదువుకోవడానికి ఎటువంటి ఆటంకం లేదని, అలాగే ప్రొఫెసర్లు కూడా తమ పరిశోధనలు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. విట్ ఏపీ ఆర్ఐటీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ఆర్ఐటి బృందం విట్ ఏపీ సందర్శనకు వచ్చారని ఈ సందర్శనలో భాగంగా అమెరికాలో అందుతున్న విద్యా అవకాశాలు, పరిశోధన, కరిక్యులం, స్టూడెంట్ ఎక్స్‌చేంజ్ లాంటి అంశాలు చర్చించేందుకు అక్కడి యూనివర్సిటీ బృందం వచ్చినట్లు విట్ ఏపీ రిజిస్ట్రార్ సీఎల్వి శివకుమార్ చెప్పారు. ఈ సమావేశంలో విట్ ఏపి వైస్ చాన్సలర్ శుభాకర్, రోచెస్టర్ యూనివర్సిటీ డాక్టర్ జయంతి వెంకటరామన్ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఖాకీల కీచకపర్వం

●మొన్న దాసరి, నేడు బెండు
●కేసుల కోసం వచ్చే మహిళలపై వేధింపులు
●లొంగదీసుకునేందుకు బెదిరింపులు
●త్రీటౌన్ సీఐపై సీపీకి ఫిర్యాదు ●వేధింపుల కేసులో సీఐ బెండు వెంకట్రావ్ సస్పెన్షన్

**విశాఖక్రైం, ప్రభన్యూస్:** ఆయా కేసుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల పట్ల పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. నయానో, భయానో వారిని తమ దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. లొంగకపోతే కేసుల పేరిట స్టేషన్ చుట్టూ తిప్పించుకుని నరకం చూపిస్తున్నారు. ప్రస్తుతం విశాఖలో పోలీసు అధికారుల తీరు ఈ విధంగా ఉంది. మొన్న డిఎస్పీ రవిబాబు కూడా ఇదే తరహాలో కాకర్ల పద్మ లతను లోబర్చుకుని చివరకు ఆమెను అంతమొందించాడు. ఇప్పుడు ఇదే తరహాలో నగరంలో మరో పోలీసు అధికారి ఒక మహిళను లోబర్చుకునేందుకు ప్రయత్నించాడు. నగరంలోని త్రీటౌన్ సిఐ బెండు వెంకటరావు దాసరి రవిబాబుని మించిపోయాడు. పలువురు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఇప్పటికే పలు ఆరోపణలు మూటగట్టుకున్న సిఐ బెండు వెంకటరావు మహిళా వేధిపుల కేసులో అడ్డంగా బుక్కాయిపోయాడు. ఒక కేసు నిమిత్తం స్టేషన్‌కి వచ్చిన ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా అపరాత్రి, అర్ధరాత్రి అనే లేకుండా వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిస్తూ ఆమెను నిత్యం వేధించడమే పని గట్టుకున్నాడు. సిఐ వేధింపులకు విసిగి వేసారిపోయిన ఆ మహిళ చివరకు పోలీసు కమిషనర్‌ని ఆశ్రయించి జరిగిన విషయమంతా ఆయన విన్నవించుకుంది. ఆమె ఫిర్యాదుపై స్పందించిన పోలీసు కమిషనర్‌ఈ కేసుపై తీవ్రంగా స్పందించి అసలు నిజాలను తెలుసుకుని సిఐ బెండు వెంకటరావును సస్పెండ్ చేశారు. ఆరు నెలల క్రితం బోర ఆదిలక్ష్మి అనే మహిళ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన భర్త వేధిస్తున్నాడు అంటూ ఫిర్యాదు చేసింది. ఫోర్‌పాయింట్ హోటల్‌లో పనిచేస్తున్న తన సహోద్యోగినే ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు ఫిర్యాదులో తెలిపింది. పెళ్లి తరువాత అతను నిత్యం తనకు నరకం చూపిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసులో ఆమె భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది. అయితే



అప్పటి నుంచి సిఐ ఆదిలక్ష్మిని వేధించడం మొదలు పెట్టాడు. తరచుగా ఆమెకు ఫోన్లు చేస్తుండడం, ఈ కేసు విషయమై పోలీస్ స్టేషన్‌కు కూడా తరచుగా పిలిపిస్తుండటం చేస్తుండేవాడు. ఇక అక్కడితో ఆగకుండా వాట్సాప్‌కి అసభ్యకర మెసేజ్‌లను పంపిస్తూ వేధిస్తుండేవాడు. ఆమెను లోబర్చుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని చేశాడు. అతని వేధింపులు తాళలేక ఒకానొక దశలో ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధ పడింది. అయితే తనలా ఏ మహిళా కూడా ఈ పోలీస్ అధికారి బారిన పడకూడదని బావించి నేరుగా సీపీకే ఫిర్యాదు చేసి జరిగిన విషయమంతా చెప్పింది. సిఐ పంపిన మెసేజ్‌లను కూడా సిపికి పంపించింది. సిఐ వెంకటరావు వికృత చేష్టలపై మండి పడ్డ పోలీసు కమిషనర్ టి.యోగానంద్ అతనిపై చర్యలకు ఉపక్రమించారు. విచారణలో సిఐ నిజస్వరూపం బయటపడటంతో అతనిపై వేటు వేసేందుకు ఆదేశాలిచ్చారు. తక్షణమే సిఐ వెంకటరావుని సస్పెండ్ చేశారు.

# సంక్రాంతికి 84 ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సంక్రాంతి సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు 84 ప్రత్యేక రైళ్లను నడిపించబోతుంది. తిరుపతి - విశాఖపట్టణం - తిరుపతి మధ్య 16, కాచిగూడ - విశాఖ మధ్య 4, విశాఖపట్టణం - తిరుపతి మధ్య 4, విజయవాడ, కాజీపేట మీదుగా తిరుపతి - కాచిగూడ మధ్య 4, హైదరాబాద్ - విశాఖపట్టణం హైదరాబాద్ మధ్య 4, సికింద్రాబాద్ - దర్భాంగ్ మధ్య 34, హైదరాబాద్ - రెక్సాల్ - హైదరాబాద్ మధ్య 18 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైళ్లు వివిధ కేంద్రాల నుండి ఈ నెల 7న ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి నెలలో కూడా ప్రత్యేక రైళ్లు నడిపించడం జరుగుతుందని వివరించారు. ప్రత్యేక రైళ్లు మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్లల్లో నిలుపుదల చేయడం జరుగుతుందని, స్పెషల్ ట్రైన్‌లలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేస్తారని తెలిపారు.

# క్రీడాప్రభ

## ఓడినా నెంబర్ వనే!

**దుబాయ్:** భారత జట్టు దక్షిణాఫ్రికా చేతిలో మూడు టెస్టుల్లోనూ ఓడినా ఐసీసీ నెంబర్ వన్ ర్యాంకుకు ఎలాంటి ఢోకా ఉండబోదు. ఐతే మూడో టెస్టుల్లోనూ గెలిస్తే దక్షిణాఫ్రికా.. భారత్ సరసన చేరుతుంది. ప్రస్తుతం ఆ జట్టు టీమ్ఇండియా కంటే 13 పాయింట్లు వెనుకబడి ఉంది. విరాట్ సేన 124 పాయింట్లతో నెంబర్ వన్ గా ఉంది. సిరీస్‌ను దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్ చేస్తే.. రెండు జట్లు 118 పాయింట్లతో నిలుస్తాయని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరిస్థితిలో కూడా భారతే ముందుంటుంది. దశాంశమాన పద్ధతి ప్రకారం భారత్ పాయింట్లు 118.47 అవుతాయి. దక్షిణాఫ్రికా 117.53 పాయింట్లతో నిలుస్తుంది. భారత్ మూడు టెస్టులు గెలిస్తే 128 పాయింట్లతో ఉంటుంది. దక్షిణాఫ్రికా పాయింట్లు 107 అవుతాయి. యాషెస్ గెలిచిన ఆసీస్ మూడో స్థానం పదిలపరచుకుంది. టెస్టు బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి కెరీర్‌లో తొలిసారి 900 పాయింట్ల మార్కును అందుకోనున్నాడు. ఇపుడతను 893 పాయింట్లతో ఉన్నాడు. పుజారా విరాట్ కంటే 20 పాయింట్లు తక్కువతో మూడో స్థానంలో ఉన్నాడు.





## ధావన్ ఫిట్... జడేజా డౌట్!

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో శుక్రవారం ఆరంభం కాబోయే మొదటి టెస్టుకు ఓపెనర్ శిఖర్ ధావన్ అందుబాటులో ఉంటాడు. కానీ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తొలి మ్యాచ్‌లో ఆడేది అనుమానమే. ధావన్ ఫిట్‌గా ఉన్నాడని, జడేజా గత రెండు రోజులుగా వైరల్ జ్వరంతో బాధపడుతున్నాడని బీసీసీఐ బుధవారం ఇక్కడో ప్రకటనలో తెలిపింది. భారత జట్టు వైద్య బృందం అతణ్ని పర్యవేక్షిస్తోందని అంది. మ్యాచ్ .జరిగే రోజు ఉదయం జడేజా అందుబాటుపై నిర్ణయం తీసుకుంటారని తెలిపింది. ''భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఫిట్‌గా ఉన్నాడు. ఎంపికకు అందుబాటులో ఉన్నాడు. ధావన్.. జట్టు దక్షిణాఫ్రికా బయులుదేరడానికి ముందు చీలమండ గాయానికి గురయ్యాడు'' అని బీసీసీఐ ఆ ప్రకటనలో తెలిపింది. ''జడేజా గత రెండు రోజులుగా వైరల్ జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్య బృందం పర్యవేక్షిస్తోంది. ఆసుపత్రిలో చేర్చాలని ఆ బృందం నిర్ణయించింది. అతను 48 గంటల్లో కోలుకుంటాడు. తొలి టెస్టుకు జడేజా అందుబాటు గురించి శుక్రవారం ఉదయం నిర్ణయం తీసుకుంటారు'' అని బీసీసీఐ చెప్పింది.



## భారత్-దక్షిణాఫ్రికా తొలి టెస్టు రేపటి నుంచి

**కేప్‌టౌన్:** దక్షిణాఫ్రికాతో భారత్ 3 టెస్టులు, 6 వన్డేలు, 3 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. మొదటి టెస్టు ఈనెల 5న (శుక్రవారం) ఆరంభమవుతుంది. టెస్టుల తర్వాత వన్డేలు, టీ20లు జరుగుతాయి.

**ఇదీ షెడ్యూలు**

**జనవరి 5-9:** తొలి టెస్టు (కేప్‌టౌన్‌లో భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి)

**జనవరి 13-17:** రెండో టెస్టు (సెంచూరియన్‌లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి)

**జనవరి 24-28:** మూడో టెస్టు (జొహాన్నెస్‌బర్గ్‌లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి)

**ఫిబ్రవరి 1:** తొలి వన్డే (డర్బన్‌లో భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4.30 నుంచి)

**ఫిబ్రవరి 4:** రెండో వన్డే (సెంచూరియన్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి)

**ఫిబ్రవరి 7:** మూడో వన్డే (కేప్‌టౌన్‌లో సాయంత్రం 4.30 నుంచి)

**ఫిబ్రవరి 10:** నాలుగో వన్డే (జొహాన్నెస్‌బర్గ్‌లో సాయంత్రం 4.30 నుంచి)

**ఫిబ్రవరి 13:** ఐదో వన్డే (పోర్ట్ఎలిజబెత్‌లో సాయంత్రం 4.30 నుంచి)

ఫిబ్రవరి 16: ఆరో వన్డే (సెంచూరియన్‌లో సాయంత్రం 4.30 నుంచి)

**ఫిబ్రవరి 18:** తొలి టీ20 (జొహాన్నెస్‌బర్గ్‌లో భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6 గంటల నుంచి)

**ఫిబ్రవరి 21:** రెండో టీ20 (సెంచూరియన్‌లో రాత్రి 9.30 నుంచి)

**ఫిబ్రవరి 24:** మూడో టీ20 (కేప్‌టౌన్‌లో రాత్రి 9.30 నుంచి).





# కొడితే కొట్టాలిరా..!

పచ్చటి పచ్చికతో విపరీతమైన వేగంతో ఉండే పిచ్‌లు... అరవీర భయంకరులైన పేస్ బౌలర్లు.. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించే బ్యాట్స్‌మెన్. ప్రపంచంలోని మేటి జట్లలో ఒకటి. తమ దేశం వచ్చిన ప్రతి జట్టును చిత్తుగా ఓడించే సేన. ఇదీ దక్షిణాఫ్రికా గురించి ప్రతి క్రికెట్ అభిమాని అభిప్రాయమిది. జట్టు గురించి సగటు అభిమాని అభిప్రాయంలో ఇసుమంతైనా అతిశయోక్తి లేదు. ఆటగాళ్లూ తిరుగులేని ప్రతిభావంతులే! ఐతే కాలం గడిచే కొద్దీ అక్కడి వికెట్లలో మార్పు వచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన పిచ్‌గా పేరుపడ్డ డర్బన్‌లోనే మన జట్టు 2010లో విజయాన్ని దక్కించుకుంది. అంతకు ముందు రెండు సార్లు.. 2013లోనూ దక్షిణాఫ్రికా గెలిచినప్పటికీ ఈ సారి టెస్టు వేదికగా డర్బన్ లేదు. కేప్‌టౌన్, సెంచూరియన్, జొహాన్నెస్ బర్గ్‌లు మూడు టెస్టులకు ఆతిథ్యమిస్తున్నాయి. జొహాన్నెస్‌బర్గ్‌లో భారత జట్టుకు మెరుగైన రికార్డే ఉంది. చివరి సారిగా కేప్‌టౌన్, జొహాన్నెస్ బర్గ్‌లలో టీమ్ ఇండియా మ్యాచ్‌ల్ని డ్రా చేసుకుంది. ఈ స్ఫూర్తితో కోహ్లి సేన విశ్వాసంతో శుక్రవారం తొలి టెస్టులోకి అడుగు పెట్టాలి. మొదటి టెస్టులో విజయాన్ని సొంతం చేసుకోవాలి. ఆ జోరులో సెంచూరియన్ టెస్టును డ్రా చేసుకోగలిగితే... అచ్చివచ్చిన జొహాన్నెస్ బర్గ్‌లో తుది పంచ్‌తో సిరీస్‌ను కైవసం చేసుకోవాలి. అందుకు తరుణమిదే. టీమ్ఇండియా ఈ మంచి తరుణాన్ని మించి పోనీరాదు. భారత్‌కు కలిసి వచ్చే అంశాలు చాలానే ఉన్నాయి. అవేంటో చూద్దాం!

**దక్షిణాఫ్రికాలో ఆడిన టెస్టు సిరీస్‌లు**

| ఏడాది | మ్యా | గె | ఓ | డ్రా |
|---|---|---|---|---|
| 1992-93 | 4 | 0 | 1 | 3 |
| 1996-97 | 3 | 0 | 2 | 1 |
| 2001-02 | 2 | 0 | 1 | 1 |
| 2006-07 | 3 | 1 | 2 | 0 |
| 2010-11 | 3 | 1 | 1 | 1 |
| 2013-14 | 2 | 0 | 1 | 1 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలుపు, ఓ: ఓటమి

**దక్షిణాఫ్రికాలో భారత్**

| టెస్టులు | గెలుపు | ఓటమి | డ్రా |
|---|---|---|---|
| 17 | 2 | 8 | 7 |

ఆంధ్రప్రభ, క్రీడావిభాగం

ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మెన్... అద్భుతంగా రాణిస్తున్న పేసర్లు.. పరుగుల వరద పారిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్న కెప్టెన్. ఇటు బ్యాటింగ్‌లో.. అటు బౌలింగ్‌లో పుష్కలంగా అవకాశాలు. ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్న పాండ్య. అందుకే దక్షిణాఫ్రికాలో తొలి సిరీస్ విజయాన్ని లిఖించడానికి ఇది సరైన సమయం. ఈ పర్యటనలో సిరీస్ గెలుపు టీమ్ఇండియా విశ్వాసాన్ని అమాంతం హిమాలయాలంత ఎత్తుకు పెంచేస్తుందనడంలో సందేహం లేదు. ఈ ఏడాదిలో తదుపరి జరిగే కఠినమైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలు జట్టును భయపెట్టవు... సరికదా ఈ స్ఫూర్తితో ఆ సిరీస్‌ల్నీ గెలవచ్చు.

### ఆ రెండు పర్యటనలే స్ఫూర్తి

దక్షిణాఫ్రికాలో భారత జట్టు ఇంతవ రకు ఆరు సార్లు పర్యటించింది. తొలి నాలుగు సిరీస్‌ల్లోనూ దక్షిణాఫ్రికాదే విజయం. తొలి పర్యటనలో వారి జట్టు గెలిచింది.. ఒక్క టెస్టు మాత్రమే. తొలి రెండు మ్యాచ్‌ల్ని భారత్ డ్రా చేసుకోగా... పోర్ట్ఎలిజబెత్ టెస్టులో దక్షిణాఫ్రికా గెలిచింది. చివరిదైన డర్బన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తర్వాత నాలుగు సార్లు భారత జట్టు ఆ దేశంలో పర్యటించినా 2006లో జొహాన్నెస్ బర్గ్‌లో కాని తొలి విజయాన్ని దక్కించుకోలేకపోయింది. 2010లో డర్బన్‌లో కాని మరో గెలుపును సొంతం చేసుకోలేకపోయింది. ఈ విజయమే ఒక రకంగా దక్షిణా ఫ్రికా ఆధిపత్యానికి గండి కొట్టింది. 2010, 2013 పర్యటనల్లో భారత జట్టు ఆ గడ్డపై మెరుగైన ప్రదర్శన చేసింది. 2010-11లో జరిగిన 3 టెస్టుల సిరీస్‌లో టీమ్ఇండియా ఒకటి ఓడి (సెంచూరిన్), ఒకటి (డర్బన్) గెలిచింది. ఒక మ్యాచ్ (కేప్‌టౌన్) డ్రాగా ముగిసింది. సెంచూరియన్లో దక్షిణాఫ్రికా గెలవగా.. డర్బన్‌లో భారత్ విజయం సాధించింది. జొహాన్నెస్ బర్గ్ మ్యాచ్ డ్రాగా ముగియంతో సిరీస్ 1-1తో సమమైంది. చివరి సారిగా 2013లో ఆడిన రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 0-1తో ఓడిపోయింది. డర్బన్‌లో ఓడి... జొహాన్నెస్ బర్గ్‌లో డ్రా చేసుకుంది. ఈ సారి డర్బన్ టెస్టు వేదిక కాదు. 2010 పర్యటనలో కేప్‌టౌన్ మ్యాచ్‌ను డ్రా చేసుకున్న జ్ఞాపకాలతో ఈ సారి పర్యటనను ఆరంభించాలి. ఈ టెస్టులో శ్రమించి భారత జట్టు గెలవగలిగితే... అనంతరం సెంచూరియన్ టెస్టును కనీసం డ్రా చేయగలుగుతుంది. ఇక కలిసి వచ్చే జొహాన్నెస్‌బర్గ్‌లో చివరి పంచ్‌తో అదరగొట్టాలి.

### దృక్పథమే ప్రధానం

దక్షిణాఫ్రికా వంటి పేస్ పిచ్‌లపై బ్యాట్స్‌మెన్ దృక్పథమే ప్రధానం. నిప్పులు చెరిగే బంతులు వేసే వారి పేసర్లను ఎదుర్కోవాలంటే బ్యాట్స్‌మెన్‌కు సహనం, ఓర్పు అవసరం. దీంతో తొలి స్పెల్ కీలకమవుతుం ది. బ్యాట్స్‌మెన్ కొత్త బంతిని ఎలా ఎదుర్కోంటారన్న అంశంపైనే ఇన్నింగ్స్ ఆధారప డివుంటుంది. కొత్త బంతిని సమర్థంగా ఎదుర్కోగలిగితే ఇన్నింగ్స్ వేగం పెంచొచ్చు. కొత్త బంతిని సమర్థంగా ఆడడంతో పాటు పరుగులు సాధించాలి. స్ట్రయికింగ్ రొటేట్ చేయాలి. దీనిపై ఆధారపడే తొలి రోజు ఆట సాగేది. అది ఆశావహమా.. లేక నిరాశజనకమా అన్నది నిర్ణయమైపోతుంది. కొత్త బంతి కీలకమే కాని.. నిజానికి 18 లేదా 20వ ఓవర్ నుంచి బ్యాట్స్‌మెన్‌కు అసలు సిసలు పరీక్ష మొదలవుతుంది. ఈ దశ 40, 50 ఓవర్లకు సాగుతుంది. వికెట్ ఫ్లాట్‌గా ఉంటే బంతి రివర్స్ స్వింగ్ అయి మరింత ఇక్కట్లకు గురి చేస్తుంది. విదేశీ పరిస్థితుల్లో తొలి 25 ఓవర్లు కీలకమనే చెప్పాలి. తొలి టెస్టు జరిగే కేప్‌టౌన్ పిచ్‌పై ఒకప్పుడు విపరీతంగా మూవ్‌మెంట్ ఉండేది. కానీ రానురాను బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. ఎగిసి వచ్చే బౌంతుల్ని విడిచిపెట్టడం మేలు. ఇలాంటి పిచ్‌లపై ఆచితూచి ఆడాల్సిందే. దక్షిణాఫ్రికా ప్రధాన బౌలింగ్ అస్త్రం డేల్ స్టెయిన్ తొలి టెస్టులో ఆడేది అనుమానం కావడం కూడా భారత బ్యాట్స్‌మెన్‌కు కలిసివచ్చేదే. ప్రస్తుతం భారత బ్యాట్స్‌మెన్ ఫామ్‌ను బట్టి చూస్తే క్రీజులో కుదురుకుని ఆడడం వారికి సమస్య కాబోదు. ఐతే వైస్ కెప్టెన్ అజింక్య రహానే ఫామ్ ఒక్కటే ప్రస్తుతం టీమ్ఇండియా యాజమాన్యాన్ని ఆందోళన పరుస్తున్న అంశం. విదేశీ పర్యటనల్లో అద్వితీయ రికార్డున్న రహానే ఈ పర్యటనలో కీలక సమయంలో ఫామ్‌ను అందుకుంటాడని జట్టు నమ్మకంతో ఉంది.

### పక్కాగా.. ఫుట్‌వర్క్

బ్యాట్స్‌మెన్‌కు క్రమశిక్షణ చాలా అవసరం. ఉపఖండం వెలుపల అదే కీలకమవుతుంది. దీనితో పాటు పేస్ పిచ్‌లపై ఆడే బ్యాట్స్‌మెన్‌కు లోపాలకు తావులేని ఫుట్‌వర్క్ ఉంటే క్రీజులో పాతుకుపోగలుగుతాడు. తిరుగులేని ఫుట్‌వర్క్ ఉండాలంటే బ్యాట్స్‌మెన్ మనసులో ఎలాంటి సంకోచాలు ఉండకూడదు. బుర్ర స్వేచ్ఛగా ఉంటే పాదం కూడా స్వేచ్ఛగా కదులుతుంది. ఈ రెండు ఎంతో ప్రధానమైన అంశాలు.

### బౌలింగ్‌లో క్రమశిక్షణ

గత ఏడాది ఉపఖండపు పిచ్‌లపై.. విండీస్‌లో అద్భుతంగా రాణించిన భారత్ బౌలర్లు కొత్త పరిస్థితుల్లో బౌలింగ్ చేయబోతున్నారు. ప్రధాన పేసర్లు భువనేశ్వర్ కుమార్, ఉమేశ్ యాదవ్‌లకు ఇదే తొలి దక్షిణాఫ్రికా పర్యటన. భారత్ పేసర్లు దక్షిణాఫ్రికా పిచ్‌లపై క్రమశిక్షణతో బౌలింగ్ చేయాల్సివుంటుంది. వేగాన్ని అదుపు తప్పితే పరుగుల వరదే. సరైన ప్రాంతంలో బంతిని వేసినపుడే ఫలితాలు వచ్చేది. షమి, ఇషాంత్‌కు మినహా భువీ, యాదవ్, పాండ్యలకు దక్షిణాఫ్రికా పిచ్‌లు కొత్తే. ఇది ఒక రకంగా భారత్ విజయావకాశాలపై ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు.



### స్లిప్‌లో క్యాచ్‌లందుకుంటేనే..

గత ఐదేళ్లలో టెస్టు ల్లో 407 వికెట్లు ఫాస్ట్ బౌలింగ్లో క్యాచ్‌ల వల్ల కూలినవే. వీటిలో 131 క్యాచ్‌లు స్లిప్‌లలో, గల్లీ ప్రాంతంలో పట్టినవే. ఈ కాలంలో భారత్‌లో 150 వికెట్లు పతనం కాగా.. 38 వికెట్లు స్లిప్, గల్లీలో క్యాచ్‌ల ద్వారా వచ్చాయి. భారత్‌ను ఆందోళన కలిగించే అంశం ఇదే. దక్షిణాఫ్రికాలోని పిచ్‌లపై వికెట్లు ఎక్కువగా స్లిప్‌లలో క్యాచ్‌ల రూపంలో వస్తాయి. కాని స్లిప్ క్యాచింగ్‌లో భారత్ రికార్డు పేలవంగా ఉంది. 2013-14 పర్యటనలో భారత ఫీల్డర్లు స్లిప్, గల్లీలో కనీసం 45 క్యాచ్‌లు జారవిడిచారు. విశేషమేమంటే స్లిప్‌లలో క్యాచింగ్ అవకాశాల్ని దక్షిణాఫ్రికా బౌలర్ల కంటే భారత్ బౌలర్లు ఎక్కువగా ఇవ్వడం. స్లిప్ లేదా వికెట్ల సమీపలో ఫీల్డింగ్ చేసే విజయ్, ధావన్, రాహుల్, విరాట్, రహానే రోహిత్ ఏమరు పాటుకు తావులేకుండా క్యాచ్‌లు అందుకోవాలి. అపుడే మ్యాచ్‌లు సొంతమయ్యేది.

## బెంగళూరులో విరాట్... చెన్నైలో ఎం.ఎస్. ధోని!

**ముంబై:** టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, మాజీ సారథి ధోని.. ఐపీఎల్‌లో తమ తమ ఫ్రాంచైజీలలోనే కొనసాగనున్నారు. విరాట్.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌కాగా.. మళ్లీ ఐపీఎల్‌లోకి తిరిగి వచ్చిన చెన్నై సూపర్ కింగ్స్ ధోనీని అట్టేపెట్టుకోనుంది. పాత ఫ్రాంచైజీలతో కొనసాగే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐ గురువారం ప్రకటించనుంది. 2018-2020 మూడు సీజన్లకు విరాట్, ధోనీలను ఆయా ఫ్రాంచైజీలు అట్టేపెట్టుకుంటాయి. అగ్రశ్రేణి ఆటగాళ్లలో రోహిత్ శర్మను ముంబై ఇండియన్స్ అట్టేపెట్టుకుంటుంది. ఆల్‌రౌండర్ పాండ్య, జడేజా, ఆసీస్ ఆటగాడు డేవిడ్ వార్నర్ (హైదరాబాద్)లు కూడా పాత ఫ్రాంచైజీలో కొనసాగుతారు.





మూడో టీ20లో విండీస్‌ను చిత్తు చేసిన కివీస్

## మన్రో రికార్డు సెంచరీ

**మౌంట్ మౌగనీ (విండీస్):** ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కొలిన్ మన్రో (104, 53 బంతుల్లో, 3 ఫోర్లు, 10 సిక్స్) సిక్సర్లతో విరుచుకుపడి రికార్డు సెంచరీ బాదడంతో మూడోదైన చివరి టీ20లో న్యూజిలాండ్ 119 పరుగుల తేడాతో విండీస్‌పై విజయం సాధించింది. బుధవారం ముందుగా మన్రో విజృంభణతో 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. మన్రో 53 బంతుల్లోనే 104 పరుగులు సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో మూడు శతకాలు చేసిన క్రికెటర్‌గా మన్రో రికార్డుల పుటలకెక్కాడు. టీ20ల్లో న్యూజిలాండ్‌కిదే అత్యధిక స్కోరు. అనంతరం విండీస్ 16.3 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది.




మన్రో

## ఇంగ్లండ్ జట్టులో 20 ఏళ్ల స్పిన్నర్

### నేటి నుంచి యాషెస్ చివరి టెస్టు; వోక్స్ దూరం

**సిడ్నీ:** ఇంగ్లండ్‌కు యువ స్పిన్నర్ మాసన్ క్రేన్.. టెస్టు అరంగేట్రం చేయనున్నాడు. 20 ఏళ్ల క్రేన్ గురువారం ఇక్కడ ఆస్ట్రేలియాతో ఆరంభం కాబోయే యాషెస్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టులో ఆడనున్నాడు. గాయానికి గురైన ఆల్‌రౌండర్ క్రిస్ ఓక్స్ స్థానంలో క్రేన్ తొలి ఆడతాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ జోయ్ రూట్ తెలిపాడు. యాషెస్ సిరీస్‌ను ఆసీస్ ఇప్పటికే 3-0తో వశం చేసుకుంది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది.



## వన్డేల నుంచి మ్యాక్స్‌వెల్ ఔట్



**సిడ్నీ:** ఇంగ్లండ్‌తో ఆడనున్న ఐదు వన్డే మ్యాచ్‌లకు డాషింగ్ బ్యాట్స్‌మన్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌ను ఆస్ట్రేలియా జట్టుకు ఎంపికచేయలేదు. మ్యాక్స్‌వెల్ ఇప్పటివరకు ఆస్ట్రేలియా తరపున 80 అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లు ఆడాడు. మ్యాక్స్ నిజానికి మంచి బ్యాట్స్‌మన్ కాని ఆయనలో స్థిరత్వం లోపించింది. ఆ లోపాన్ని సరిదిద్దుకుంటే ఆయన మళ్లీ జట్టులోకి రావడం ఖాయం అని స్మిత్ అన్నారు. **ఇంగ్లండ్‌తో వన్డేలకు ఆస్ట్రేలియా జట్టు:** స్టీవ్‌స్మిత్. డేవిడ్ వార్నర్, పాట్రిక్ కమిన్స్, ఆరొన్ ఫించ్ జోష్‌వుడ్, ట్రావిస్ హెడ్, క్రిస్ లిన్ మిచెల్ మార్ష్, టిమ్ పెయినీ, జెయ్ రిచర్డ్సన్ మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోయినిస్, అండ్రూటై, ఆడం జంపా.

## అండర్-19 ప్రపంచకప్‌లో ఇద్దరు భారత అంపైర్లు

**దుబాయ్:** అండర్-19 ప్రపంచకప్ టోర్నీకి ఇద్దరు భారత అంపైర్లను ఎంపికచేసినట్లు ఐసిసి (అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్) ప్రకటించింది. ఈ మేరకు ఐసిసి బుధవారం ఒక ప్రకటన చేస్తూ.. ఈనెల 13న న్యూజిలాండ్‌లో ప్రారంభంకానున్న అండర్-19 ప్రపంచకప్‌కు 14 మంది అధికారులతో కూడిన ప్యానెల్‌కు భారత్‌కు చెందిన అనిల్ చౌదరీ, సికె నందన్‌లను ఎంపికచేసినట్లు తెలిపింది. మిగతా 12 మందిలో... రాబర్ట్ బెయిలీ, గ్రెగరీ బ్రాత్‌వెయితె, నిగెల్ దుగిడ్, షువాన్ జార్జి, షువాన్ హెయిగ్, మార్క్ హాతోర్న్, రన్‌మోర్ మార్టినెజ్, అహసాన్ రాజా, షోయబ్‌రాజా, తిమోతి రాబర్ట్ రాబిన్‌సన్, లాంగ్‌టన్ రస్రీ, పాల్ విల్సన్ ఉన్నారు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.